www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 | సంచిక : 208 | సోమవారం 21-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 14+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

మాలీలో శాంతిదళాలపై దాడి



మాలే : మాలీలో ఉన్న ఐక్యరాజ్యసమితి శాంతిదళాల స్థావరంపై తుపాకీ ధరించిన వ్యక్తి ఆదివారం కాల్పులు జరపడంతో 8 మంది చనిపో యారని మినుస్మా దళాల వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది. అల్జీరియా సరిహద్దుల్లో గల కీడల్ 200 కిమీ దూరంలో అగుల్ హక్ స్థావరంపైన కాల్పులు జరిపారు. మొదట ఆరుగురే చనిపోయినట్లుగా తెలిసింది. ఆతర్వాత ఈ సంఖ్య ఎనిమిదికి పెరిగింది. ఈ కాల్పుల్లో 19 మంది గాయాలపాలైయ్యారు. గతేడాది ఏప్రిల్‌లో కూడా ఇదే స్థావరంపై దాడి జరిగి ఇద్దరు మరణించారు. ఐక్యరాజ్యసమితి 13 వేల మంది శాంతి దళాలను మాలీలో నియమించింది. ఉత్తర మాలీ ప్రాంతాన్ని ఇస్లాం మిలీషియా స్వాధీనం చేసుకొని ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నించాయి. అయితే 2013లో ఫ్రాన్స్ దళాలు వచ్చి, మిలిషియాలను అక్కడి నుంచి పారదోలాయి. అయినప్పటికీ ఇంకా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

ఆఫ్ఘన్ గవర్నర్‌పై దాడి



మాస్కో : ఆఫ్ఘనిస్థాన్ రాష్ట్ర గవర్నర్ కాన్వాయ్‌పై మిలిటెంట్లు దాడి చేయగా, 9 మంది మృతి చెందారు. మరో 10 మంది గాయాలపాలయ్యారు. లోగర్ రాష్ట్రంలో గవర్నర్ ఇతర సీనియర్ అధికారులు ప్రయాణిస్తున్న వాహనాలపైన మిలిటెంట్లు దాడి చేసినట్లు ఖామ వార్తాసంస్థ తెలిపింది. ఆఫ్ఘనిస్థాన్‌లో దాదాపు 17 ఏళ్లుగా అంతర్యుద్ధం సాగుతూనే ఉంది. తాలిబన్లు, ఇతర రాడికల్ గ్రూపులు దాడులు సాగిస్తూనే ఉన్నాయి. దాయిష్‌తో సహా వివిధ టెర్రరిస్టు గ్రూపులు ఇప్పటికీ ముమ్మరంగానే తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. శాశ్వత శాంతి కోసం తాలిబన్లతో చర్చలు జరుగుతున్నప్పటికీ ఇంకా అవి ఒక కొలిక్కి రాలేదు.

విశాలాంధ్ర ప్రపంచం

ట్రంప్-కిమ్ భేటీ వివరాలు త్వరలో..

వాషింగ్టన్ : ఫిబ్రవరి చివరిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్ ఉన్ రెండోసారి భేటీ కానున్నారు. ఎక్కడ కలవాలన్న అంశాన్ని నిర్ణయించామని త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ట్రంప్ విలేకరులకు తెలియచేశారు. పూర్తి వివరాలను ఆయన వెల్లడించలేదు. వియత్నాం రాజధాని హనోయి లేదా తీరప్రాంత నగరం దనాంగ్‌లోగాని ట్రంప్-కిమ్ సమావేశం జరగవచ్చునని ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నామని ఇక్కడి ప్రభుత్వ అధికార వర్గాలు ఏఎఫ్‌పీ వార్తాసంస్థకు తెలియజేశారు. ఇరువురు నేతల శిఖరాగ్ర సమావేశాన్ని వైట్ హౌస్ ఇప్పటికే ధృవీకరించింది. ఉత్తర కొరియా సీనియర్ నేత ఒకరు ఇటీవల వాషిగ్టన్‌లో పర్యటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడినట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం ఉత్తరకొరియా అధ్యక్షుడికి సన్నిహితంగా ఉండే వైస్ ఛైర్మన్ కిమ్ యాంగ్ చోల్ అమెరికాలో పర్యటించి ట్రంప్‌ను కలుసుకొని వెళ్లారు. వీరిరువురి మధ్య 90 నిముషాల సేపు చర్చలు జరిగాయి. ప్రధానంగా కొరియా ద్వీపకల్పంలో అణునిరాయుధీకరణపై చర్చలు జరిగి ఉంటాయని భావిస్తున్నారు. గతేడాది జూన్‌లో ట్రంప్-కిమ్ మధ్య మొదటిసారి శిఖరాగ్ర సమావేశం జరిగింది. అప్పుడు అణునిరాయుధీకరణపై అస్పష్టమైన ఒడంబడికను కుదుర్చుకొని ఇరువురు నేతలు సంతకాలు చేశారు. అనంతరం రెండు దేశాల మధ్య తదుపరి చర్చలు జరగలేదు. కొరియా ద్వీపకల్పంలో పూర్తి అణునిరాయుధీకరణను అమలు చేస్తేనే ఉత్తర కొరియా పైన ఆంక్షలు తొలగిస్తామని అమెరికా చెబుతూ వస్తోంది. అయితే తమ దేశ భద్రతకు తగిన హామీని ఇస్తేనే అణునిరాయుధీకరణను అమలు చేస్తామని ఉ.కొరియా స్పష్టం చేసింది. అలాగే ద. కొరియాలో 28,500 మంది అమెరికా సైన్యం తిష్టవేసింది. ఈ కేంద్రాన్ని మూసివేసి అమెరికా తన సైన్యాన్ని వెనక్కి పిలిపించాలని ఉ. కొరియా కోరుతోంది. ట్రంప్-కిమ్ మధ్య భేటీని జపాన్ ప్రభుత్వం ఆహ్వానించింది. రెండవసారి జరుగుతున్న ఈ సమావేశం కొరియా ద్వీపకల్పంలో శాంతి నెలకొనేందుకు స్పష్టమైన ఫలితాలను ఇవ్వగలదన్న ఆశాభావాన్ని జపాన్ రక్షణ మంత్రి టకిషి ఎల్‌వయా వ్యక్తం చేశారు.



ట్రంప్ కొత్త ప్రతిపాదనకు డెమోక్రాట్ల నో

వాషింగ్టన్ : మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి 5.7 బిలియన్ డాలర్ల నిధులను ఇచ్చేందుకు ప్రతినిధుల సభ తిరస్కరించడంతో ట్రంప్ ప్రభుత్వానికి సభకు మధ్య ప్రతిష్టంభన ఏర్పడింది. ట్రంప్ ప్రభుత్వం దాదాపు నెలరోజులుగా పాక్షికంగా మూతపడింది. ఈ ప్రతిష్టంభన తొలిగేందుకు 10 లక్షల మంది వలసదారులను బయటికి పంపివేయకుండా వారికి ఆశ్రయం కల్పిస్తామని, అందువల్ల మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి నిధులు ఇవ్వాలని ట్రంప్ తాజాగా చేసిన ప్రతిపాదనను కూడా డెమోక్రాట్లు తిరస్కరించారు. ప్రతినిధుల సభలో డెమోక్రాట్లే ప్రస్తుతం ఆధిక్యతలో ఉన్నారు. రెండు పక్షాల మధ్య జరిగిన చర్చలు కూడా విఫలమయ్యాయి. కొన్ని శాఖలు మాత్రమే పనిచేస్తున్నందున అనేక ప్రభుత్వ కార్యకలాపాలు నిలిచిపోయాయి. దాదాపు 8 లక్షల మంది సిబ్బందికి ఇంకా వేతనాలు చెల్లించలేదు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ రెండు కేటగిరీల వలసదారులకు ఆశ్రయం కల్పించేందుకు చేసిన ప్రతిపాదన కూడా ప్రతిష్టంభనను తొలగించలేకపోతోంది. అమెరికాలో చట్టరహితంగా స్థిరపడిన వలసదారుల పిల్లలను వారి వారి దేశాలకు పంపిం చాలని మొదట ట్రంప్ నిర్ణయించారు. అయితే విమర్శలు వెల్లువెత్తడంతో ఆ ప్రతిపాదనను విర మించుకున్నారు. ఇప్పుడు 7లక్షల మంది పిల్లలను, 3 లక్షల మంది ఇతర వలసదారులను బయటికి పంపివేయకుండా వారికి రక్షితమైన హోదాను కల్పిస్తామని ట్రంప్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపా దన వల్ల తనపై విశ్వాసం ఏర్పడి నిధులు అందిస్తారని ట్రంప్ భావించారు. ప్రభుత్వం మూత పడటంతో వివిధ శాఖలకు నిధుల కేటాయింపు కూడా ఆగిపోయింది. దేశ ముఖద్వారాల్లోని ఓడరేవులలోకి అక్రమంగా ప్రవేశించే నౌకలలో మాదక ద్రవ్యాలను కనిపెట్టేందుకు సాంకేతికతక కోసం 805 మిలియన్ డాలర్లు, తక్షణ మానవీయ సహాయానికి మరో 800 మిలియన్ డాలర్లు విడుదల చేయాలని ట్రంప్ కాంగ్రెస్‌కు విజ్ఞప్తి చేశారు.

బ్రిటన్ ఎంపీల తీరుపై ప్రధాని ఆందోళన



లండన్ : బ్రెగ్జిట్ ముసాయిదా ఒప్పందాన్ని తిరస్కరించిన తర్వాత ఎంపీలు దిగువసభను (హౌస్ ఆఫ్ కామన్స్) తమ నియంత్రణలోకి తీసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలపై ప్రధాని థెరిసామే కార్యాలయం ఆందోళ వ్యక్తం చేసింది. సభను తమ చేతిలోకి తీసుకొని నడిపించాలని ఎంపీలు వ్యూహం పన్నుతు న్నారని ప్రధాని కార్యాలయం పేర్కొంది. థెరిసా బ్రెగ్జిట్ ప్రణాళికను ముందుకు వెళ్లకుండా చేసేందుకు ఎంపీలు దిగువ సభను నియంత్రించ డానికి అవసరమైన నియమ నిబంధనలను తిరిగి రూపొందించాలని వ్యూహం పన్నినట్లు ప్రధాని కార్యాలయాన్ని ఉటంకిస్తూ వార్తా పత్రికలు వార్తను అందించాయి. ఇందుకు అవసరమైన సవరణలను కూడా ఎంపీలు ప్రతిపాదించనున్నట్లు తెలుస్తోంది. 2016లో జరిగిన రిఫరెండంలో స్వల్ప మెజారిటీతో యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి వైదొలిగేందుకు దేశ ప్రజలు అంగీకరించారు. ఇటీవల కుదిరిన ముసాయిదా ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంటులో అత్యధిక మంది ఎంపీలు తిరస్కరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారాన్ని తగ్గించి వేసి సభను తమ నియంత్రణలోకి తీసుకునేందుకు కావలసిన న్యాయపరమైన నిబంధనల కోసం ఎంపీలు ప్రయ త్నిస్తున్నారని ఆ వార్తలు తెలియచేశాయి. ఈయూ నుంచి బ్రిటన్ వైదొలిగేందుకు కుదిరిన ఒప్పందాన్ని ఎంపీలు ఆమోదించకపోతే రాజకీయ సునామీ వస్తుందని విదేశాంగ వాణిజ్య శాఖ మంత్రి లియాం ఫాక్స్ వ్యాఖ్యానించారు. ఈయూతో ఒప్పందం కుదరకుండానే దానితో తెగతెంపులు చేసుకోవాలన్న ప్రతిపాదనను ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజల ఆకాంక్షకు భిన్నంగా ఎంపీలు నిర్ణయం తీసుకున్నారని ఆయన అన్నారు. ఫాక్స్ తొలి నుంచి బ్రెగ్జిట్‌కు అనుకూలమైన మంత్రిగా పనిచేస్తున్నారు.

సూడాన్‌లో శాంతిపై మరో సమావేశం



ఖర్టౌమ్ : సూడాన్‌లో శాంతి నెలకొల్పేందుకు దేశరాజధానిలో వచ్చేవారం మరోసారి సమావేశం జరుగుతుందని అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. 14 ప్రతిపక్ష గ్రూపులతో శాంతి చర్చలు ఒకసారి జరిగాయి. మరోసారి ఈనెల 24న చర్చలు జరుగుతాయని ప్రతిపక్ష గ్రూపులన్నీ ఇందులో పాల్గొంటాయని సూడాన్ విదేశాంగ మంత్రి అల్ దిర్దిరి అహ్మద్ తెలిపారు. ఆఫ్రికన్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ చర్చలు జరుగుతాయి. పరిపాలన వికేంద్రీకరణ, సాధారణ నేరాలకు క్షమాభిక్ష, వివిధ పోరాట దళాల ఏకీకరణ, రాజకీయ పక్షాలకు ప్రభుత్వంలో భాగస్వామ్యం లాంటి అంశాలపైన ఈ చర్చలు జరగనున్నాయని అహ్మద్ తెలిపారు. దేశ భద్రత, సుస్థిరతపైన తమ ప్రభుత్వం శ్రద్ధ వహిస్తోందని దేశంలో శాంతి కోసం ప్రభుత్వం సానుకూలంగా పనిచేస్తుందని ఆయన తెలిపారు. గతేడాది ఆగస్టులో మొదటిసారి రెండు పక్షాల మధ్య చర్చలు జరిగాయి. అవగాహనా పత్రంపై సంతకాలు చేసిన తర్వాత మరోసారి చర్చలు జరపాలని నిర్ణయం తీసుకున్నారు. దేశంలో హింసను, తీవ్రవాదాన్ని పూర్తిగా రూపుమాపేందుకు, వైరుధ్యాలను విడనాడేందుకు, అలాగే పౌరులకు స్వేచ్ఛ, ఇతర దేశాలతో వాణిజ్యానికి కూడా అవసరమైన ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు సంయుక్త కమిటీని ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు. 2013 నుంచి సెంట్రల్ ఆఫ్రికాలోని సూడాన్‌లో మత, జాతిపరమైన సంఘర్షణలు ముస్లింలు, మెజారిటీగా ఉన్న సెలిక సాయుధ దళాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ ఘర్షణల్లో సెలికా సాయుధ దళాలు అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. అనంతరం జరిగిన పరిణామాల్లో రెండు పక్షాలు చర్చలకు అంగీకరించాయి.

నల్ల సముద్రంలో అమెరికా మిసిలీ



మాస్కో : నల్ల సముద్రంలో శత్రు నౌకలను ధ్వంసం చేయగల అమెరికాకు చెందిన మిసిలి ప్రవేశించింది. ఈ మిసిలీ పేరు డొనాల్డ్ కుక్. గైడెడ్ మిసిలీ డిస్ట్రాయర్‌గా పేరొపొందింది. నల్ల సముద్రంలో ఈ మిసిలీ ప్రవేశాన్ని ఇంటర్ ఫాక్స్ న్యూస్ ఏజెన్సీ అందించిందని రష్యా నేషనల్ డిఫెన్స్ కంట్రోల్ సెంటర్ ప్రకటించింది. ఈ అంశాన్ని రష్యాకు చెందిన బ్లాక్‌సీ దళాలు నిరంతరం గమనిస్తున్నాయి. శనివారం రాత్రి 8.50 గంటల ప్రాంతంలో అమెరికా మిసిలి నల్ల సముద్రంలో ప్రవేశించింది. అనంతరం దాని కార్యకలాపాలను రష్యన్ నౌకాదళం పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఉన్న నియమ, నిబంధనల ప్రకారం ఇతర దేశాల పరిధిలో ఉన్న సముద్ర జలాలలోకి అమెరికా యుద్ధ నౌక ప్రవేశించరాదు. ఒకవేళ ప్రవేశించినా 21 రోజుల కంటే అదనంగా ఆ ప్రాంతంలో ఉండరాదని టాస్ వార్తా ఏజెన్సీ తెలియచేసింది. సముద్ర ప్రాంతాల్లో భద్రతా కార్యకలాపాల నిర్వహణ కోసమే తమ యుద్ధ నౌక నల్ల సముద్రంలో ప్రవేశించిందని అమెరికా నావికాదళం ప్రకటించింది. అజోవ్ సముద్రం మీదుగా ప్రయాణించే వాణిజ్య నౌకలను రష్యా తనిఖీ చేస్తోంది. కెర్చ్ స్ట్రయిట్‌లో వంతెనను నిర్మించిన తర్వాత వాణిజ్య నౌకలను రష్యా తనిఖీలు ప్రారంభించింది.

'విశ్వరూప' మహాసభకు సీపీఐ మద్దతు



దాసరి భవన్‌లో సీపీఐ నేతలు రామకృష్ణ, ముప్పాళ్ల, జల్లి విల్సన్‌లను కలిసిన మందకృష్ణమాదిగ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్దత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యానికి నిరసనగా ఫిబ్రవరి 19వ తేదీన ఎమ్మార్పీఎస్ నిర్వహించ తలపెట్టిన విశ్వరూప మహాసభకు సీపీఐ రాష్ట్ర కమిటీ తరపున సంపూర్ణ మద్దతునిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ దాసరి భవన్‌లో ఆదివారం రామకృష్ణను కలసి విశ్వరూప మహాసభలో పాల్గొనాలని ఆహ్వానించారు. అనంతరం రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో అసెంబ్లీలో ఏకగ్రీవంగా అన్ని రాజకీయపార్టీల ఆమోదంతో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియపై తీర్మానాన్ని ఆమోదించినట్లు చెప్పారు. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ పట్టించుకోకుండా పలు దఫాలుగా వాయిదాలు వేస్తున్నారే కానీ సమస్యను పరిష్కరించలేదన్నారు. ఉపరాష్ట్రపతిగా ఉన్న వెంకయ్య నాయుడు, సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి సమక్షంలో లక్షలాది మందితో మంద కృష్ణ హైదరాబాద్‌లో భారీ సభను నిర్వహించారని గుర్తు చేశారు. దీంతో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశించినప్పటికీ ఫలితం లేదన్నారు. అమరావతి కేంద్రంగా జరిగే విశ్వరూప మహాసభ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సహకరించాలని రామకృష్ణ కోరారు. మంద కృష్ణ మాట్లాడుతూ ఫిబ్రవరి 19న అమరావతి కేంద్రంగా మాదిగ, రెల్లి మొత్తం ఉపకులాల ప్రజల విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు హామీ ఇచ్చిన మోడీ ఇప్పుడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. తమకు అనుకూల చట్టాలను ఆఘమేఘాలపై ఆమోదింప చేసుకుంటున్న మోడీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చట్టంపై ఎందుకు శీతకన్ను వేస్తుందని మంద కృష్ణ ప్రశ్నించారు. ఇటీవల ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టాన్ని తీసుకొచ్చి ఉభయ సభలతోపాటు రాష్ట్రపతి ద్వారా ఆమోదింప చేసిందన్నారు. ఎలాంటి కమిషన్లు, కమిటీల నివేదికలు లేకుండానే ఈ బిల్లును ఆమోదించారని తెలిపారు. అగ్రకులాల్లో పేదలకు న్యాయం జరగడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఈబీసీ రిజర్వేషన్లను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. కానీ 25 ఏళ్లుగా అన్ని రాజకీయపార్టీలు సమర్ధిస్తున్న, కమిషన్ నివేదిక ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని మూలనపెట్టడం దళితుల పట్ల మోడీ చిన్నచూపుకు నిదర్శనమన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కూడా కన్పిస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి పెద్దమాదిగ అనిపించుకుంటానన్న చంద్రబాబు... ఎన్నికల్లో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించారన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం వర్గీకరణకు తీర్మానం చేస్తే అక్కడ మద్దతు తెలిపిన టీడీపీ.. ఏపీ విషయంలో భిన్నంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఏపీలో మాదిగ, రెల్లి కులస్తులు లేరనే విధంగా దుర్మార్గంగా ఒక వర్గానికే ప్రాధాన్యం ఇస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఉనికిని ప్రభుత్వానికి తెలియ చెప్పేందుకు విశ్వరూప మహాసభ జరపనున్నామని తెలిపారు. ఎస్సీ వర్గకరణకు మొదట్నుంచీ సీపీఐ సంపూర్ణ మద్దతు తెలియచేస్తూ అండగా నిలిచిందన్నారు. మహాసభకు సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డిని ఆహ్వానిస్తే ఆయన సానుకూలంగా స్పందించారని మంద కృష్ణ మాదిగ తెలిపారు. ఈ భేటీలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పాల్గొన్నారు.

రామకృష్ణతో మంద కృష్ణ మాదిగ భేటీ



28, 29 తేదీల్లో ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర మహాసభలు

పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి దేవినేని ఉమా

విశాలాంధ్ర - విజయవాడ : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజేఎఫ్) రాష్ట్ర నాలుగో మహాసభలు ఈ నెల 28, 29 తేదీలలో జరగనున్నాయి. ఈ సందర్భంగా మహాసభల పోస్టర్‌ను జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విజయవాడ సమీపంలోని కొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం ఆవిష్కరించారు. అలాగే ఫెడరేషన్ డైరీని కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉమా మాట్లాడుతూ, తమ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. అందరికీ ఇళ్ల స్థలాలతోపాటు పక్కా గృహాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు రూ.100 కోట్ల నిధిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మైలవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని జర్నలిస్టులకు స్థలాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. తిరుపతిలో జరగనున్న సమావేశాలకు తాను తప్పకుండా హాజరవుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యుజేఎఫ్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు వెలమా రామరావు, విజయవాడ నగర కార్యదర్శి షేక్ ఖాజావలి, రాష్ట్ర కార్య నిర్వాహక సభ్యులు దాసరి కామేశ్వరరావు, ముత్యాల బాబూనాథన్, మైలవరం నియోజకవర్గ నేతలు పాల్గొన్నారు.

దక్షిణ ధ్రువానికి చేరుకున్న మహిళా ఐపీఎస్



దెహ్రాడూన్ : భారత్‌కు చెందిన ఐపీఎస్ అధికారిణి దక్షిణ ధ్రువానికి చేరుకొన్నారు. ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ డీఐజీ అపర్ణ కెఆర్ జనవరి 13న దక్షిణ ధ్రువానికి చేరుకొన్నారు. ఆమె 2002లో యూపీ కేడర్ ఐపీఎస్ అధికారిణిగా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని డెహ్రాడూన్‌లోని ఐటీబీపీ నార్తర్న్ ఫ్రాంటియర్ ప్రధాన కార్యాలయం ఆదివారం ప్రకటించింది. ఈ అరుదైన ఘట్టాన్ని సాధించిన తొలి మహిళా ఐపీఎస్ అధికారిగా అపర్ణ నిలిచారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం
స్పీకర్ పోచారం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: పరస్పర విమర్శలకు పోకుండా.. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని సభ్యులందరికీ శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సభా సంప్రదాయాలను గౌరవించి, నియమ నిబంధన లకు అనుగుణంగా సభను నిర్వహిస్తానన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో 119 మంది ఎమ్మెల్యేలను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు సభ్యులందరికీ కృతజ్ఞతలు చెప్పారు. సభాపతిగా ఎన్నిక కావడం గొప్ప అవకాశంగా భావిస్తున్నానని, పదవులు తమకు వారసత్వంగా వచ్చినవి కాదని, ప్రజలు ఎంతో ఆదరించి గెలిపించారన్నారు. సభా గౌరవం, హుందాతనంతో సభను నడుపుదామన్నారు. సభా గౌరవాన్ని కాపాడటంలో సభ్యులందరూ సహకరిస్తారని కోరుతున్నానన్నారు. మంచి సలహాలు, సూచనలను స్వీకరిస్తానన్నారు. కొత్త సభ్యులకు అసెంబ్లీ నియమ నిబంధనలపై వర్క్ షాప్ నిర్వహిస్తామని, అవసరాన్ని బట్టి సభ నడిపే రోజులను నిర్ణయిస్తామన్నారు. సభలో గాడితప్పి మాట్లాడిన సభ్యులపై కఠిన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేస్తూ, పార్టీ ఫిరాయింపులపై చట్ట ప్రకారం వ్యవహరిస్తామన్నారు.

కర్నాటి లింగయ్య వజ్రోత్సవ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-హైదరాబాద్ (కల్చరల్): ఆర్థికశాస్త్ర ఆచార్యులు, సాహితీవేత్త డా.కర్నాటి లింగయ్య వజ్రోత్సవ జన్మదిన వేడుకలు గానసభ కళాసుబ్బారావు కళావేదికలో సాధన సాహితీ స్రవంతీ, గానసభల సంయుక్త ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన తమిళనాడు పూర్వ గవర్నర్ కె.రోశయ్య ఆచార్య కేసీరెడ్డి వెంకటరెడ్డి రచించిన "గురు కర్నాటి లింగయ్య కోవిదుడు" పద్యకావ్యాన్ని, కర్నాటి వజ్ర వైజయంతి సంచికను ఆవిష్కరించి ఆయన సేవలను శ్లాఘించారు. పలురంగాల ప్రముఖులు అతిథులుగా హాజరైన ఈ వేడుకలలో డా.కర్నాటి సాహితీ ప్రస్థానంలో సహకరించిన మిత్రులకు ఆత్మీయ సత్కార సదస్సు నిర్వహించారు. భాషా సంఘం అధ్యక్షులు దేవులపల్లి ప్రభాకరరావు, ఆచార్య టి.గౌరి శంకర్, ఆచార్య మసన చెన్నప్ప, డా.రాధాశ్రీ పాల్గొన్న ఈ కార్యక్రమానికి సాధన నరసింహాచార్య సమన్వయ కర్తగా వ్యవహరించారు.

చైతన్య కళాభారతి 'కళ్యాణి రాగాలు'

విశాలాంధ్ర-హైదరాబాద్ (కల్చరల్): చైతన్య కళాభారతి ఆధ్వర్యంలో శ్రీత్యాగరాయగానసభలో నిర్వహించిన మధురగాయని కళ్యాణి "కళ్యాణ రాగాలు" 12 గంటల వైవిధ్యభరిత సంగీతవిభావరి ఆద్యంతం కరతాళ ధ్వనులందుకుంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన తమిళనాడు పూర్వ గవర్నరు డా.కె.రోశయ్య కళ్యాణి శ్రావ్యరాగ మధురిమలను అభినందించారు. డా.సయ్యద్ రహమతుల్లా ఘంటసాల పాటల నేపథ్యాలపై చేసిన అవధానం అలరింపగా జంటనగరాల ప్రముఖ గాయనీ గాయకులు మిత్ర, బాలకామేశ్వరరావు, రామకృష్ణ, త్రినాథరావు,నాగమణి, కళ్యాణిల గాన మదురిమలు పాటల పండగ సందడై నిలచింది. సంస్థ అధ్యక్షులు శ్రీనివాసరావు సమన్వయ కర్తగా నిలచారు.

జమ్మూ కాశ్మీర్‌లో ఒంటరి పోరు
బీజేపీ నేత రామ్ మాధవ్

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేసే అవకాశం ఉందని, ఎన్నికల తర్వాత కొందరు మిత్రులతో కలిసి సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని సీట్లలోనూ బీజేపీ పోటీ చేస్తుందన్నారు. ఎన్నికలకు ముందు పొత్తులు పెట్టుకునే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని ఆదివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. ఎన్నికల తర్వాత బీజేపీ పెద్ద పార్టీగా అవతరిస్తుందన్నారు. సుస్థిర ప్రభుత్వం కోసం కలిసొచ్చే మిత్రులను కలుపుకొని వెళ్లేందుకు వెనుకాడమని ఆయన తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో త్వరలో జరుగనున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ఫిబ్రవరి 3న ప్రధాని మోదీ ప్రారంభిస్తారని రామ్ మాధవ్ తెలిపారు. ఏప్రిల్-మేలో పార్లమెంటు ఎన్నికలు జరుగనుండగా, అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనేందుకు కూడా బీజేపీ సిద్ధంగా ఉందని చెప్పారు. అయితే ఈ రెండు ఎన్నికలూ ఒకేసారి జరుపుతారా, విడివిడిగా జరుపుతారా అనేది ఎన్నికల సంఘం నిర్ణయించాల్సి ఉంటుందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ సానుకూలంగా లేదంటూ వస్తున్న వదంతులను రామ్ మాధవ్ కొట్టిపేశారు. రాష్ట్రంలో సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు జరపాలని బీజేపీ కోరుకుంటోందన్నారు. ఓడిపోతామనే భయంతోనే కొన్ని పార్టీలు ఎన్నికలు వాయిదా వేయాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కాశ్మీర్ సహాయ, పునరావాసానికి, రాష్ట్రానికి తిరిగి రప్పించేందుకు తాము రోడ్ మ్యాప్ సిద్ధం చేశామని, కాశ్మీర్ లోయలో సానుకూల పరిస్థితి నెలకొనగానే దానిని అమలు చేస్తామని చెప్పారు.

ప్రాజెక్టులపై అంత ఖర్చా ? : భట్టి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:

నూతన ప్రాజెక్టులన్నీ తానే డిజైన్ చేస్తున్నానని చెబుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు టెక్నికల్ నాలెడ్జ్ ఉందా? అని కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకులు మల్లు భట్టివిక్రమార్క ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులపై రూ.2.25 కోట్లు ఖర్చు చేయడాన్ని దేశంలో ఎక్కడా చూడ లేదన్నారు. దీనిపై ప్రభుత్వం సెకండ్ ఒపీనియన్ తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన అసెంబ్లీ లాబీలో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రాజెక్టుల మీద లక్ష కోట్ల వరకు ఖర్చు చేశామని ప్రభుత్వం చెబుతున్నా.. ఒక్క ఎకరానికయినా నీళ్లు వచ్చాయా ? అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రాజెక్టులపై చేసిన ఖర్చుపై అర్థవంతమైన చర్చ జరగాలన్నారు. భూప్రక్షాళనలో ఎలాంటి ప్రక్షాళన జరగలేదు సరికదా, కొత్త సమస్యలు వచ్చాయని భట్టి విక్రమార్క విమర్శించారు. ఇకపై 15 రోజులకోసారి సీఎల్పీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సీఎల్పీ నేతగా ఆయనను ఎంపిక చేసిన అధిష్టానానికి ధన్యవాదాలు తెలుపుతూ, పంచాయతీ ఎన్నికల తర్వాత సీఎల్పీ కమిటీలపై చర్చిస్తామన్నారు. ప్రభుత్వంపై నిర్మాణాత్మకంగా పోరాడుతామని, రెండేళ్లుగా ప్రజా సమస్యలపై చర్చ జరగలేదన్నారు.

భారీగా బంగారం స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీ బం గారం పట్టుబడింది. ఆదివారం ఉదయం తనిఖీలు నిర్వహించిన అధికారులు ఇండోర్ నుంచి వచ్చిన ప్రయాణీకుడి కాలి బూట్లలో విదేశీ మార్కు గల బంగారపు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. షార్జా నుంచి త్రివేంద్రం వెళుతున్న మరో ప్రయాణికుడి దగ్గర కూడా అధికారులు బంగారాన్ని సీజ్ చేశారు. ఇద్దరు ప్రయాణికుల్ని అరెస్ట్ చేసిన పోలీసులు స్మగ్లింగ్ వెనుక ఎవరున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 సంచిక : 208 | సోమవారం 21-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 14+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

అప్పుల కుప్ప

- రూ.82 లక్షల కోట్లు దాటిన వైనం
- మోడీ హయాంలో 50 శాతం పెరిగిన రుణభారం
- కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడి



న్యూఢిల్లీ:
గడిచిన నాలుగున్నరేండ్లలో దేశ రుణ భారం దాదాపు 50 శాతం పెరిగిపోయింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ సర్కారు పాలనలో దేశానికున్న రుణ భారం రూ.82 లక్షల కోట్లను దాటిపోయింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ అప్పులపై ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన గణాం కాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఎనిమిదో ఎడిషన్ స్టేటస్ పేపర్ ప్రకారం గతేడాది సెప్టెంబర్ నాటికి మొత్తం కేంద్ర ప్రభుత్వ రుణాలు రూ.82,03,253 కోట్లను చేరుకున్నాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరిన జూన్ 2014 లో రూ.54,90,763 కోట్లు గానే ఉన్నాయి. దీంతో మోదీ హయాంలో సర్కారీ రుణాలు మరో రూ.27,12,490 కోట్లు పెరిగా యన్న మాట. దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తా నన్న నమో.. అప్పుల సేకరణకున్న ఏ అవకా శాన్నీ విడిచిపెట్టకపోవడం గమనార్హం. కేం ద్రంలో మోదీ సర్కారు అధికారంలోకి రాక ముందు గోల్డ్ బాండ్ల ద్వారా సమీకరించిన రుణాలేమీ లేవు. అయితే ఇప్పుడు ఆ మార్గంలో అందుకున్న అప్పుల విలువ రూ.9,089 కోట్లుగా ఉన్నది. ఇక మార్కెట్ ఆధారిత రుణాలూ గతంతో పోల్చితే 47.5 శాతం పెరిగి రూ.52 లక్షల కోట్లకుపైగా పేరుకుపోయాయి.

ద్రవ్యలోటు లక్ష్యాలకు దెబ్బ

ప్రభుత్వ ఆదాయానికి, వ్యయానికి మధ్య అంతరం తారాస్థాయికి చేరుతుండటంతో ద్రవ్య లోటు లక్ష్యాలు దెబ్బతింటున్నాయి. ఆదాయం కంటే ఖర్చులు పెరిగిపోతుండటంతో పాలనా పరమైన నిర్వహణలో భాగంగా

- మిగతా 13 లో



ఇలా ఎన్నడూ లేదు

కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం

న్యూఢిల్లీ : భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) గవర్నర్లతో మోడీ ప్రభుత్వం అనుసరించిన తీరుపై కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరం విమర్శలు చేశారు. వరుసగా ఇద్దరు ఆర్‌బీఐ గవ ర్నర్లను అవమానించి, తమంత తాముగా వాళ్లు పదవి నుంచి వైదొలిగే చేసిన ఘనత మోడీ సర్కార్‌దేనని అన్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదని పేర్కొన్నారు. 'భారత ఆర్థిక వ్యవస్థ - అవకాశాలు, సవాళ్లు' అనే అంశంపై ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఆదివారం సబర్బన్ బాంద్రాలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో చిదంబరం ప్రసంగించారు. ఆర్‌బీఐ మాజీ గవర్నర్లు రఘురామ్ రాజన్, ఉర్జిత్ పటేల్‌ను చిదంబరం ప్రస్తావిస్తూ, వరుసగా ఇద్దరు ఆర్‌బీఐ గవర్నర్లను అవ మానించి, వాళ్లంత వాళ్లుగా రాజీనామా చేసి వెళ్లిపోయేలా చేయడం ఇంతకు ముందె న్నడూ జరగలేదని అన్నారు. బీజేపీ ప్రభుత్వ వ్యవసాయ విధానాలను కూడా చిదంబరం తప్పుపట్టారు. 'ఎన్‌ఎస్‌పీ (కనీస మద్దతు ధర) విధానం విఫలమైంది. సేకరణ యం త్రాంగం లేనేలేదు. మనం రైతులకు ఆదాయం చూపించాలి. ఒక దేశంగా మనం ఆ విధంగా చేయగలిగి నప్పుడే రైతులు వ్యవసాయ రంగంలో కొనసాగలుగుతారు' అని చిదంబరం అన్నారు.

నీట్ ఫైల్‌కు రెక్కలు

- పర్సంటైల్ మార్కులు కుదింపు
- ఎంసీఐలో కలకలం



ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే నీట్ కటాఫ్ మార్కులను తగ్గించి ప్రైవేటుకు కాసుల వర్షం కురిపించే కీలకమైన ఫైల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ)లో మాయమైంది. ప్రైవేటు మెడికల్, డెంటల్ కాలేజీల్లో వైద్య సీట్ల వ్యాపారానికి తెరలేపిన కీలకమైన ఈ ఫైల్ కనిపించకపోవటం దేశంలో కలకలం సృష్టిస్తోంది. వైద్య విద్యలో అత్యున్నత అర్హత ప్రమాణాలను పాటించేందుకు ఏర్పాటు చేసిన ఎంసీఐ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు వైద్య కళాశాలల యాజమాన్యాలకు అనువుగా మార్చేసింది.

న్యూఢిల్లీ :
మెడికల్, డెంటల్ కాలేజీల్లో ప్రవేశాలపై మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన కీలక ఫైల్ అదృశ్యమైంది. ప్రైవేటు మెడికల్, డెంటల్ కాలేజీ యాజమాన్యాలకు అనుకూలంగా తీసు కున్న ఆ నిర్ణయం బహిర్గతం కాకుండా ఉండేం దుకే ఫైల్ మాయం చేశారనే వ్యాఖ్యలు వినిపి స్తున్నాయి. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులలో ప్రవేశం కోసం నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) అడ్మిషన్ విధానంలో కేంద్ర ప్రభుత్వం ఏటా మార్పులు చేస్తోంది. ప్రవేశ పరీక్షలో కటాఫ్ మార్కులను క్రమంగా కుదిం చుకుంటూ రావటం ద్వారా వైద్య విద్యను వ్యాపారం చేసే దిశగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అం దులో భాగంగానే ఒకప్పుడు నీట్‌లో 720 మార్కులకు 360 మార్కులు సాధిస్తే తప్ప జనరల్ కేటగిరి విద్యార్థులకు మెడికల్‌లో ప్రవేశం లభించేదికాదు. అలాంటిది తాజా నిబంధనలు అందుకు భిన్నంగా ఉన్నాయి. నీట్‌లో పర్సంటేజ్‌కు బదులు పర్సంటైల్ విధానాన్ని అవలంభిస్తోంది. ఈ విధానం వల్ల నీట్‌లో ప్రతిభ చూపకపోయినప్పటికీ మెడికల్, డెంటల్ కాలేజీల్లో సీట్లు పొందే అవకాశాన్ని కల్పించింది. ప్రధాని మోడీ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రైవేటు మెడికల్, డెంటల్ కాలేజీ యజమానులు

- మిగతా 13 లో



అసమానతలకు ప్రభుత్వాలే కారణం

- కార్పొరేట్లకే మరిన్ని ప్రోత్సాహకాలు
- పాలగుమ్మి సాయినాథ్

9 లో

శశికళకు జైల్లో ప్రత్యేక వసతులు

- 5 గదులు.. ప్రత్యేకంగా వంటమనిషి
- ఆర్టీఐ ద్వారా బట్టబయలు

14 లో

వైసీపీకి వంగవీటి రాధా

రాజీనామా

టీడీపీ వైపు చూపు?

13లో



బీజేపీ ఓటమే లక్ష్యం

- ✓ ప్రతి నిరుపేదకు భూమి ఇవ్వాలి
- ✓ నరేగాను సమర్థవంతంగా నిర్వహించాలి
- ✓ ఫిబ్రవరి 26న దేశవ్యాప్త ఆందోళనలు
- ✓ బీకేఎంయూ జాతీయ అధ్యక్షుడు పెరియస్వామి



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి :
రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే మన ముందున్న రాజకీయ కర్తవ్యమని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పెరియస్వామి స్పష్టంచేశారు. గత ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చ లేదని, రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ నిరుపేదల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కార్పొరేట్లు, బడా పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తూ కార్మికులకు మోడీ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని ఆయన మండిపడ్డారు. వ్యవసాయ కార్మికుల సమస్య లను పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 26న దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం ఆదివారం విజయవాడ దాసరిభవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పెరియస్వామి మాట్లాడుతూ తిరుపతిలో జరిగిన బీకేఎంయూ 14వ జాతీయ మహాసభ, స్వర్ణోత్సవాల సందర్భంగా ఆమోదిం చిన తీర్మానాల్లో భాగంగా ఫిబ్రవరి 26న అన్ని రాష్ట్రాల్లోనూ కలెక్టరేట్లు, తాలూకా, మండల కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు జరపనున్నట్లు వివరించారు. పేదలకు భూమి పంపిణీ చేయాలి, ఇళ్లు లేని వారికి గృహాలు మంజూరు చేయాలి, అవకతవకలు లేకుండా

- మిగతా 13 లో

మోడీకి కనువిప్పు కలిగేలా...

హోదా ఉద్యమం

- జాతీయ రహదారుల దిగ్బంధం
- బడ్జెట్ రోజున రాష్ట్రబంద్
- భారీ బహిరంగ సభలు, ఆందోళనలు
- హోదా సాధన సమితి రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయం



విశాలాంధ్ర - అమరావతి :
హోదా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని, ఎన్నికల వేళ అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా ఆందోళనలు చేపట్టాలని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. హోదా సాధన సమితి ఆధ్వర్యంలో విజయవాడలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయ కులు పాల్గొని తమ అభిప్రాయాలను స్పష్టంచేశారు. రాష్ట్రప్రజల నిరసన తీవ్రత ప్రధాని మోడీకి తెలిసేలా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని ముక్తకంఠంతో నినదించారు. ఎన్నికల వేళ హోదా సాధనలో ఈ ఉద్యమం తుది పోరాటం కావాలని ఆకాంక్షించారు. పార్లమెంటులో ఓటు ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టే రోజు రాష్ట్ర బంద్ నిర్వహించాలని, జాతీయ రహదారులు నిర్బంధించాలని, విద్యార్థులతో భారి ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణ యించారు. సోమవారం కార్యాచరణ ప్రకటిస్తామని చలసాని శ్రీనివాస్ చెప్పారు. సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేకహోదా కోసం సమష్టి నిర్ణయాలతో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రానికి మన నిరసన పెద్ద ఎత్తున తెలియచేయాలని, హోదా ఉద్యమకారులపై

- మిగతా 13 లో



రాఫెల్ రానేలేదు..

డబ్బులిచ్చేశారు..!

న్యూఢిల్లీ :
ఫ్రాన్స్ దసాల్ట్ ఏవియేషన్ నుంచి మోడీ ప్రభుత్వం కొనుగోలు చేసిన రాఫెల్ యుద్ధ విమానాల్లో ఒక్కటి కూడా దేశానికి చేరుకోలేదు. అయితే ఇప్పటికే ప్రభుత్వం కంపెనీకి చెల్లించాల్సిన మొత్తంలో సగానికిపైగా చెల్లించింది. ఈ వివరాలను రక్షణశాఖ వర్గాలు తెలియచేశాయి. 36 యుద్ధ విమానాలను రూ.59 వేల కోట్లకు మోడీ ప్రభుత్వం కొనుగోలు చేస్తూ ఒప్పందం కుదుర్చుకుంది. 2016లో ఈ ఒప్పందం కుదిరింది. 2019 నవంబర్ 2020 ఏప్రిల్ మధ్యకాలంలో కంపెనీ విమానాలను భారత్‌కు అందచేస్తుంది. అయితే ఈ విమానాలు పూర్తిగా వినియోగించుకునేందుకు 2022 సెప్టెంబర్ లేదా అక్టోబరు నాటికి మాత్రమే అందుబాటులోకి వస్తాయి. విమానాలు దేశానికి చేరుకున్న తర్వాత సాఫ్ట్‌వేర్ కార్యకలాపాలను పూర్తి చేసేందుకు 6 నెలల కాలం పడుతుంది. నిర్ణీత వాయిదాల ప్రకారం రూ.34వేల కోట్లకు పైగా ఇప్పటికే చెల్లించారని, మరో రూ. 13 వేల కోట్లను ఈ ఏడాది చెల్లించనున్నారని రక్షణశాఖ

- మిగతా 13 లో

ఇదీ లోకం!



'ఆధార్'తో నేపాల్, భూటాన్



న్యూఢిల్లీ :
ప్రజలకు భారత ప్రభుత్వం జారీ చేసిన ఆధార్ కార్డులను నేపాల్, భూటాన్ వెళ్లేందుకు ఉపయోగించుకో వచ్చునని హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 15 సంవ త్సరాలలోపు, 65 సంవత్స రాల పైబడిన వయసుగల భారతీయులు నేపాల్, భూటాన్‌లలో పర్యటించేందుకు తమ ఆధార్ కార్డులను గుర్తింపు ధ్రువపత్రాలుగా చూపించవచ్చునని తెలిపింది. ఈ దేశాలకు వెళ్లడానికి వీసాలు అవసరం లేదన్న సంగతి తెలిసిందే. ఇంతకుముందు 15 సంవత్సరాలలోపు, 65 సంవత్సరాల పైబడిన వయసుగల భారతీయులు నేపాల్, భూటాన్‌లలో పర్యటించేందుకు గుర్తింపు ధ్రువపత్రాలుగా తమ పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సేవల కార్డు, రేషన్ కార్డు వంటివాటిని ఉపయోగించుకునేవారు.

రికార్డు జల్లికట్టు

2వేల ఎద్దులతో పోటీలు

14 లో



హామీలన్నీ అమలు చేస్తాం

- కేంద్ర సహకారం సున్నా
- లక్ష వరకు రుణమాఫీ చేస్తాం
- కౌలు రైతుల బాధ్యత భూ యజమానులదే
- నిరుద్యోగ భృతిపై అధ్యయనం చేస్తున్నాం
- అసెంబ్లీలో కేసీఆర్ స్పష్టీకరణ



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :
ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం అమలు చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్ర శేఖరరావు అసెంబ్లీ సాక్షిగా స్పష్టం చేశారు. రాష్ట్రంలో చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. దాదాపు రూ.24 వేల కోట్ల రుణాలు మాఫీ చేయాల్సి ఉంటుం దని వెల్లడించారు. దీనిపై విధివిధానాల రూపకల్ప జరుగుతోందని, బ్యాంక్ అధికారులతో ఆర్థికశాఖ కార్య దర్శి మాట్లాడుతున్నారని తెలిపారు. తమ మొదటి విడత పాలనలో మేనిఫెస్టోలో లేని 76 పథకాలను అమలు చేశామని చెప్పుకొచ్చారు. కేంద్రంలో అను కూల ప్రభుత్వం లేదని, తెలంగాణకు ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదని విమర్శించారు. రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన పన్నువాటా తప్ప నిధులు రాలేదని అన్నారు. వచ్చే ఐదేళ్లలో ఆదాయ, వ్యయాల అంచనా రూ.10 లక్షల కోట్లని పేర్కొన్నారు. ఐదేళ్లలో ప్రభుత్వం చెల్లించాల్సిన అప్పురూ.2 లక్షల 40 వేల కోట్లని, అప్పు చెల్లిస్తే మళ్లీ రూ.లక్షా 30వేల కోట్లు తెచ్చుకునే అవకాశం ఉందన్నారు. నాలుగు నుంచి ఐదు లక్షల కోట్లు అభివృద్ధి పనులు ఉంటాయని కేసీఆర్ పేర్కొ న్నారు. రాబోయే మూడేళ్లలో కోటి 25 లక్షల ఎకరా లకు నీళ్లిస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. అందుకే ఇరిగేషన్ ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యత ఇచ్చామ న్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆదివారం శాసనసభలో కేసీఆర్ మాట్లా డుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం ఆచరించిన, అనుసరిం చిన, అవలంబించిన అన్ని విధానాలను ప్రజలు పరిశీ లించారు కాబట్టే తిరిగి తమను అఖండ మెజార్టీతో మళ్లీ గెలిపించారన్నారు. గవర్నర్ ప్రసంగం పబ్లిక్ మీటింగ్‌లో కేసీఆర్ ప్రసంగంలా ఉందని కొంతమంది అంటున్నారని, వారి రాజకీయ పరిజ్ఞానానికి జాలిప డటం తప్ప చేయగలిగింది ఏమీ లేదన్నారు. రైతుల అభివృద్ధే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పనిచేస్తోందని, కౌలు రైతుల సంక్షేమాన్ని చూసే బాధ్యత భూ యజ మానులే తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెప్పినా ప్రజలు పట్టిం చుకోలేదన్నారు. పంజాబ్‌లో ఇప్పటికీ అమలు చేయ లేకపోయిందని గుర్తుచేశారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు ఉత్త సంతకాలు మాత్రమే చేశాయి తప్ప ఇంతవరకు ఒక్క రూపాయి

- మిగతా 13 లో

సాహితి

ధనికొండ...సగటు జీవన చిత్రిక



-డా॥వి.ఆర్.రాసాని,
✆ : 9848443610

"నాటకాంతం హి సాహిత్యం".... 'కావ్యేషు నాటకం రమ్యం'....ఇవి మన సాహిత్య లాక్షణికులు చెప్పిన మాటలు. అంటే సాహిత్యానికి పరమావధి నాటకం. కావ్య ప్రక్రియలన్నింటిలో నాటకమే రమ్యమైనది. ప్రసిద్ధ పాశ్చాత్య నాటక విమర్శకుడు అరిస్టాటిల్ నాటకాన్ని 'imitation of complete action' అంటారు. లోకవృత్త అనుకరణమే నాటకమని దాని అర్థం. మన దేశంలో మొదటి నాటక విమర్శకుడైన భరతుడు తన నాట్య శాస్త్రంలోను దాదాపు ఇదే నిర్వచనాన్ని యిచ్చాడు.

నానా భావోపసంపన్నం, నానావస్థాంత రాత్మకమ్
లోకవృత్తానుకరణం నాట్యం ఏతన్మయాకృతం'

అనేక అవస్థలతో కూడిన లోకవృత్తాన్ని అనుకరిస్తూ సుఖదుఃఖాధి విభిన్న భావాలను వ్యక్తీకరించేదే నాటకం. అయితే ఈ వ్యక్తీ కరణల కోసం ఒక ప్రణాళికాబద్ధంగా రచించ బడుతుంది నాటకం. ఆ ప్రణాళికలో స్థల, కాల, సంఘటనల సమంజసమన్వయం (unity of place, time and action) వుంటుంది. ఈ సమన్వయాన్ని సాధించిందే విజయవంత మవుతుంది. అంతేగాకుండా నాటకంలోని ఇతివృత్తమంతా సంభాషణాత్మకంగానే కొనసాగుతుంది.

ఈ లక్షణాలతో మంచి నాటకాలను, నాటికలను తెలుగు సాహిత్యానికి అందించిన వారు ధనికొండ హనుమంతరావుగారు. 1919లో (మార్చి 4న) జన్మించిన హనుమంతరావుగారి శత వసంతోత్సవం 2019 (ఈ ఏడాది) మార్చిలో జరగబోతుంది. వీరు మచిలీపట్నం, ఏలూరు, గుంటూరు ప్రాంతాలలో విద్యాభ్యాసం చేశారు. బి.ఏ. డిగ్రీ సంపాదించి, 1940 నుంచీ రచనా ప్రవృత్తిని స్వీకరించారు. నవలలు, కథలు, నాటికలు చాలా రాశారు. వీరు రాసిన వాటిలో 'లోక చరిత్ర', ఇలవేల్పు వంటి నవలలు, స్వార్థ పరులు, గురిగింజ, అతిధి లాంటి కథలు, మధురకల్యాణం, పవిత్రులు వంటి నాటకాలు, కనువిప్పు, నిరాకరణ, దంపతులు, ఎర్ర బుట్టలు, పిరదౌసి వంటి నాటికలు మంచి పేరుతెచ్చాయి. వీటిలో చాలా నాటికలు ఆ కాలంలో అనేకసార్లు ప్రదర్శించారు. రేడియోలో కూడా ప్రసారమై నాటక రచయితగా మంచి పేరుతెచ్చి పెట్టాయి.

ఒక సందర్భంలో వారి రచనల గురించి వారే చెబుతూ 'అక్షరజ్ఞానం ఉన్నట్లయితే సాహిత్యాభిలాషి అయ్యే అవకాశం ఇవ్వాలి' అంటారు. వారు నమ్మిన సిద్ధాంతం కూడా అదే. ఏ రచనైనా సాహిత్యం వైపునకు పాఠకుడిని ఆకర్షించడమే కదా కావాల్సింది. నిజానికి పాఠకుల సంఖ్యను పెంచడంలోనే సాహిత్య ప్రయోజనం దాగివుందనడం అసత్యం కాదు కదా!

వీరి శైలి చాలా సరళమైంది. భావం తేలిగ్గా అర్థమయ్యేదిగానే ఉంటుంది. సరళంగా సాగిపోయే రచనా శిల్పం వీరిది. ఆ కారణం గానే విశేషంగా పాఠకుల అభిమానాన్ని చూర గొని తెలుగు సాహిత్యంలో సుస్థిరస్థానాన్ని ఏర్పరచుకున్నారు హనుమంతరావుగారు.

వీరి రచనలన్నీ మధ్యతరగతి సమాజం చుట్టానే తిరుగుతాయి. వీరి నాటకాలు, నాటికలు కూడా అంతే. మధ్యతరగతి మందహాసాలు, మనస్తత్వాలు, వారి బాధలు, కష్టాలు, భేషజాలు అన్నీ అతి సహజంగా, హాస్యధోరణిలో చిత్రింపబడినవే.

వీరు రెండు నాటకాలు, పది నాటికలు రాశారు. నాటికలు రెండూ సాంఘికాలే. పది నాటికల్లో రెండు పౌరాణికాలు, రెండు చారిత్రకాలు కూడా ఉన్నాయి.

నాటకాలు పవిత్రులు, మధురకళ్యాణం.

సాంఘిక నాటికలు : కనువిప్పు, పెళ్లికి ముందు, దంపతులు, ఎర్రబుట్టలు, ప్రొఫెసర్ బిండ్సన్, చికిత్స, ఉల్టా-సీదా, బుద్ధొచ్చింది.

పౌరాణిక నాటికలు : అశ్వద్ధామ, నిరాకరణ.

చారిత్రక నాటికలు : పిరదౌసి, వీడ్కోలు.

నాటకాలు : 'పవిత్రులు' రెండు రంగాల నాటకం. ఇందులో సుందరమ్మ, రావు బహుద్దూర్ భార్యాభర్తలు. జయ, రాజారావు వారి సంతానం. సుందరమ్మ రావుకు రెండోకళత్రం. రావుకు కులమన్నా, సాంప్రదా యమన్నా మక్కువ ఎక్కువ. అయితే అతని కూతురు జయ దళితుడైన శ్రీధర్‌ని ప్రేమి స్తుంది. రావుగారికి అది నచ్చదు. కానీ వాళ్లతో ప్రేమగా వున్నట్టే నటిస్తుంటాడు. జయ గర్భవతి అవుతుంది. శ్రీధర్ వ్యాపారం చక్కదిద్దుకోవ డానికి హైదరాబాదు వెళ్లి ఆరుమాసాలు రాడు. జయ మగబిడ్డను కంటుంది. దళితుడైన అల్లుడికి పుట్టిన బిడ్డను మనవడిగా అంగీకరిం చని మనస్తత్వం గల రావుగారు మందు పేరుతో పాలల్లో విషం కలిపి మనవడికి అంది స్తాడు. బిడ్డ చనిపోతాడు. ఆ తర్వాత శిశు హంతకుడినన్న బాధ, భయం రావుగారి గుండెలో దూరిపోయి అతన్ని భయపెడు తుంటుంది. జయ ఏడుపుతో నాటకం ముగుస్తుంది.

1945లోనే అంటే మనకు స్వాతంత్ర్యం రాక ముందే ఈ నాటకం ముద్రింపబడింది. ఆ రోజుల్లోనే దళిత నేపథ్యంతో నాటకం రాసి ప్రదర్శింపచేసి పేరు తెచ్చుకోవడం హనుమంత రావుగారి గొప్పతనం. అయితే ఈ నాటకాన్ని రాయడం వెనక అప్పట్లో మహాత్మాగాంధీ ప్రచారం చేసిన హరిజనోద్ధరణ, అస్పృశ్యత నిర్మూలన భావాల ప్రభావం ఉందని అనుకోవడంలో తప్పేమీ లేదనిపిస్తుంది. ఇది వారి అభ్యుదయ భావాలకు ప్రతీక. 1954లో ముద్రించిన 'మధురకళ్యాణం' హనుమంతరావు గారికున్న కళాతృష్ణను పట్టిచ్చే నాటకం. ఈ రెండు నాటకాల్లోనూ ఇతివృత్తాన్ని నడపడంలో వచ్చే ఎన్నో హాస్యసంభాషణల ప్రయోగాలు ప్రదర్శనను ఆహ్లాదకరంగా మారుస్తాయి.

సాంఘిక నాటికలు : హనుమంతరావుగారి నాటికల్లో మొదటగా చెప్పుకోదగింది 'కను విప్పు'. ఇదొక శ్రావ్యనాటిక, ఇది మొదట కథగా వచ్చి, ఆ తర్వాత రేడియో నాటికగా మారింది. ధనవంతుడైన రాజా తనకు పెళ్లికాదని ఆత్మహత్యకు పాల్పడిన ఒక పేదింటి పిల్ల జానకిని వివాహం చేసుకుంటాడు. ఆ వివాహానికి అతని తల్లిదండ్రులు ఒప్పుకోక పోవడంతో తన ఆస్తిని వదిలేసి వచ్చేసి చిన్న ఉద్యోగం చేస్తూ భార్యను పోషిస్తుంటాడు. జానకి గతాన్ని మరచిపోయి తనకు నగలు, బంగ్లా కావాలనీ, తల్లిదండ్రుల ఆస్తిని తెచ్చిపెట్టమని నిత్యం పోట్లాడుతూ భర్తను అవమానిస్తుంటుంది. ఒకరోజు భర్తతోబాటు సినిమాకు వెళ్లిన జానకిని చూసి రాజా మరదలు తన కారులో ఇద్దరినీ తనయింటికి తీసుకెళ్లి తన బావ దేవుడని కాళ్లకు మొక్కి చాలా గౌరవిస్తుంది. తనను, తన ఐశ్వర్యాన్ని వదలి నిన్ను పెండ్లి చేసుకున్న త్యాగశీలి' అని చెప్పడంతో జానకి తన తప్పును తెలుసుకుని ఆనాటినుంచీ భర్తను చాలా గౌరవిస్తుంది.

అలాగే ఉత్కంఠభరితంగా నడిపిన మరో నాటిక 'దంపతులు'. ఆలుమగల మధ్య సర్దుబాటు లేకపోతే జీవితాలు దెబ్బతింటాయన్న గొప్ప సందేశంతో రాసిన నాటిక ఇది. తాడిని తన్నేవాడొకడుంటే వాడి తలను తన్నేవాడు ఇంకొకడుంటారంటారు. అలాగే మోసం చేసేవాణ్ణి మరొకడు తప్పకుండా మోసం చేస్తాడన్న సామాజిక సందేశాన్ని తెలియజేసే నాటిక ప్రొఫెసర్ బిండ్సన్. రంగారావు అనే పనిలేని ఒక నిరుద్యోగి స్త్రీలను లొంగదీసుకునే మందు అని పేపరు ప్రకటనలిచ్చి వాస్‌లీను, గంధంపొడి, తుమ్మబంకను కలిపి చిన్నడబ్బాల్లో పెట్టి అమ్ముకుంటూ లక్షలు సంపాదిస్తాడు. అతనికి ఒక అందమైన టైపిస్టు కూడా ఉంటుంది. మందు పనిచేయకపోతే ఐదువేలు తిరిగి ఇవ్వబడుతుందని కూడా ప్రకటనలిచ్చి మోసం చేస్తుంటాడు. అది చూసి ఇద్దరు యువకులు వచ్చి నీమందు పనిచేయలేదని నిరూపించి పోలీసులతో వచ్చామని బెదిరించి అయిదువేలు వసూలు చేసుకుపోతారు. చివరికి ఆ వ్యాపారం ఎత్తేసి టైపిస్టుని ప్రేమించానని ఆమెమీద పడితే ఉద్యోగార్థం ఆడవేషంలోవున్న కుర్రాడు టైపిస్టని తెలిసి నివ్వెరపోతాడు ప్రొఫెసరు. పెళ్లికి ముందు అనే నాటిక చాలా ఉత్సుకతతో సాగుతుంది.

కవితాత్మకంగాసాగే రెండంకాల నాటిక 'ఉల్టా-సీదా'. శర్మకు మూర్తి, దాసులు స్నేహితులు. శర్మకు పెళ్ళంటే ఇష్టముండదు. కానీ తల్లిదండ్రులు ఒక అందమైన ధనవంతు రాలును చూసి పెళ్లి నిశ్చయం చేస్తారు. మూర్తి, దాసులు పెళ్లిని చెడగొట్టడానికి పెళ్లి చూపులకు వచ్చిన మామదగ్గర తాగినవాడిలా యాక్షన్ చేయమంటారు. తీరా అలా నటించబోతే ఆ మామ అతని బాటిల్‌తీసుకొని తాగి, తాగు బోతునైన నాకు తగిన అల్లుడు తనేనని పెళ్లికి అంగీకరిస్తాడు. అనుకున్నదొకటైతే అయినది మరొకటి. అంతా ఉల్టాసీదా అవుతుంది.

ఈ నాటికలో కవిత్వం లాంటి సంభాషణలు పఠితను ఆకట్టుకుంటాయి. ఉదాహరణకు శర్మ...దాసుకు చెప్పిన కవిత చూడండి.

ఈ వూరొకలంక/మన ప్రేమొక డొంక
నువుచూస్తే నావొంక/పడితే వొదలని బంక
బంక! బంక! బంక!

శర్మకు దాసు... కవితాత్మకంగానే 'ఓహో! మీరు సుగంధం వెదజల్లేమల్లీ! నీ ముస్తాబే ఊసరవిల్లీ' అంటూ సమాధానం చెబుతాడు. ఈ నాటికంతా ఇలాగే హాస్యంతో కూడుకున్న కవితాత్మక సంభాషణలతోనే నడుస్తుంది. ఇదొక ప్రహసనం.

'బుద్ధొచ్చింది' నాటికలో సినిమా రంగంలో జరిగే మోసాలు, నటనలు, నటనల వెనక ఆడే డ్రామాలు రమణీయంగా చిత్రించారు. ఈనాటికలో బ్రహ్మానందం ఫిలిండైరక్టర్. సినిమా ఛాన్స్ ఇస్తామని పత్రికా ప్రకటన చేసి అందమైన అమ్మాయిల్ని పిలిపించి, లైంగిక దోపిడీ సాగిస్తూ మోసం చేస్తుంటారు. అలా మోసపోయిన ఒక స్త్రీ సుందరి తన చెల్లెలయిన కుమారిని ఇంటర్వ్యూకు పంపి అతను శృంగారం జరపబోగా చాటుగా వుండి కెమేరాతో ఫొటో తీశానని అతన్ని బెదిరించి, పదివేలు వసూలు చేసుకుని బుద్ధిచెప్పే ఇతివృత్తం, నేటి 'మీటు' సంఘటనలను గుర్తుకుతెస్తుంది.

పౌరాణిక నాటికలు : ధనికొండగారు రాసిన రెండు పౌరాణిక నాటికలూ ప్రసిద్ధమైనవే. ఈ రెండింటిలో ఒకటైన 'అశ్వద్ధామ' నాటికలోని కథావస్తువు భారతంలోని సౌప్తికపర్వంనుంచీ తీసుకోబడింది. అలాగే అరణ్యపర్వంలో తన జన్మకు కారకుడైన ఇంద్రుని ఆహ్వానంపై ఇంద్రలోకానికి వెళతాడు అర్జునుడు. అర్జునుని అందాన్ని చూసి మోహిస్తుంది ఊర్వశి. అమ్మా! నువ్వు నా జనకుడైన ఇంద్రుని ప్రేయసివి. అంతేగాక మా వంశానికి మూలపురుషుడైన పురూరవుని సతివి. ఆ కారణంగా నేను నీ కోరికను తీర్చలేనని ఊర్వశి కోరికను నిరా కరిస్తాడు. ఆతని నిరాకరణను అవమానంగా భావించిన ఊర్వశి అతన్ని పేడివికమ్మని శపిస్తుంది. ఈ అంశాన్నే ధనికొండగారు నిరాకరణ నాటికగా రాశారు.

చారిత్రక నాటికలు : ధనికొండ రాసిన చారిత్రక నాటకాలు పిరదౌసి, వీడ్కోలు. పిరదౌసి ఒక పారశీక కవి. మృదుమధురమైన శబ్దసారస్యం కలిగి శ్రుతిహితంగావుండే భాషలలో పారశీక భాష కూడా ఒకటి. తొలిదశలో పారశీకులు ఆర్యులు. వారు అగ్ని దేవున్ని పూజిస్తారు. హిందువులకు వేదం లాగానే వాళ్లకు 'అలెస్తా' అనే పవిత్ర మత గ్రంథం వుంది. ఆరవ శతాబ్దంలో మహమ్మద్ ప్రవక్త ఆవిష్కరించిన మహమ్మదీయ మతం 7వ శతాబ్దం నాటికి పారశీకంలోను ప్రవేశించి. పారశీక స్థానంలో అరబ్బీ భాష రాజభాష యింది. క్రీ.పూ. 809లోనే మొదటి పారశీ కావ్యం వెలువడిందని విజ్ఞులు చెబుతారు. అరబ్బీ ఇబ్బడిముబ్బడిగా పారశీలో చేరిపోవడంతో శుద్ధపారశీ ఉద్యమం కూడా ఒకటి బయలుదేరింది. ఈ ఉద్యమానికి పిరదౌసి నాయకత్వం కూడా వహించాడు. ఇతను కడు పేదకవి. కుటుంబ పోషణార్థం డబ్బులకాశపడి 'షానామా' అన్న గొప్ప కావ్యాన్ని రాశాడు. మంజరీ ద్విపదకు దగ్గరగావున్న 'మన్నవి' ఛందస్సులో మధురంగా రాసిన కావ్యం 'షానామా. ఈ కావ్యం వెనుక జరిగిన చారిత్రక సంఘటనలతో 'పిరదౌసి' నాటిక రాయబడింది. ఈ అంశాన్నే ఆధారం చేసుకుని గుర్రం జాషువా 'పిరదౌసి' పేరుతో గొప్ప ఖండకావ్యం కూడా రాశారు.

ధనికొండ వారు రాసిన ఈ నాటికలో అరబ్బీ కలీఫా అయిన గజనీ మహమ్మద్ ఒక్కో పద్యానికి ఒక్కో బంగారు నాణాన్ని ఇస్తానని తన అంతఃపురానికి పిరదౌసీని రప్పించుకుని తన వంశ చరిత్రను, తన జీవితాన్ని ఆధారం చేసుకుని కావ్యం రాయమంటాడు. అతనిచ్చే స్వర్ణ దీనారాలకు ఆశపడి, అనారోగ్యంలో కుమారుడు, భార్య చనిపోయినా పట్టువిడవకుండా ముప్పయి సంవత్సరాలు కష్టపడి కావ్యాన్ని పూర్తి చేస్తాడు. క్రూరుడైన గజనీ మాటతప్పి బంగారు నాణాలకు బదులుగా వెండి నాణాలు పంపిస్తాడు. కవి దాన్ని తిరస్కరిస్తాడు. గజనీ కవికి మరణదండన విధిస్తాడు. దాంతో కూతురును నగరంలోనే వదిలేసి అడవులకు పారిపోతాడు. ఆ విషయం తెలుసుకున్న పండితులు కవి పాపం ఊరికేపోదు. కవికి మరణదండన విధించి అపకీర్తిని కట్టుకోకు అని గజనీకి హితోపదేశం చేస్తారు. దాంతో తన తప్పును తెలుసుకుని పశ్చాత్తాపం చెంది బంగారునాణాలు పంపిస్తాడు. అప్పటికే కవి మరణించి ఉండడంతో 'తండ్రిపోయిన తర్వాత ఈ ధనం నాకెందుకు అంటూ పిర్‌దౌసి కూతురు మోతియా ఆ ధనాన్ని భటులచేత తిప్పి పంపేస్తుంది. ఈ అంశాన్నే హృద్యంగా ఈ నాటికలో చిత్రించారు హనుమంతరావుగారు. ఈ నాటిక 1941లో రాయబడింది. బుద్ధుడిగా మారిన గౌతముడు రాజ్యాన్ని, భార్యాబిడ్డల్ని వదిలేసి కపిలవస్తు నగరానికి వీడ్కోలు చెప్పే సందర్భాన్నే వీడ్కోలు నాటికగా రాశారు హనుమంతరావుగారు.

ఇవీ హనుమంతరావుగారు రాసిన నాటకాలు, నాటికలు. వీటిలో సరళమైన భాష వాడడంతో పాటు, భాషకు భూషణంగా భాసిల్లే జాతీయాలను, సామెతలను కూడా ప్రయోగించి భాషను సుసంపన్నం చేశారు హనుమంతరావుగారు.

ఉల్టా-సీదా నాటికలో 'మనకన్నా నాలుగాకులు ఎక్కువే చదివాడు. "డొక్కచీల్చి డోలు కడతాను, రామకీర్తన పడిస్తా, మధుర కల్యాణం నాటకంలో ప్రణయపైత్యం, దంపతులు నాటికలో వడ్లగింజలో బియ్యపుగింజ వంటి జాతీయాలు, మధురకల్యాణం నాటకంలో 'పరమానందయ్య శిష్యుడే, ఉల్టాసీదా నాటికలో స్వాములవారికి పచ్చగడ్డి పలహారం, పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణసంకటం వంటి సామెతలు భాషకు సహజత్వాన్ని చేకూర్చి పాఠకుడి హృదయానికి ఉల్లాసాన్నిస్తాయి.

ఈ నాటికలు, నాటకాలు ధనికొండ హనుమంతరావుగారిని గొప్ప కథా, నవలా రచయితగానే గాకుండా గొప్ప నాటక రచయితగానూ నిలబెడతాయనడంలో సందేహించాల్సిన అవసరం లేదు. ●

ప్రామాణిక గ్రంథం 'అర్థశాస్త్ర' క్రమ పరిణామం

అర్థశాస్త్ర క్రమపరిణామం అనే ప్రామాణిక గ్రంథాన్ని ప్రసిద్ధ మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్త ఎ.వి. అనీకిన్ 1976లో రచించాడు. దీన్ని 1983లో నిడమర్తి ఉమా రాజేశ్వరరావు తెలుగులో అనువదించాడు. సోవియట్ యూనియన్‌లోని 'ప్రగతిప్రచురణాలయం' ఈ గ్రంథాన్ని ప్రచురించింది. సోవియట్ యూనియన్ పతనానంతరం కూడా (కొన్ని అంశాలు, కొన్ని ఉదాహరణలు తప్ప) ఇప్పటికీ ఈ గ్రంథం తాజాగా, ప్రామాణికంగా ఉందన్న భావనతోవిశాలాంధ్ర ప్రచురణాలయం పునర్ముద్రించింది.



ఈ గ్రంథాన్ని రచయిత పాఠకుల సౌలభ్యంకోసం క్రీ.పూ. 3వ శతాబ్ది నుండి క్రీ.శ. 19వ శతాబ్దివరకు వచ్చిన అర్థశాస్త్రగ్రంథాలు, రచయితల విశేషాలను 19 ప్రకరణాలుగా వర్గీ కరించి చర్చించాడు. పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించే అర్థశాస్త్రంలోని మౌలికాంశాలను చారిత్రకంగా అవ గాహన చేసుకొనేందుకు ఈ గ్రంథం ఎంతో ఉపయోగపడుతుందనడం నిస్సందేహం.

ఇందులో అర్థశాస్త్ర సిద్ధాంతాల ఆరంభం, కాలాను గుణంగా వాటిలో వచ్చిన మార్పులూ, చేర్పులూ అనేక మంది అర్థశాస్త్రవేత్తలు పుస్తకాల రూపంలో వెలువరిం చారు. గ్రీసు దేశస్థుడైన 'అరిస్టాటిల్'ను (క్రీ.పూ. 336) ఈ గ్రంథరచయిత అర్థశాస్త్రానికిఆద్యుడిగా పేర్కొన్నాడు. అరిస్టాటిల్ సరుకులకు ఉపయోగపు విలువ, మారకపు విలువ అనే రెండు పార్శ్వాలను నిర్ధారించి మారకపు క్రమాన్ని విశ్లేషించాడు. ఈ ఆలోచనలు మన దేశంలో మౌర్యులకాలంలో 'చాణుక్యుడితో ప్రారంభమయ్యాయి. అరిస్టాటిల్ రాజకీయాల గురించి, నైతిక విలువల గురించిచెప్పిన విషయాలను ఆయన శిష్యులు గ్రంథస్థం చేశారు. భారతదేశంలో తొలి ఆర్థికశాస్త్రవేత్తగా నిర్ధారించబడిన చాణుక్యుణ్ణి కౌటిల్యుడని పిలుస్తారు. కౌటిల్యుడు తన అర్థశాస్త్ర గ్రంథంలో రాజ్యపాలనా వ్యవ హారాల్లో కర్తవ్యాలనూ, విధులనూ, పౌరపాలన, పన్నులు మొదలైన అంశాలను గూర్చి సవివరంగా చర్చించాడు. అరిస్టాటిల్, కౌటిల్యుడు చెప్పిన అభిప్రాయాలు ఆధునిక అర్థశాస్త్ర సిద్ధాంతాలతో పోల్చినపుడు పరిపూర్ణ సిద్ధాం తాలు అనిపించవు. కౌటిల్యుడు ఆనాటి వర్ణాశ్రమ ధర్మాల ప్రాధాన్యక్రమంలో అర్థశాస్త్రాన్ని రచించాడు. ఆయా వర్ణాలవారికి విధించబడినవృత్తులుగా వ్యవసాయం, పశుపాలన,వర్తకం, ధనసంపాదన మొదలైనవాటిని వివరించాడు. రాజ్యతంత్రం ప్రధానాంశంగా పేర్కొన్నాడు.

రెండువేల సంవత్సరాల్లో అర్థశాస్త్ర పరిణామం లోని మౌలికాంశాలను, వాటిని ప్రతిపాదించిన మూలపురుషులను గూర్చిరచయిత సవివరంగా పేర్కొ న్నాడు. క్రీ.శ. 18, 19 శతాబ్దాల్లో బూర్జువా అర్థశాస్త్రవేత్తలు చాలా పుస్తకాలు ప్రచురించారు. 20వ శతాబ్దంలో వీటిపై అసంఖ్యాకమైన గ్రంథాలు వచ్చాయి. ఈ గ్రంథాల్లోని ఆర్థిక సిద్ధాంతాలను స్థూలంగా ఐదు విధాలుగా వర్గీకరించి పరిశీలించ వచ్చు. ఆర్థిక శాస్త్ర గ్రంథ రచయితలు ఎక్కువమంది ఐరోపావారు మొదటి భాగంలో ఆర్థికసిద్ధాంతాల ప్రారంభాన్ని చర్చించారు. అరిస్టాటిల్, బైబిలు దగ్గరనుండి 15,17 శతాబ్దాల్లో వచ్చిన వ్యాపారవాదం, విలువైన వెండి, బంగారాలపట్ల ఆనాటి ప్రజల ఆరాధనాభావం, పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అభివృద్ధి అంతటినీ అనుసరించిఉంది. ఈ వ్యాపార పెట్టుబడి ప్రాతినిధ్యం వహించిన కాలంలో 'పూజా విగ్రహాల ప్రాధాన్యం ఎక్కువగా ఉండేది. ఎక్కువ ధరకు అమ్మడంకోసం కొనడం అనే వ్యాపార పెట్టుబడిసూత్రం వంటి సిద్ధాంతాలను ఈభాగంలో చర్చించారు.

రెండోభాగంలో సాంప్రదాయ సిద్ధాంతాల్లో ఆడమ్ స్మిత్ నుండి మార్క్స్ ముందువరకున్న ఓవెన్ వరకు ఆర్థిక శాస్త్రవేత్తల గూర్చి సమగ్రంగా చర్చించారు. మూడో భాగంలో సాంప్రదాయ బూర్జువా ఆర్థిక సిద్ధాంతాలకు ప్రత్యామ్నాయంగా వచ్చిన సోషలిస్టు, మార్క్సిస్టుల గూర్చి సాకల్యంగా వివరించారు. నాల్గో భాగంలో సూక్ష్మ ఆర్థిక విశ్లేషణకు కారకులైన కూర్‌నట్ నుండి మార్షల్ వరకున్న ఆర్థికశాస్త్రవేత్తల సిద్ధాంతాలను సోదాహరణంగా చర్చించారు.

ఐదో భాగంలో స్థూల ఆర్థిక విశ్లేషణకు ప్రాధాన్య మిచ్చిన మార్క్సిస్టు అనుయాయులైన వెబ్లన్ నుండి 20వ శతాబ్దపు ఆర్థిక శాస్త్రవేత్తలు కీన్స్ నుండి నోబుల్ బహుమతి అందుకున్న అమర్త్యసేన్ వరకు వచ్చిన ఆర్థిక సిద్ధాంతాలను సమగ్రంగా వివరించారు. వీటిలో పెట్టుబడిదారీ భూస్వామ్య సిద్ధాంతాలను సమర్థిస్తూ వచ్చిన సిద్ధాంతాలే ఎక్కువగా ఉన్నాయి. అయితే బూర్జువా ఆర్థిక శాస్త్రవేత్తలు చేసిన సిద్ధాంతాల విభజన ఒకేరకంగా లేదు. ప్రత్యేకించి 17వ శతాబ్దం నుండి 19వ శతాబ్దివరకు ఆర్థిక శాస్త్ర అభివృద్ధి పెట్టుబడిదారీ విధానంలో సాగింది. ఆ కాలంలో దాన్నే ప్రగతిశీలమైన వ్యవస్థగా భావించారు. ఆకాలంలో ప్రతిభావంతులైన చింతనాపరులు, ఆర్థిక శాస్త్రవేత్తలైన విలియంపెట్టి, రిచర్డ్, ఫ్రాన్స్‌వాకెనీ, జేమ్స్ స్టూవర్ట్, ఆడమ్‌స్మిత్‌వంటి వారు ఆవిర్భవించారు. రచయిత వారి జీవిత విశేషాలను, ఆర్థిక సిద్ధాంతాలను సమగ్రంగా చర్చించారు.

ఒక శతాబ్దికాలంగా బూర్జువా విజ్ఞానశాస్త్రం మార్క్స్ చరిత్రాత్మక పాత్రను వక్రీకరించే ప్రయత్నం చేయడం దురదృష్టం. వారిప్రచారంలోప్రధానంగా రెండుధోరణులు కనిపిస్తున్నాయి. మార్క్సునూ, ఆయన విప్లవాత్మక బోధనలను నిర్లక్ష్యంచేసి ఆయనను పాశ్చాత్య సాంస్కృతిక సంప్రదాయ బాహ్యుడిగా చిత్రించడం మొదటిది. మార్క్స్ ఆర్థికబోధన, రికార్డో ఆర్థిక బోధనతో అతి తక్కువ విభేదిస్తుందనీ, రికార్డులోవున్న లోపాలే మార్క్సులోఉన్నాయనీ, అర్థశాస్త్రంలో మార్క్సుతెచ్చిన మూల మలుపు విప్లవాత్మకధోరణిని మరుగుపరచడం రెండోది.

మార్క్స్ తన అదనపు విలువ సిద్ధాంత గ్రంథాన్ని ఆడమ్‌స్మిత్, రికార్డోల రచనల ఆధారంగా రచించానని స్పష్టంగా చెప్పు కున్నాడు.అందువల్ల రికార్డో బోధనతో అతి తక్కువగా విభేదిస్తుందన్న విమర్శ సరైందికాదు. మార్క్సిజాన్ని ఆధునిక బూర్జువా సామాజిక శాస్త్రం తోనూ, అర్థశాస్త్రంతోనూ సమన్వయ పరచవచ్చుననీ, ఇవన్నీ ఒకే మూలం నుండి ఉత్పన్న మవడమే కారణమన్న ప్రచారం బలీయంగావుంది. సుప్రసిద్ధ బ్రిటీష్ లేబర్ సిద్ధాంతవేత్త జాన్‌స్ట్రాచీ సమకాలీన పెట్టుబడిదారీ విధానం అనే గ్రంథంలో మార్క్సిజాన్ని పాశ్చాత్య సాంస్కృతిక సంప్రదాయంలో సమ్మిళితం చేసే ప్రయత్నంచేశాడు. ఇటీవల మార్క్స్ పైనా, మార్క్సిజం పైనా బూర్జువా ఆర్థిక శాస్త్రవేత్తల్లో ఆసక్తి గణనీయంగా పెరిగింది. ప్రత్యేకించి మార్క్స్ ప్రబోధించిన ఆర్థిక పెరుగుదల, సంచయనం, జాతీయాదాయ పంపిణీవంటి కీలక సమస్యలకు సంబంధించిన ఆర్థిక విధానంపై సిఫారసులను రూపొందించే సందర్భంగా గొప్ప దూరదృష్టికలిగిన ఆర్థికశాస్త్రవేత్తలు మార్క్సిస్టు విశ్లేషణలపట్ల ఆకర్షితులవుతుండటం విశేషం.

మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌లు పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించే బూర్జువా ఆర్థిక సిద్ధాంతాలను విమర్శించి, వాటి సామాన్యమూలాలనూ, లక్ష్యాలను ఆర్థికాభివృద్ధి నియామకాలకు సంబంధించి వాటి అశాస్త్రీయ దృక్పథాన్ని విమర్శించారు. కార్మికవర్గోద్యమాన్ని నష్టపరచే ప్రమాద కరమైన భావజాలంపై రాజీలేని దాడులు చేశారు.

ఈ గ్రంథంలో పెట్టుబడిదారీ భూస్వామ్య సిద్ధాంతా లను సమర్థిస్తూవచ్చిన సిద్ధాంతాలే ఎక్కువగా ఉన్నాయి. గత రెండు శతాబ్దాల్లో రెండో ప్రపంచయుద్ధం తర్వాత, సోవియట్‌యూనియన్ పతనం తర్వాత వచ్చిన గ్రంథాల్లో వ్యత్యాసాలున్నాయి. ఇందులో స్థూల ఆర్థిక విశ్లేషణ ప్రముఖంగా కనిపిస్తుంది. 1950 నుండి 1990 వరకు వచ్చిన బూర్జువా ఆర్థికవిశ్లేషణలకు, ఆ తర్వాత సోవియట్‌యూనియన్ పతనం తర్వాత వచ్చిన విశ్లేషణ లకు అపారమైన వ్యత్యాసం ఉంది. 1950 నుండి 1990 మధ్యకాలంలో వచ్చిన విశ్లేషణల్లో ఉదారవాద సంక్షేమ కార్యక్రమాల ప్రాధాన్యంఉంది. 1990తర్వాత విశ్లేషణల్లో సోషలిస్టు సిద్ధాంతాన్ని అధిక్షేపించే ధోరణి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 2008లో సంభవించిన పెట్టుబడి దారీ వ్యవస్థ ఆర్థిక సంక్షోభాల పర్యవసానంగా బూర్జువా ఆర్థికశాస్త్రవేత్తల్లో పునరా లోచన ప్రారంభమైంది. ఆర్థికశాస్త్రవేత్తలు తిరిగి మార్క్సిస్టు నూతనకోణంలో పునశ్చరణకు పూను కున్నారు. బూర్జువా భావజాలం గూడుకట్టుకున్న ఆర్థిక శాస్త్ర వేత్తలు పెట్టుబడిదారీ విధాన పరిరక్షణకే పాటుపడు తున్నారు. ఈ అంశాలన్నీ ఆసక్తికరమైన సంక్షిప్త సుందరమైన శైలిలో రచయిత ఈ గ్రంథంలో చర్చించాడు. అర్థశాస్త్ర పాఠకులు, విశ్వవిద్యాలయ, కళా శాలల అర్థశాస్త్ర ఆచార్యులూ, పోటీపరీక్షల విద్యార్థులూ, ఎంబిఎ, ఎం.ఎ. అర్థశాస్త్ర విద్యార్థులు విధిగా చదవదగిన గ్రంథం అర్థశాస్త్ర క్రమ పరిణామం.

-డా. పి.వి. సుబ్బారావు,✆ : 9849177594

అర్థశాస్త్ర క్రమపరిణామం
(మార్క్సుపూర్వపు అర్థశాస్త్రం) -ఎ.వి. అనీకిన్
అనువాదం: నిడమర్తి ఉమారాజేశ్వరరావు
పేజీలు:448, వెల: 360/-
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్
33-22-2, చంద్రంబిల్డింగ్స్, చుట్టుగుంట,
విజయవాడ-520004 మరియు
విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలో



నెత్తురోడుతున్న తెలుగు నేల..

కోళ్ళ కత్తులతో నెత్తురు పారుతోంది
నేల రక్తంతో చిత్తడవుతోంది
గోదావరీ నది నుండి ఎర్రని చారలు
బౌద్ధ సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తున్నపాలకులు
హింసకు భాష మార్చారు
దోపిడీకి వ్యూహం మార్చారు
చిక్కని మంచులో బాణాలు, ఈటెలూ విసురుతున్నారు
హతుడవుతున్న వాణ్ణి గుర్తించవచ్చు
హతం చేసిన వాణ్ణి గుర్తించలేకున్నాము
ప్రేమించడం వారికి తెలియదు
నెత్తుటి స్నానాలకు అలవాటుబడ్డారు
అమరావతి చుట్టూ భజంత్రీలు చేరారు
పాలకుని కాళ్ళమీద రంగులపూలు జల్లుతున్నారు
నరహంతకుల పాదాలకు అత్తర్లుపూస్తున్నారు
పదవుల కోసం జేజేలు పలుకుతున్నారు
పేదరాలు కనలేక మరణిస్తున్న చిత్రాన్ని వాడుచూశాడు
ఆ బొమ్మను చించేస్తున్నాడు
వీరు కన్నీరు అమ్ముకొని బ్రతుకుతున్నారు
తొత్తులుగా పాలకులకు కొమ్ముకాస్తున్నారు
వాడి మాటల్లో వాగ్దానాల వర్షం
వాడి కళ్ళల్లో క్రౌర్యశంఖారావం
వాడు కులం పేరుతో మూకల్ని సమీకరిస్తున్నాడు
వాడు రాఫెల్లో దోచిన నిధులతో..
ఆకాశానికి కాషాయరంగు పూస్తున్నాడు
వీడు తన కొడుకును కిరీటంగా ధరించాడు
యువకులకేమో మత్తు మందులు పంచుతున్నాడు
రాజ్యం అంటే సామాజిక శ్రేయస్సు కాదా!
రాజ్యం అంటే జీవన విధ్వంసమా!
వాడు ఒక వ్యాధిగ్రస్తుడు
ఆ వ్యాధినే అందరికి ఎందుకు వ్యాప్తి చేస్తున్నాడు
వీరు నిజమే కులాన్ని
గుండెల్లో పెట్టుకొని బ్రతుకుతున్నారు
మనిషిని మనిషిగా చూడలేని అమానవీయత వీరిది
అవనిక మీద అనేక బొమ్మలు మారుతూనే వున్నాయి
బొమ్మలకు రంగులెక్కువైయ్యాయి కానీ రూపం లేదు
రూపానికి, వ్యక్తిత్వానికి నిజాయితీ కావాలి కదా!
నీవు ఎర్ర దుంగల్ని అమ్ముకొన్నపుడు
పగలు కూడా మంచు కురుస్తుందని నీకు తెలియదా!
చెట్టు నరికినట్లు మనుష్యులను కూలుస్తున్నారు
వాడే తిరుపతి మెట్లెక్కి పట్టు పీతాంబరాలు కట్టుకున్నాడు
అంబేద్కర్ విగ్రహాలు కాశ్మీర్ నుండి
కన్యాకుమారి వరకు లేచాయి కదా!
కలం పట్టుకొని దేశాల హద్దులు ఆయన దాట లేదా!
బుద్ధుని మాటలు చైనా భాషల్లోకి ఎలా వెళ్ళాయి
అక్కడ వీధి వీధిలో ఎందుకు బుద్ధుని సూక్తులున్నాయి
షేక్స్‌పియర్ రాజు గుండెల్లో దాగిన
విషాన్ని బొమ్మకట్టి చూపించలేదా!
ఆ యువకుడు తాను కామించిన అమ్మాయి
ముఖం మీద యాసిడ్ పోస్తున్నాడు
వాడికి ప్రేమంటే ఏమిటో తెలుసా!
ప్రేమంటే బ్రతికించడం కదా!
ప్రేమంటే బలితీసుకోవడమా!
అవును! అంబేద్కరంటే విద్య
అంబేద్కరంటే జ్ఞానం, అంబేద్కరంటే దిక్సూచి
ఆయన పాదాలు ముట్టి మీరు ఆయన్ని
తూట్లుపొడుస్తున్నారు కదా!
యుగాలుగా నెత్తుటేరులు పారించిన
మతాలు మళ్ళీ పడగలెత్తుతున్నాయి
అంబేద్కర్ మనిషిని ప్రేమించడం నేర్పాడు
కులాల హద్దులు చెరిపాడు
వీరు మళ్ళీ కులం గోడలు మనుషుల మధ్య కడుతున్నారు
అందుకే! ఒక పూలే, ఒక పెరియార్ మళ్ళీ నిద్ర లేస్తున్నారు
దశావతారాలు హంతకులని చెబుతున్నారు
మూలవాసులు నిర్మించిన భారతదేశం
సమతా మార్గాన్ని బోధిస్తుంది
జీవించడం అంటే ప్లవించడం, పల్లవించడం
పరిణామ శీలమైందే సమాజం
సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి
స్వాగతం! సుస్వాగతం!

-డాక్టర్ కత్తి పద్మారావు, ✆: 9849741695

విశాలాంధ్ర
బతుకు
The Life
సోమవారం
21 జనవరి 2019

చిన్నారి యోధులు

నేటి బాలలే రేపటి పౌరులు, మరి ఇలాంటి భావి పౌరులకు స్వాతంత్రం తెచ్చిన మహానుభావుల గురించి, వారి సాహసాల గురించి తెలుపుటకు గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సావాలే సరైన సమయాలు. సమరయోధుల గురించి సాధారణంగా నోటితో చెబితే సరిపోదు ఇలాంటి వేషధారణలు చేయించాల్సిందే! ఇందుకు మరి మీరూ రెడీనా.!





కాఫీ మితంగా తాగితేనే మేలు

కాఫీ తాగే అలవాటున్నవారికి ఉదయాన్నే ఒక కప్పు కాఫీ చేతిలోకి తీసుకోందే గడవదు. అలవాటు లేనివారు దానిలోని లోటుపాట్లను పదేపదే అదేపనిగా ఎత్తిచూపుతుంటారు.

బాగా కాఫీ తాగే అలవాటున్న వారి నోటీ వెంట డీహైడ్రేషన్, యాంగ్జైటీ, తరచూ మూడ్స్ హెచ్చుతగ్గులు, తక్కువ ఎముకల సంద్రత వంటి ఫిర్యాదులు వినిపిస్తుంటాయి. ఇంకోపక్క కాఫీలో అనేక ప్రయోజనాలున్నాయని, టైప్-2 డయాబెటిస్‌ను అరికడుతుందని, పార్కిన్‌సన్స్, అల్జీమర్స్ వ్యాధుల నుంచి కాపాడుతుందని అంటారు.

మొత్తంమీద రెండు అభిప్రాయాలు కొంత అయోమయానికి కారణం కాకపోవు. మరి నా ఈ ఫేవరెట్ పానీయాన్ని తాగడాన్ని కొనసాగించవచ్చా? లేదా? అన్న ప్రశ్న ఉద్భవిస్తుంది.

నిజానికి ఈ ప్రశ్న తీరును మార్చుకోవాలి. ఎందుకంటే ఏ ఆహార పదార్థానికి సంబంధించి అయినా మంచి చెడు ప్రభావాల గురించి, ముగింపు, సమీక్ష డేటా లేదు. అందుకు కాఫీ అతీతం కాదు. కాబట్టి దేనికి సంబంధించయినా 'ఎంతవరకు తీసుకోవడం సురక్షితం?' అన్న ప్రశ్న వేసుకోవాలి. రోజుకు రెండు కప్పులకు మించితే ఎక్కువ కిందే లెక్క

మామూలుగా అవసరమైనదానికంటే చాలామంది అసంకల్పితంగా కాఫీ తాగేస్తుంటారు. ఏ చికాకు అయినా ఒక కప్పు కాఫీతో మాయం అన్న నమ్మికే ఇందుకు కారణం. ఇంకొందరు డికేఫ్ కాఫీ వల్ల 80-95 శాతం కెఫైన్ తగ్గుతుందనుకుంటారు.

ఇది నిజమే అయినా, సాధారణ కాఫీ కంటే దీనిలో హానికర రసాయనాలుంటాయి. కాబట్టి రెగ్యులర్ కాఫీయే ఉత్తమం అనుకోవాలి. కాఫీ మంచిదా, కాదా, తాగొచ్చా, తాగకూడదా అన్న మీమాంసల్ని పక్కన పెట్టి మితంగా తాగే కాఫీతో ఎలాంటి టెన్షన్ ఉండదు.

ఒంటరిగా ఉండొద్దు



'నాకెవ్వరి తోడు అక్కరలేదు. నేను ఒంటరిగా బతకగలను' అని ఎవరైనా అంటే వారు పంతం కొద్దీ అన్న మాట తప్పించి నిజానికి ఒంటరితనం కోరుకుని అంటున్న మాట కాదు.

ఒంటరితనం అనేది జీవితంలో ఎవరికీ ఎదురు కాకూడదు. ఏ వయసులో అయినా మనిషి ఒంటరిగా బతికేందుకు ఇష్టపడడు. అందుకే వివాహాన్ని వద్దనుకున్నవారు కూడా చివరికి ఏదో ఒక వయసులో ఎవరో ఒకరితో జత అయిపోతారు. అలా ఒంటరిగా బతికితే ఆయుర్దాయం తగ్గిపోతుంది.

వయసు మీద పడుతున్న కొద్దీ ఒంటరితనం భరించడం మరీ కష్టం. అరవై ఏళ్లు, ఆపై వయసువారు ఒంటరిగా బతకాల్సి వస్తే వారికి మరణం సంభవించే ప్రమాదం పదిశాతం అధికమవుతుందని పరిశోధనల్లో తేలింది. అందుకే ఒంటరితనాన్ని ఎవరూ కోరుకోకూడదని మానసిక శాస్త్రవేత్తలు అంటున్నారు.





పీడకలలకు చెక్

అర్థం లేని కలలు రావడం చాలా సహజం. వీటిలో కొన్ని భయంకరంగా ఉంటాయి. భయాందోళనలు కలిగిస్తాయి. ఇటువంటి కలలు అడపాదడపా 50 నుంచి 85% మందికి వస్తుంటాయి. పురుషుల్లోకన్నా స్త్రీలలో పీడకలలు అధికం. పీడకలల వల్ల ఆదుర్దా, అలసట, మూడ్ మారడం, ఇతర అనారోగ్యాలు వస్తాయి.

అదే సమయంలో పీడకలల వల్ల ఒత్తిడి తొలగిపోవడం జరుగుతుంది. దీర్ఘకాల భయానక అనుభవాల ప్రభావం తగ్గిపోతుంది. పీలకలలు రాకుండా ఉండాలంటే పడుకునేముందు ఎక్కువసేపు టీవీ చూడవద్దు.

కంప్యూటర్ ఆటలు ఆడవద్దు. పడుకునేముందు పది నిముషాలపాటు ధ్యానం చేయండి. ఇలా చేయడం వల్ల పీడకలలు రావడం బాగా తగ్గిపోతాయి.



మంచి స్నేహితులు.. విటమిన్లు



- శరీరానికి విటమిన్ల అవసరం ఎంత అని తేలిగ్గా తేల్చేయడం కష్టం. శరీరం ఆరోగ్యంగా, చర్మం నిగారింపుగా ఉండేందుకు ఇవి అవసరం.
- కొన్ని విటమిన్ల అవసరం ఏ విధంగా ఉంటుందో, వేటిలో లభిస్తాయోనన్న అవగాహన అవసరం. చిలక దదుంపలు, బ్రొకోలి, క్యారెట్, లివర్, ఫిష్ ఆయిల్, ఆప్రికోట్స్, లో ఫ్యాట్ మిల్క్ విటమిన్ 'ఎ'కు మంచి ఆధారం. ఇవి చర్మకణాల పునరుత్తేజానికి ఉపకరిస్తాయి.
- 'బి' కాంప్లెక్స్ విటమిన్లు స్కిన్‌ఫుడ్స్. ఇవి చర్మాన్ని దురద నుంచి, పొడిబారకుండా పరిరక్షిస్తాయి. ఈ విటమిన్లు లోపిస్తే పెదవుల చివరలు పగిలిపోతాయి. ముక్కు చుట్టూ వ్యాక్సి డెర్మటైటిస్ వస్తుంది. ఫ్లేకిప్యాచెస్ వస్తాయి. విటమిన్ 'బి3' లోపించడంవల్ల చర్మం కమిలిపోయినట్లు కనపడుతుంది.
- 'బి6' విటమిన్ లోపిస్తే చర్మంపై ర్యాష్, డెర్మటైటిస్ వస్తాయి. మీట్, పౌల్ట్రి, లివర్, రైస్, ఈస్ట్, అవకాడో, పాలు, గుడ్లు, పెరుగు వీటికి మంచి ఆధారం.
- విటమిన్ 'సి', 'ఇ'లు కొలాజెన్‌ను పెంచి, చర్మం మృదువుగా ఉండేందుకు, సూర్య కిరణాల ఎక్స్‌పోజర్ వల్ల కలిగే హానినుంచి, స్మోక్, కాలుష్యాల నుంచి పరిరక్షించేందుకు సహకరిస్తాయి.
- విటమిన్ 'సి'కి బ్రొకోలి, బెల్ పెప్పర్లు, కొత్తిమీర, మొలకలు, క్యాలీఫ్లవర్, నిమ్మరసం, స్ట్రాబెర్రీలు, ఆవ ఆకు, కివి, బొప్పాయి, క్యాబేజి, టర్నిప్ గ్రీన్స్, కమలా, ద్రాక్ష, పైనాపిల్, టొమేటో మంచి ఆధారాలు.
- విటమిన్ 'ఇ', బాదం, పొద్దు తిరుగుడు గింజలు, గుమ్మడి గింజలు, పాలకూర, ఆలివ్స్, ఆలివ్ ఆయిల్, అవకాడో, బొప్పాయిలలో లభిస్తుంది. విటమిన్ 'కె' కళ్ళకింది నల్లని వలయాలతో పోరాడుతుంది.
- పాలకూర, తోటకూర, అవకాడో, ద్రాక్ష, కివి పండ్లలో ఈ విటమిన్ లభిస్తుంది.

తిండి మార్పు సరిపోదు



బరువు తగ్గాలనుకోగానే చాలామంది డైటింగ్ అంటారు. అంటే ఒక క్రమ పద్ధతిలో తక్కువ మోతాదులో ఆహారం తీసుకోవడం జరుగుతుంది.

ఆహారం మీద ఆంక్షలు అమలైనంతకాలం సన్నబడతారు. ఇక సన్నబడ్డాం కదా అని తిరిగి సాధారణ స్థితికి ఆహారం చేరితే మరలా పాత లావు, బరువు అలా వచ్చేస్తాయి.

అందువల్ల నిజంగా బరువు తగ్గాలంటే కేవలం డైటింగ్ చేస్తే సరిపోదు. ఆహారపు నియమాలతోపాటు వ్యాయామం కూడా క్రమం తప్పక పాటించాలి. అప్పుడే బరువు కావాల్సినంత తగ్గుతారు. ఆ తగ్గిన బరువు నిలకడగా ఉంటుంది.

గుడ్డెందుకు తినాలి ?

గుడ్డు పోషకాల నిలయం. ఇందులో మాంసకృత్తులు (ప్రోటీన్), అత్యవసరమైన 9 అమైనో ఆమ్లాలు, బి కాంప్లెక్స్ విటమిన్లు, డి విటమిన్, ఖనిజాలు దండిగా ఉంటాయి. గుడ్డు తింటే బరువు పెరుగుతుందని చాలా మంది భావిస్తుంటారు. దీనికి కారణం పచ్చసొనలోని కొలెస్ట్రాలే. అయితే గుడ్డులో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పటికీ.. దీంతో రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదులు అంత ఎక్కువగా ఏమీ పెరగటం లేదని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులో కేలరీలు తక్కువ. పైగా చాలాసేపటి వరకు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. ఫలితంగా త్వరగా ఆకలి వేయదు. ఇలా ఇది పరోక్షంగా బరువు తగ్గటానికీ తోడ్పడుతుంది.



- కణాల పనితీరు, వాటి ఎదుగుదల, శక్తిని అందించటంతో పాటు శరీరంలో జరిగే పలు జీవక్రియలకు అవసరమైన పోషకాలు గుడ్డుతో లభిస్తాయి.
- దీని పచ్చసొనలోని ఐరన్ మన శరీరం తేలికగా గ్రహించటానికి అనువుగానూ ఉంటుంది.



- గుడ్డులోని ల్యూటీన్ అనే యాంటీ ఆక్సిడెంటు కంటి జబ్బుల ముప్పు తగ్గటానికి తోడ్పడుతుంది. వృద్ధాప్యంలో మెదడు ఆరోగ్యంగా ఉండటానికీ ఇది దోహదం చేస్తుంది. .
- రోజుకు ఒక గుడ్డు తినేవారిలో పక్షవాతం ముప్పు 12 శాతం వరకు తగ్గుతున్నట్టు ఒక పరిశోధనలో వెల్లడైంది.

అతిగా నీరు తాగొద్దు

శరీరానికి నీరు అవసరం. కాబట్టి శరీరంలో నీటిశాతం తగ్గకుండా చూసుకోవాల్సిందే. అయితే నీటిని పరిమితికి మించి తీసుకోవద్దు. శరీరంలో నీటి శాతం తగ్గితే ఏర్పడే డీహైడ్రేషన్ ఎంత ప్రమాదమో నీరు పెరిగితే వచ్చే ఓవర్ హైడ్రేషన్ కూడా ప్రమాదమే. శరీరంలో నీటి శాతం పెరిగితే లవణాల గాఢత తగ్గుతుంది. ముఖ్యంగా సోడియం గాఢత తగ్గి, దానిస్థాయి పడిపోతే దాని ప్రభావం నాడీ వ్యవస్థ మీద పడుతుంది. దీని ప్రభావాన మూర్ఛ రావచ్చు. స్పృహ కోల్పోయే అవకాశమూ ఉంది. నీరు అధికంగా తాగితే రక్త ఘన పరిమాణం పెరిగి, మూత్రపిండాలు ఒత్తిడికి గురవుతాయి. నీరును ఒక్కసారిగా పలు గ్లాసులుగా తాగడం కన్నా తరచుగా కొంచెం కొంచెం తీసుకోవడం వల్ల మేలు కలుగుతుంది.

మొటిమల్ని తగ్గించే బ్యాక్టీరియా



మొటిమలు, గాయాలు తగ్గడానికి రకరకాల క్రీములు, మందులు సర్వసాధారణంగా వాడుతుంటారు. వీటన్నింటికంటే తేలికైన చికిత్స స్వేదాన్ని తినే బ్యాక్టీరియా. స్వేదంలోని ప్రధాన పదార్థమైన అమ్మోనియా తినే బ్యాక్టీరియా చర్మం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీనిని చర్మ సంబంధిత రుగ్మతల చికిత్సలో వాడుతుంటారు కూడా. ఇది మొటిమలపై అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తుందని పరిశోధకులు గుర్తించారు. ఈ బ్యాక్టీరియా ఉండడం వల్ల చర్మం కండిషనింగ్ బాగుంటుందని ఈ అమ్మోనియా ఆక్సిడైజింగ్ బ్యాక్టీరియా మట్టిలో, నీటిలో అధికంగా కనబడుతుందని తెలిపారు.



నేను - సుడిగుండం

(నవల) 21

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

"నువ్వు వెన్నెల గురించి ఏమనుకుంటున్నావ్?"

"నా మావయ్య కూతురు వెన్నెల. ముందు తను చదువుకోవాలి. తన కాళ్ల మీద తను నిలబడాలి"

"నువ్వు మారిపోయావురా. నువ్వు విశాఖపట్టణం వెళ్లక ముందు రామూవీ కాదు. ఉద్యోగం చేస్తున్నాక ఇంకా మారావు. ఒకటి గుర్తుంచుకో. మీ మావయ్య నిన్ను అక్కడికి పంపటం వలన నీకు కొత్త స్నేహితులొచ్చారు. ఇప్పుడు పెళ్లి వద్దంటున్నావు. దీని అర్థం నాకు తెలవదనుకోకు"

"ఇప్పుడేం చేయమంటావ్?"

"వెన్నెలని పెళ్లి చేసుకో"

"అప్పుడే పెళ్లి? వెన్నెల వయసెంత? నా వయసెంత? ముందు నాకు మంచి ఉద్యోగం లేదు. మన వెనకాల డబ్బు లేదు. ఏ రోజున వాళ్లు బయటకు వెళ్లమంటే వెళ్లాలి. మీ అన్నయ్యలు నిన్ను వదిలించుకున్నట్లు నువ్వూ మాట్లాడుతున్నావు"

అపుడు షాకయింది.

"అసలు మనిషికి పెళ్లి తప్ప ఇంకోటి వుండదా? ఇప్పుడు మావయ్య సమస్యల్లో వున్నాడు. అవన్నీ తీర్చాలి. నేను ఇప్పుడు పెళ్లి చేసుకుంటే ఆ పని చేయగలనా? నేనూ, నా కుటుంబం అనుకుంటాను. పెళ్లి, తర్వాత పిల్లలు అంటావు. లేదా లోకం అంటోంది అంటావు. నువ్వు ప్రశాంతంగా ఆలో చించు. వెన్నెలతో నేను మాట్లాడతాను. హైదరాబాద్ తీసుకు వెళ్లి చదివిస్తాను"

"పెళ్లి కాని పిల్లను నీతో పంపిస్తారా? అదింకా చిన్న పిల్ల అనుకుంటున్నావా?"

"నా మీద నీకు నమ్మకం లేదా?"

"నాకు వెన్నెల మీద కూడా నమ్మకం లేదు. అది చదువుకుంటే నీలానే మారుతుంది. అదెన్ని వాదనలు చేస్తుందో. నేనూ పెళ్లి చేసుకోను అనొచ్చు"

"అంటే ప్రమాదమా!"

"ప్రమాదమే" అంది వెంటనే,

"అంటే ఎవరూ చదువుకోకూడదు అంటావు! ఒక్కమాట చెప్పు నాన్న చనిపోయాక మావయ్య నిన్నూ పెళ్లి చేసుకో అని అడిగాడని నాకు తెలుసు. నువ్వెందుకు చేసుకోలేదు"

"నీ కోసం, నువ్వు ఇలా మాట్లాడతావని నాకు తెలియదు"

అమ్మ ఇంత కఠినంగా, మూర్ఖంగా వాదించటం నాకు బాధని, ఆవేశాన్ని, రకరకాల భావాల్ని రగిలిస్తున్నాయి..

నన్ను అనుమానిస్తుందంటే అన్నయ్యలు కారణం కావచ్చు. సమాజంలో చూస్తున్న మనుషులు కావచ్చు. కనీసం మూడు సంవత్సరాలు ఆగితే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయి.

"మా పెళ్లి జరిగితే అర్చనకి కూడా అన్యాయం జరుగుతుంది" అన్నాను.

"ఎవరికీ అన్యాయం జరగదు. మీ మావయ్య ఇంకా బతికి వున్నాడు" అంది.

"మావయ్య మా వెన్నెలని చేసుకోండి. ఇప్పుడే చేసుకోండి అని నిన్ను అడిగాడా?"

"అడగడు. మనం అర్థం చేసుకోవాలి. మన బాధ్యత ఏమిటో తెలుసుకోవాలి. ఒకప్పుడయితే నేనూ అన్నాను. అన్నయ్యకి మనం తగం అని. వాళ్లు ఇష్టపడితేనే వెన్నెలతో నీ పెళ్లి జరుగుతుందని. ఇన్ని మాటలు అనవసరం రామూ... నీ మేనమామల్లా నేనూ ఎవరినీ లెక్క చేయను. నా ఇష్టం వచ్చినట్లు నేను చేస్తాను అంటే నీ ఇష్టం. ఈ రోజుతో నాకూ నీకు సంబంధం లేదు"

"మెడ మీద కత్తి పెట్టి ఒప్పిస్తావా? నేను మావయ్యతో మాట్లాడతాను"

"ఆ పని చేస్తే నేను నిజంగానే చచ్చిపోతాను"

ఇంక మాటలు అనవసరం. ఇలా మాట్లాడు కుంటూ పోతే సంభాషణ ఎక్కడికి చేరుకుంటుందో- ఆవేశంలో ఏదన్నా జరగరానిది జరిగితే బతికున్నంత కాలం ఏడవాలి అనుకున్నా.

అమ్మే చివరి మాటగా అంది.

"నాకు రెండు రోజుల్లో నువ్వు సమాధానం చెప్పాలి. ఆ తర్వాత నా మాట మీద నేనుంటా"

నేను అర్జంట్‌గా అమితను కలవాలి అనుకున్నాను. ముందుగా నేను వస్తున్నట్లు ఫోన్ చేసాను.

"ఏం జరిగింది?" అంది ఆశ్చర్యంగా.

"నీ దగ్గరకు వచ్చి వివరంగా మాట్లాడతాను" అన్నాను.

****

ఎప్పటిలానే సముద్రం ఒడ్డున కూర్చున్నాం. సముద్ర ఘోషని మించినది నా గుండెల్లో వుంది.

నేను అమిత గురించి అమ్మ అభిప్రాయం కాకుండా ఇప్పటికిప్పుడు వెన్నెలను పెళ్లి చేసుకోమనటం మీద మాట్లాడాను.

అమిత నన్ను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తోంది.

"ఈ పెళ్లి జరగటం వల్ల మావయ్య కుటుంబానికి మంచి జరగదు అని నాకు అనిపిస్తోంది. నేను ఇక్కడికి వస్తున్నప్పుడు ఇటు నుండి ఎటైనా పారిపోవాలనిపించింది. బలవంతాన నన్ను నేను కంట్రోల్ చేసుకున్నాను. ఇప్పుడు కాస్త మంచి మార్పులు వస్తున్నాయనుకుంటే ఈ పెళ్లి గొడవ ఏంటో నాకు అర్థం కావటం లేదు" అన్నాను అసహనంగా.



"ఇప్పుడేం చేయాలనుకుంటున్నావు?

"నా వరకు నాకు నిజంగా పెళ్లి చేసుకోవాలని లేదు. అందుకు రకరకాల కారణాలు. ముందు ఆ కుటుంబ సమస్యలను పరిష్కరించాలి. అదే నా ఆలోచన."

"ఇప్పుడు పరిస్థితి చెయ్యి దాటి పోయింది రామూ... నాకొకటి చెప్పు. మీ అమ్మ నిన్ను ఎమోషనల్‌గా బ్లాక్ మెయిల్ చేస్తోందని పైకి అనిపిస్తుంది. నిజంగానే నువ్వు కాదంటే డ్రాస్టిక్ నిర్ణయం తీసుకుంటుందా?"

నేను మాట్లాడలేదు.

"ఓ పనీ చెయ్యి. ఆమె గురించి మరిచిపో. నువ్వు ఏం చేయాలను కుంటున్నావో అది చెయ్యి. .

"అలా అనుకోలేకపోతున్నాను అమితా... అందుకే నలిగిపోతున్నాను"

"కనీసం వెన్నెల అభిప్రాయం అడిగారా మీ అమ్మ?"

"తనకి ఇష్టంగానే వుంటుంది. మా అమ్మా, తను మాట్లాడుకుని వుంటారు. మా మావయ్యని ఇంకా అడగలేదు"

"ఆయనేమంటారో చూద్దాం" అంది అమిత.

"మావయ్యని మాత్రం అమ్మ కన్విన్స్ చేయదా?"

"నా అభిప్రాయం చెబుతాను. మీ అందరినీ గమనిస్తే ఎవరూ స్వార్థపరులు కాదు. అలా వున్నచోట ఘర్షణ రూపం ఇంకో రకంగా వుంటుంది. నువ్వు కుటుంబపరంగా చూసినా, ఇంకే రంగంలో చూసినా అలాంటి వారికి భార్య భర్త- పిల్లలూ వున్నారు. నువ్వు మూడు సంవత్సరాలు ఆగుతాను అంటున్నావు. కాస్త ముందు చేసుకుంటావు. అంతే" అంది.

అమిత దగ్గర సెలవు తీసుకున్నాను. ఈసారి సముద్ర తీరంలో వేటికోసమో వెతకాలన్న ఆలోచన కూడా రాలేదు!

****

నేను విశాఖ వచ్చినప్పుడు అమ్మ మావయ్యతో "మీకు ఇష్టమయితే వెన్నెలకి రామూతో పెళ్లి చేద్దాం" అందట.

"అప్పుడే దానికి పెళ్లేంటి బుల్లమ్మాయ్" అన్నాడంట.

"వాడేమో ఒక్కడే వుంటున్నాడు. భోజనానికి యిబ్బందిగా వుంది. పైగా వెన్నెలని హైదరాబాద్‌లో చదివిస్తాను అంటున్నాడు"

"భోజనం యిబ్బందనుకుంటే నువ్వు వెళ్తువు గాని. నీతో పాటు వెన్నెల వస్తుంది"

"అదంతా కాదు. నీకు ఇష్టం వుందో లేదో చెప్పు"

"ఇష్టం లేకపోవటానికి రాము తెలియని వాడా... చిన్నప్పటి నుంచి ఈ గుండెల మీద పెంచుకున్నాను"

"ఇంకేంటి అభ్యంతరం?"

"మమ్మల్ని ముసలితనంలో చూస్తారని మీ ఇద్దర్నీ దగ్గరకు తీయలేదు. అప్పటికి మాకు పిల్లలు లేరు. పెదనాన్న బతికున్నంత వరకు ఏ లోటూ లేకుండా బతికావు. ఆ తర్వాత నీకంటూ ఏ సుఖం లేదు. కనీసం రాము నిన్ను చూసుకుంటాడను కున్నాను. వాడు మా వెన్నెల్ని చేసుకోవాలని నేను ఏ రోజూ అనుకోలేదు. రెండు సంవత్సరాలు ఆగితే రాముకి మంచి సంబంధం వస్తుంది"

"అంటే మమ్మల్ని పరాయి మనుషులుగా చూస్తున్నావా? మేం అంత స్వార్థ పరులం అయ్యామా?"

"నేను స్వార్థపరుడ్ని కాకూడదనుకుంటాను తప్ప మిమ్మల్ని అనుకోను. ముందు నుండి నువ్వూ, అల్లుడూ చదువు వద్దు అంటున్నారు. మనం ఏదో ఆశించి ఎవరికీ సాయం చేయకూడదని నా అభిప్రాయం"

"అన్నయ్యా... ఎదుటి మనుషులు కూడా ఎల్ల కాలం సాయం పొందాలను కోరు. నువ్వు దెబ్బతింది మా వల్ల"

"అలా అనకు"

"అది నిజం. నీ పరిస్థితి ఇంకోలా వుంటే నేను పెళ్లి గురించి అడిగేదాన్ని కాదు. వెన్నెలకిగానీ, అర్చనకి గానీ మంచి సంబంధం రావాలి. అదీ పుట్టినప్పుడు నాకు కోడలయితే బాగుండును అనుకున్నా. ఇదే మొదటిసారి మీ ముందు అన్నాను. మీ అంతట మీకు ఇష్టమై రాముని చేసుకోవాలనుకున్నాను. ఇప్పుడు కూడా నేను మాట్లాడకపోతే మీరు అడగరు"

మావయ్య నిశ్శబ్దంగా విన్నాడు.

"మాట్లాడు అన్నయ్యా"

"అల్లుడితో ఓ మాట అన్నావా?"

"అనకుండా ఎలా వుంటాను?"

"నిన్ను నేను కాదనలేను. రెండు సంవత్సరాలు ఆగుదాం"

(ఇంకా ఉంది)

స్పేస్ సైన్స్ కోర్సులతో ఉపాధి అవకాశాలు అనంతం



మన దేశం రాకెట్ల ద్వారా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టే ఉపగ్రహాల సహకారంతో మన టీవీలు, రేడియోలు, ఫోన్లు, విమానాలు... ఇలా ఎన్నో పనిచేస్తుంటాయి. వీటి వెనుక ఎందరో పరిశోధకులు, ఎన్నో రకాల నిపుణుల కృషి ఉంటుంది. వారిలో ఒకరిగా కావాలంటే అంతరిక్షాన్ని అర్థం చేసుకోవాలి. పాలపుంతలపై పరీక్షలు రాయాలి. అప్పుడే అనంత విశ్వంలోని అపార అవకాశాలను అందిపుచ్చుకోగలుగుతారు. అందుకోసం స్పేస్ సైన్స్ కోర్సులు చదవాలి.

భవిష్యత్‌లో అంతరిక్ష యుగం మొదలవుతుంది. ఎలాంటి విపత్తులు ఎదురైనా మానవాళి మనుగడను కాపాడేందుకు ఇతర గ్రహాల్లో అన్వేషణలు, భూమికి ప్రత్యామ్నాయ గ్రహాన్ని కనుగొనడం చాలా కీలకం. ఇందుకనుగుణంగా సన్నాహాలు చేస్తున్నారు. వీటన్నింటి కారణంగా అంతరిక్షరంగ ప్రాధాన్యం పెరుగుతోంది. భారత ప్రభుత్వం ఈ రంగానికి బడ్జెట్‌లో భారీ నిధులు కేటాయిస్తోంది. 2022లో చేపట్టే మానవసహిత అంతరిక్షయాత్ర 'గగన్‌యాన్'కు రూ.10వేల కోట్లకు ఆమోదం తెలిపింది. ఈ యాత్రవల్ల దీర్ఘకాలంలో అనేక ఉద్యోగాలను సృష్టించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువశాతం ఉద్యోగాలు పరిశ్రమల్లోనూ, మిగతావి విద్యాసంస్థల్లో వస్తాయని అంచనా. 2020లో ఒక మానవరహిత యాత్రనూ భారత్ చేపట్టనుంది. ఈ ఏడాది సంక్లిష్టమైన చంద్రయాన్ -2 సహా 32 అంతరిక్ష ప్రయోగాలు చేపట్టనున్నట్లు భారత అంతరిక్షసంస్థ- ఇస్రో ప్రకటించింది.

స్పేస్ సైన్స్ అంటే విశ్వం గురించి చేసే శాస్త్రీయ అధ్యయనం. ప్రత్యేకించి దీని కదలిక, పొజిషన్స్, పరిమాణం, కంపోజిషన్‌తోపాటు ఖగోళ వస్తువుల ప్రవర్తన గురించి పరిశోధనలు చేయడం. టీవీ, రేడియో, ఫోన్ సిగ్నల్స్; కార్లు, విమానాలలో వాడే శాటిలైట్ నావిగేషన్లు అంతరిక్షంలోని ఉపగ్రహాలు మనకు పంపించే సమాచారం ఆధారంగానే పనిచేస్తున్నాయి. కార్లు, మోటారు బైక్‌ల నుంచి వెలువడే కాలుష్యం కారణంగా ఓజోన్ పొర ఎలా దెబ్బతింటోంది?, వాతావరణం, మహాసముద్రాలు, అడవులు, ఎడారులు, వివిధ మారుమూల ప్రాంతాల గురించి మనం తెలుసుకునే సమాచారమంతా శాటిలైట్లు పంపించేదే. వాతావరణ పరిస్థితులను ముందుగానే తెలుసుకుని ప్రకృతి వైపరీత్యాలను అంచనా వేయడంలోనూ ఉపగ్రహాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి.

ఏ కోర్సులు చేయటం మేలు?

➡ ఈ రంగంలో స్థిరపడాలంటే ఇంటర్‌లో తప్పనిసరిగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ సబ్జెక్ట్‌ను తీసుకోవాలి. జేఈఈ అడ్వాన్స్‌డ్, జెస్ట్, సీఎస్ఐఆర్ నెట్ లాంటి ప్రవేశపరీక్షల ఆధారంగా కోర్సుల్లో చేరవచ్చు.

➡ ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కాలవ్యవధి అయిదేళ్లు. ఫిజిక్స్ ప్రధానాంశంగా డిగ్రీ చేసి ఎంఎస్సీ ఫిజిక్స్, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ (ఫిజిక్స్) చేయవచ్చు.

➡ బీఈ- స్పేస్ టెక్నాలజీ వ్యవధి నాలుగేళ్లు. అస్ట్రానమీ, అస్ట్రోఫిజిక్స్, కాస్మాలజీ, స్టెల్లార్ సైన్స్, ప్లానెటరీ సైన్స్ గురించి చదువుతారు. ఎయిర్‌క్రాఫ్ట్ నిర్మాణం, రూపకల్పనలో అభిరుచి ఉన్నవారు ఈ కోర్సులో చేరవచ్చు.

➡ బీటెక్ ఏవియానిక్స్ ఇంజినీరింగ్ వ్యవధి నాలుగేళ్లు. విశ్లేషణ సామర్థ్యం, లాజికల్, రీజనింగ్ స్కిల్స్, గణితంలో నైపుణ్యం ఉన్నవారు ఈ కోర్సును అధ్యయనం చేస్తే కెరియర్ బాగుంటుంది.

➡ బీటెక్ స్పేస్ టెక్నాలజీ కోర్సు నాలుగేళ్లు. సోలార్ సిస్టమ్, భూమి, ఇతర గ్రహాలు, అంతరిక్షం మొదలైన విషయాలను గురించి తెలుసుకుంటారు.

➡ ఎంటెక్ క్రయోజెనిక్ ఇంజినీరింగ్ రెండేళ్ల కోర్సు. బీఈ/బీటెక్ తర్వాత ప్రవేశపరీక్ష ఆధారంగా చేరొచ్చు. ఇది మెకానికల్, కెమికల్ ఇంజినీరింగ్‌ల కలయిక. రాకెట్ ప్రొపెల్షన్‌లో క్రయోజెనిక్‌ది కీలకపాత్ర.

➡ డిప్లొమా ఇన్ స్పేస్ టెక్నాలజీ వ్యవధి మూడేళ్లు. పదో తరగతి తర్వాత చేయాలి. విద్యార్థులు మేథమేటిక్స్, ఎలక్ట్రానిక్స్, థర్మోడైనమిక్స్ సంబంధిత సబ్జెక్టులు అధ్యయనం చేస్తారు. ఈ కోర్సు పూర్తి చేసినవారు మాస్టర్ డిగ్రీలో చేరవచ్చు లేదా రిసెర్చ్‌వైపూ వెళ్లొచ్చు.

➡ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఎయిర్ పొల్యూషన్ మెజర్‌మెంట్ అండ్ కంట్రోల్ ఇంజినీరింగ్ కాలవ్యవధి సంవత్సరం. ఇంటర్ (ఎంపీసీ) తర్వాత చేయొచ్చు. జాదవ్‌పూర్ యూనివర్సిటీలో ఉంది.

ఉద్యోగావకాశాలు

ఆస్ట్రోనాట్స్ : ఆస్ట్రోనాట్ కావడానికి సంబంధిత విభాగానికి చెందిన సైన్స్ లేదా మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చేసి, తప్పనిసరిగా అనుభవం పొందిన పైలట్ అయి ఉండాలి. ఫిట్‌నెస్ ప్రమాణాలనూ పాటించాలి. ఇందుకు కఠినమైన శిక్షణ ఉంటుంది. వీరు అంతరిక్ష అన్వేషణ కార్యక్రమంలో పాల్గొంటారు.

స్పేస్ ఇంజినీర్స్ : స్పేస్ ఇంజినీర్లు తమ సాంకేతిక నైపుణ్యంతో అంతరిక్ష యాత్రను విజయవంతం చేస్తారు. వీరు స్పేస్ - క్రాఫ్ట్స్, స్పేస్ వెహికల్, స్పేస్ స్టేషన్లను రూపొందిస్తారు. అలాగే ఒక ఉపగ్రహ వాహనానికి కావాల్సిన వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తారు. దాని ప్రసార, కమ్యూనికేషన్‌ను సులభతరం చేస్తారు.

స్పేస్ సైంటిస్ట్ : అనేక విభాగాల్లోని శాస్త్రవేత్తలు స్పేస్‌సైన్స్‌లో శాస్త్రవేత్తలుగా మారొచ్చు. ఉదాహరణకి ఫార్మాలజీ శాస్త్రవేత్త స్పేస్ యాత్రలో లభించిన ఉల్కల లాంటి పదార్థాలతో మందులను తయారు చేయడం.



టెక్నాలజిస్టు, టెక్నీషియన్స్ : స్పేస్ సైంటిస్టులు, ఇంజినీర్లు వివిధ స్పేస్ ప్రాజెక్టులు, సాంకేతిక ఆవిష్కరణల నిర్మాణం, అభివృద్ధి, వాటికి సంబంధించి పరీక్షలను జరిపినపుడు టెక్నాలజిస్టు, టెక్నీషియన్స్ సహాయపడతారు. వీరే కమ్యూనికేషన్ టెక్నీషియన్లు, కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ (సీఏడీ) ఆపరేటర్స్, డ్రాఫ్టర్స్, ఎలక్ట్రీషియన్స్, లేజర్ టెక్నీషియన్స్, క్వాలిటీ అస్యూరెన్స్ స్పెషలిస్ట్స్, రాడార్ టెక్నీషియన్స్, రోబోటిక్ టెక్నీషియన్లు, ఉపగ్రహ సాంకేతిక నిపుణులు ఈ విభాగంలోకి వస్తారు.

➡ అంతరిక్ష శాస్త్రవేత్తలు విశ్వవిద్యాలయాల్లో ఫ్యాకల్టీగా, పీహెచ్‌డీ విద్యార్థులకు గైడ్‌గా, పేపర్ల పబ్లిషర్‌గా, అకడమిక్ కమిటీల్లో సభ్యుడిగా, ప్రతిపాదనలను రాయడం, పబ్లికేషన్స్‌కు పేపర్లను రిఫర్ చేసేవారిగా పని చేయవచ్చు. ఇవే కాకుండా అబ్జర్వేటరీస్, సైన్స్ మ్యూజియం, అంతరిక్ష పరిశోధన సంస్థలు మొదలైనవాటిలో ఆస్ట్రానమర్లు, ఆస్ట్రోఫిజిస్ట్‌లుగా పని చేయవచ్చు.

➡ స్పేస్ సైన్స్ నిపుణులు సాఫ్ట్‌వేర్ లేదా టెక్నాలజీకి సంబంధించిన వ్యాసాలు రాయడం, టెలిస్కోప్ డిజైనింగ్, మ్యానుఫాక్చరింగ్, స్పేస్ ల్యాబొరేటరీల్లో పనిచేయవచ్చు. వీటితో పాటు ఆర్‌అండ్‌డీ కేంద్రాలు, మిలటరీ ఆపరేషన్స్‌లో స్పేస్ క్రాఫ్ట్ రూపకల్పన, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయవచ్చు. అలాగే స్పేస్ టూరిజం ఆపరేటర్లుగానూ ఉండవచ్చు.

➡ ఇస్రో శాటిలైట్ సెంటర్, ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, స్పేస్ అప్లికేషన్ సెంటర్, డాక్టర్ విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లు అంతరిక్ష శాస్త్రవేత్తలకు పరిశోధనలకు అవకాశాలు కల్పిస్తున్నాయి. సైంటిస్టులకు వారి విద్యార్హత, పనితీరు, సంస్థను బట్టి వేతనం ఉంటుంది. నైపుణ్యం బాగుంటే వేతనాలూ అధికంగానే ఉంటాయి.

ఇస్రోలో కోర్సు, ఉద్యోగం

ప్రపంచంలోనే అతి పెద్ద అంతరిక్ష సంస్థల్లో ఆరోదైన తిరువనంతపురం (కేరళ)లోని ఇస్రోను 1969లో విక్రం సారాభాయ్ నేతృత్వంలో నెలకొల్పారు. ఈ సంస్థ బ్రాడ్‌కాస్ట్ అండ్ కమ్యూనికేషన్, జియోగ్రఫిక్ ఇన్ఫర్‌మేషన్ సిస్టమ్స్, వెదర్ ఫోర్‌కాస్ట్, టెలిమెడిసిన్, కార్టోగ్రఫీ, నేవిగేషన్, డెడికేటెడ్ డిస్టన్స్ ఎడ్యుకేషన్ శాటిలైట్స్ ద్వారా భారత్‌కు అంతరిక్ష సేవలను అందిస్తోంది. ఈ సంస్థకు ఎంతోమంది నిపుణుల అవసరముంది.

➡ 2019 కిగానూ ఏరోస్పేస్ ఇంజినీరింగ్, ఏవియానిక్స్‌లో బీటెక్ చేయడానికి, అయిదేళ్ల డ్యూయల్ డిగ్రీ (బీటెక్ అండ్ మాస్టర్ ఆఫ్ సైన్స్/ఎంటెక్) ప్రోగ్రామ్‌కు సంబంధించి ఇస్రో నోటిఫికేషన్ విడుదలైంది. మే 22 నుంచి జూన్ 5లోపు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

అర్హత : ఈ కోర్సులకు అప్లై చేసే అభ్యర్థి తప్పనిసరిగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసిఉండాలి. మరిన్ని వివరాలకు www.iist.ac.in/admissions/undergraduate ను చూడొచ్చు.

అందిస్తున్న సంస్థలు

➡ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ
➡ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్
➡ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ
➡ బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ
➡ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్
➡ హిందుస్థాన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్
➡ యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్
➡ డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
➡ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్
➡ యూఎం-డీఏఈ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్
➡ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్
➡ ఇంటిగ్రేటెడ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ సెంటర్
➡ ఉస్మానియా యూనివర్సిటీ
➡ ఎస్‌వీఎన్ఐటీ, సూరత్
➡ మణిపాల్ విశ్వవిద్యాలయం
➡ ఆర్యభట్ట రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అబ్జర్వేషనల్ సైన్సెస్
➡ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్
➡ ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్
➡ నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రోఫిజిక్స్ (ఎన్‌సీఆర్ఏ), టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్
➡ ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ
➡ రామన్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
➡ అమిటీ యూనివర్సిటీ

ఎస్.ఎన్.బోస్ నేషనల్ సెంటర్ ఫర్ బేసిక్ సైన్సెస్

➡ యూఎన్‌తో కలిసి ఇస్రో ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ ఇన్ ఏషియా అండ్ పసిఫిక్‌లోనూ చదవొచ్చు.

➡ నేషనల్ న్యాచురల్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎన్ఎన్ఆర్ఎంఎస్) ప్రత్యేకంగా గుర్తించిన స్టేట్ రిమోట్ సెన్సింగ్ సెంటర్లు, డీఓఎస్ సెంటర్లలో ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. అలాగే పరిశోధకులు, ప్రొఫెషనల్స్‌కు కూడా కొన్ని అనుబంధ ఇన్‌స్టిట్యూట్స్ ద్వారా ట్రైనింగ్ ప్రోగ్రామ్స్‌ను కల్పిస్తోంది. అవి...

1) జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్
2) నేషనల్ వాటర్ అకాడమీ, సీడబ్ల్యూ, పుణె
3) నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే అండ్ ల్యాండ్ యూజ్ ప్లానింగ్, ఐసీఏఆర్, నాగ్‌పూర్.

➡ ఐఐఆర్ఎస్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిస్టెంట్ లర్నింగ్ ప్రోగ్రాంను ఎడ్యుశాట్ సహాయంతో 40కు పైగా విశ్వవిద్యాలయాలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో అందిస్తోంది.

ఉద్యోగ అవకాశాలు అందించే సంస్థలు

➡ ఇండియన్ స్పేస్ రిసర్చ్ ఆర్గనైజేషన్
➡ డిఫెన్స్ రిసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్
➡ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్
➡ నేషనల్ ఏరోనాటిక్స్ లిమిటెడ్
➡ నేషనల్ ఏరోనాటికల్ ల్యాబొరేటరీస్
➡ ఏరోస్పేస్ ఇండస్ట్రీ
➡ ఏవియానిక్స్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీస్
➡ ఆర్ అండ్ ఏవియానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ కంపెనీస్
➡ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు

నిరంతర కృషి అవసరం

ఖగోళశాస్త్రం విశ్వం గురించి చేసే అధ్యయనం. మానవుడు దీని అధ్యయనంలో ఎంత పరిశోధన చేసినా తెలుసుకోవాల్సింది ఇంకా ఎంతో ఉంది. ఈ ప్రక్రియలో ఎన్నో వైవిధ్యమైన కోర్సులతో ఖగోళశాస్త్రం ముందంజలో ఉంది. పరిశోధనా రంగంలో యువ మేధస్సుకు అనేక అవకాశాలను కల్పిస్తోంది. అంతుచిక్కని ఎన్నో ప్రశ్నలకు సమాధానాలను తెలుపుతూ ప్రజలలోని మూఢనమ్మకాలను పారదోలడానికి కృషి చేస్తోంది.

ఒక విద్యార్థి ఈ రంగంలో స్థిరపడాలనుకుంటే నిరంతర కృషి, పట్టుదల, దూరదృష్టి, సహనం కలిగి ఉండాలి. దీనికి సంబంధించి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ ప్రాజెక్టులు (టీఎంటీ- థర్టీ మీటర్ టెలిస్కోప్, జీఎంటీ- జెయింట్ మెజెలన్ టెలిస్కోప్, ఎల్ఐజీఓ - లేజర్ ఇంటర్‌ఫెరోమీటర్ గ్రావిటేషనల్ - వేవ్ అబ్జర్వేటరీ) రానున్నాయి. కాబట్టి యువతకు ఖగోళశాస్త్ర పరిశోధన రంగంలో ఎన్నో అవకాశాలు వచ్చే ఆస్కారం ఉంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ రంగాన్ని నిస్సందేహంగా ఎంచుకోవచ్చని ఈ రంగం నిపుణులు పేర్కొంటున్నారు.

రికార్డు సృష్టించిన పార్కర్ సోలార్ ప్రోబ్

సైన్స్ టెక్నాలజీ తాజా సమాచారం



సూర్యుడి ఉపరితలంపై పరిశోధనలకు నాసా ప్రయోగించిన పార్కర్ సోలార్ ప్రోబ్.. అద్భుతాన్ని సృష్టించింది. గత ఏడాది ఆరంభంలో ప్రయోగించిన ఈ పార్కర్ సోలార్ అక్టోబర్ 29 నాటికి సూర్యుడికి అత్యంత దగ్గరగా (42.73 మిలియన్ కిలోమీటర్లు(వెళ్లిన తొలి మానవ నిర్మిత వస్తువుగా రికార్డు నమోదు చేసింది. ఈ విషయాన్ని 2018 అక్టోబర్ 29న నాసా ఒక ప్రకటనలో పేర్కొంది. తొలిసారిగా 1976 ఏప్రిల్‌లో జర్మన్-అమెరికన్ రూపొందించిన హెలయస్ 2 స్పేస్ క్రాఫ్ట్ సూర్యుని ఉపరితలానికి సమీపంగా 246,960 కిలోమీటర్లు ప్రయాణించిందని, ఈ రికార్డును పార్కర్ సోలార్ ప్రోబ్ అధిగమించిందని నాసా తెలిపింది. తమ అంచనా ప్రకారం 2024లో ఈ పార్కర్ సోలార్ ప్రోబ్ సూర్యుని ఉపరితలానికి అతి సమీపంగా(3.83 మైల్స్) వెళ్తోందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

ప్రపంచంలోనే వేగవంతమైన కెమెరా ఆవిష్కరణ

శాస్త్ర, సాంకేతిక రంగంలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. సెకనుకు 10 లక్షల కోట్ల ఫ్రేములను బంధించగల సరికొత్త కెమెరాను శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. 'టీ-కంప్రెస్డ్ అల్ట్రాఫాస్ట్ ఫొటోగ్రఫీ (టీ-సీయూపీ)' గా దీన్ని పిలుస్తున్నారు. కాంతి ప్రసరిస్తున్న తీరును అత్యంత తక్కువ వేగంలో పరీక్షించేందుకు వీలుగా.. దాదాపు కాలాన్ని స్తంభింపజేస్తున్న తరహాలో ఈ కెమెరా పనిచేస్తుందని అమెరికాలోని కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన కెమెరా ఇదే కావచ్చని అభిప్రాయపడ్డారు. పదార్థాన్ని కాంతి తాకినప్పుడు చోటుచేసుకునే చర్యల వెనుక రహస్యాలను ఛేదించేందుకు, భౌతిక శాస్త్రంలో పరిశోధనలను కొత్త పుంతలు తొక్కించేందుకు టీ-సీయూపీ కీలకంగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వైద్యరంగంలో వినియోగానికి వీలుగా కొత్త తరం సూక్ష్మదర్శినులను అభివృద్ధి చేసేందుకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. తొలిసారిగా ఉపయోగించినప్పుడే టీ-సీయూపీ సరికొత్త రికార్డులు సృష్టించింది. ఒక ఫెమ్టోసెకన్‌లో లేజర్ కాంతి తరంగాన్ని గుర్తించింది. 400 ఫెమ్టోసెకన్ల వ్యవధితో రికార్డు చేసిన 25 ఫ్రేములతో ఇది సాధ్యమైంది. కాంతి తరంగ ఆకారం, తీవ్రతను తెలుసుకునేందుకు ఇది దోహదపడింది.

అంతరిక్షయానంతో మెదడుపై దుష్ప్రభావం

దీర్ఘకాలంతోపాటు అంతరిక్షంలో గడిపితే కండరాల క్షీణత, ఎముకల్లో సాంద్రత తగ్గుతుందనే ఇంతవరకు తెలుసు. మెదడుపై కూడా దుష్ప్ర భావం పడుతుందని రష్యా వ్యోమగాములపై చేసిన పరిశోధనలో తొలిసారిగా వెల్లడైంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో 189 రోజులపాటు గడిపిన 10మంది వ్యోమగాములపై జరిపిన అధ్యయనంలో ఈమేరకు తేలింది. అవగాహన శక్తిలో తేడాలొచ్చే అవకాశముంది. భూమికి చేరుకున్న తరువాత కూడా కనీసం ఆరునెలలపాటు మెదడులోని మూడు కణాల పరిమాణంలో మార్పులు చోటు చేసుకుంటున్నట్లు గమనించారు.

సూపర్ హ్యూమన్స్‌తో మానవాళి అంతం

విశ్వ ఆవిర్భావ రహస్యాలను, టైమ్ ట్రావెల్ సహా భవిష్యత్ పరిణామాలను సశాస్త్రీయంగా అన్ని వర్గాల వారికి అర్థమయ్యేలా వివరించిన భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్. బిగ్ బ్యాంగ్ నుంచి బ్లాక్ హోల్స్ వరకు విశ్వ రహస్యాలను వివరిస్తూ హాకింగ్ రాసిన 'ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ పొందింది. మోటార్ న్యూరాన్ వ్యాధితో బాధపడుతూ, వీల్‌చైర్‌కే పరిమితమైన పరిస్థితిలోనూ ఆయన పరిశోధనలను వదల్లేదు. ఈ ఏడాది ఆయన మరణించిన విషయం తెలిసిందే. ఆయన ఆలోచనలతో కూడిన పుస్తకం ఒకటి మార్కెట్‌లోకి త్వరలో రాబోతోంది. ప్రస్తుత సాధారణ మానవాళిని సమూలంగా అంతమొందించే 'సూపర్ హ్యూమన్' తరమొకటి రాబోతోందని 'బ్రీఫ్ ఆన్సర్ టు ద బిగ్ క్వశ్చన్' అనే పుస్తకంలో హెచ్చరించారు. అత్యాధునిక జన్యుసాంకేతికత సాయంతో అపార మేధోశక్తి సామర్థ్యాలతో రూపొందనున్న ఆ సూపర్ హ్యూమన్స్‌తో సాధారణ మనుషులు ఎందులోనూ పోటీ పడలేరన్నారు. 'సూపర్ హ్యూమన్స్ జీవం పోసుకున్న తరువాత సాధారణ మానవాళికి మరణం తప్ప మరో మార్గం ఉండదు' అని స్పష్టం చేశారు.

జంతుజాలం ఆవిర్భావానికి మూలం భారత్‌లో !

క్రీస్తుపూర్వం 66-63 కోట్ల ఏళ్లనాటిన అరుదైన 'డెమోస్పాంజి'ని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు పదేళ్లుగా కష్టపడి కనుగొన్నారు. దీనిని మన దేశంలోనే రాళ్ల మధ్య కనుగొనడం విశేషం. భూమిపై ఏకకణ, బహుకణ, సంక్లిష్టకణజీవులు ఏర్పడటానికి ముందు సముద్రపు నీటిలో ఇలాంటి స్పాంజి వంటి జీవులు కోట్ల ఏళ్లపాటు మనుగడ సాగించాయని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు.



భారత ఫార్మా కంపెనీల ఉత్పత్తుల రీకాల్


ముంబై : భారత్ దిగ్గజ ఫార్మా కంపెనీలు తమ ఔషధాలను అమెరికా మార్కెట్ నుంచి రీకాల్ చేశాయి. వీటిల్లో లుపిన్, సన్‌ఫార్మా, గ్లెన్‌మార్క్ వంటి కంపెనీలు ఉన్నాయి. ఈ విషయం అమెరికా ఎఫ్‌డీఏ తాజా నివేదికలో వెల్లడైంది. లుపిన్ సంస్థ 55 వేల వైల్స్, 1.6 పెట్టెల సెఫ్ట్రియాక్సిన్ ఇంజెక్షన్లను వాపస్ తీసుకుంది. వీటిని మధ్యప్రదేశ్‌లోని మండీదీప్ ప్లాంట్‌లో తయారు చేశారు. వీటిల్లో కొన్ని అవాంఛనీయ పదార్థాలను గుర్తించడంతో ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. వీటితోపాటు 2.8 సీసాల సెఫ్డినీర్ సిరప్‌ను కూడా వెనక్కి రప్పించింది. ఇదే విధంగా సన్‌ఫార్మా 13,918 కార్టన్ల వెక్యూరోనమ్ బ్రొమైడ్ ఇంజెక్షన్లను వాపస్ తీసుకొంది. జనరల్ అనస్తీషియాగా దీనిని వినియోగిస్తారు. వీటిల్లో కూడా కొన్ని అవాంఛనీయ పదార్థాలు ఉండటంతో వాపస్ తీసుకొన్నట్లు సమాచారం. ఇక గ్లెన్‌మార్క్ ఫార్మస్యూటికల్స్ 96,240 ఎస్ట్రాడియోల్ పరికరాలను వాపస్ తీసుకొంది.

ఎయిర్ ఇండియా భవంతిపై మరాఠా సర్కార్ కన్ను

ముంబై : దక్షిణ ముంబైలోని ఎయిర్ ఇండియా చారిత్రక భవంతిని మహారాష్ట్ర సర్కార్ దక్కించుకునే అవకాశాలున్నాయి. నారిమన్ పాయింట్ వద్ద మరైన్ డ్రైవ్‌లో ఉన్న ఈ 23 అంతస్తుల భవంతి నుంచి ఎయిర్ ఇండియా కార్యకలాపాలను 2013 నుంచి నిర్వహిస్తున్నది.

5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఈ భవంతిని కొనుగోలు చేయడానికి ఇటీవల బిడ్డింగ్‌ను సమర్పించినట్లు ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూషణ్ గాగ్రానీ తెలిపారు. బీమా దిగ్గజం ఎల్‌ఐసీ కూడా బిడ్డింగ్‌ను దాఖలు చేసినట్లు తెలుస్తున్నది. కాగా, ఈ ప్రతిష్ఠాత్మక భవంతిని దక్కించుకోవడానికి ఎయిర్ ఇండియాతో సంప్రదింపులు జరుపాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ చీఫ్ సెక్రటరీకి సూచించారు. ప్రభుత్వ, పీఎస్‌యూ కార్యాలయాలను ఎయిర్ ఇండియా భవంతికి షిఫ్ట్ చేయడం వల్ల భారీ స్థాయిలో పొదుపు చేసినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తున్నది.

ఫేస్‌బుక్‌ను దాటేసిన వాట్సాప్



కాలిఫోర్నియా: సామాజిక మాధ్యమ దిగ్గజం ఫేస్‌బుక్ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ, వాట్సాప్‌ను సొంతం చేసుకోవడం వల్ల మంచి ప్రయోజనాలు పొందుతోందని 'యాప్ అన్నె' అనే విశ్లేషక సంస్థ వెల్లడించింది. ఆ సంస్థ వెలువరించిన నివేదిక ప్రకారం..మెసేజింగ్ యాప్ వాట్సాప్ గతేడాది ఫేస్‌బుక్‌ను అధిగమించి ముందు వరసలో నిలిచింది. గత 24 నెలల్లో వాట్సాప్ 30 శాతం వృద్ధిని నమోదు చేసింది. అదే సమయంలో ఫేస్‌బుక్, ఫేస్‌బుక్ మెసెంజర్ 20 శాతం, 15 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేశాయి. అలాగే ఫేస్‌బుక్ ఆధ్వర్యం లోని ఇన్‌స్టాగ్రాం కూడా దూసుకుపోతుందని, గత రెండు సంవత్సరాల్లో 35 శాతం వృద్ధిని నమోదు చేసిందని వెల్లడించింది. నెలవారీ చురుగ్గా ఉన్న యూజర్ల ప్రకారం ఫేస్‌బుక్ ఇప్పుడు అంత పాపులారిటీ ఉన్న అప్లికేషన్ కాదని తెలిపింది. యూజర్ ఎంగేజ్‌మెంట్ ప్రకారం అన్ని యాప్స్‌తో పోల్చుకుంటే వాట్సాప్ ముందువరసలో ఉంది. సులభంగా వాడేలా ఉండటం, బేసిక్ ఫీచర్స్ అందుబాటులో ఉండటమే వాట్సాప్ దూసుకుపోడానికి కారణమని వివరించింది.

ఎల్ అండ్ టీకి సెబీ షాక్

రూ.9 వేల కోట్ల బైబ్యాక్‌కు నిరాకరణ

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద మౌలిక రంగ సంస్థ లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్ అండ్ టీ)కి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గట్టి షాకిచ్చింది. రూ.9 వేల కోట్ల షేర్ల బైబ్యాక్ అనుమతికి నిరాకరించింది. స్టాక్ ఎక్స్చేంజ్‌కు అందించిన సమాచారం మేరకు ఈ విషయం వెల్లడైంది.

బైబ్యాక్ ప్రతిపాదన సెబీ, కంపెనీల చట్టంలో ఉన్న నిబంధనలకు అనుగుణంగా లేకపోవడం వల్లనే తిరస్కరించినట్లు సంస్థ వెల్లడించింది. 6.1 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేయాలని కంపెనీ భావించింది. ఒక్కో షేరుకు రూ.1,475 చొప్పున మొత్తం రూ.9 వేల కోట్ల నిధులను ఇందుకోసం వెచ్చించ నున్నది. అక్టోబర్ 15 నాటికి కంపెనీ షేర్లు కలిగివున్న వారికి మాత్రమే దీనికి అర్హులు.

ఢిల్లీ స్థిరాస్తి రంగంపై ఐటీ కొరడా!

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ పరిధిలోని స్థిరాస్తి రంగంలో రూ.20వేలకు పైబడి నగదు రూపంలో లావాదేవీలు జరిపిన వ్యాపారులందరికీ అక్కడి ఐటీశాఖ తాఖీదులు జారీ చేయనున్నట్లు సమాచారం. ఇందుకోసం ఇప్పటి వరకూ జరిగిన రిజిస్ట్రేషన్లను ఐటీ అధికారులు జల్లెడ పడుతున్నారు. తద్వారా 2015-18 మధ్య జరిపిన స్థిరాస్తి కొనుగోళ్లు, అమ్మకాల్లో అవకతవకలపై కొరడా ఝుళిపించనున్నారు. ఇప్పటికే అక్కడి ఐటీ బృందాలు 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోదాలు జరిపాయి. 2015 జున్ 1 నుంచి గత డిసెంబర్ వరకూ జరిపిన రూ.20వేలకు పైబడి జరిగిన నగదు లావాదేవీల వివరాలన్నీ ఐటీ బృందాలు సేకరించినట్లు ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. నల్లధనం ఎక్కువగా స్థిరాస్తి రంగంలోకి మళ్లుతున్న విషయాన్ని పసిగట్టిన ఐటీశాఖ



రియాల్టీ సెక్టార్‌లో సెక్షన్లకు పలు మార్పులు చేసింది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఆదేశాల ప్రకారం 2015 జూన్ 1 నుంచి వ్యవసాయ భూములతో సహా ఎలాంటి రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన లావాదేవీలు జరిపినా అది చెక్, ఆర్టీజీఎస్, ఈ- చెల్లింపుల ద్వారానే జరగాల్సి ఉంటుం ది. నిబంధనలు అతిక్రమించి ఇలాంటి లావాదేవీలు జరిపినట్లయితే సెక్షన్ 271ఆ ప్రకారం అమ్మకందారుడు జరిమానా చెల్లిం చాల్సి ఉంటుంది. వచ్చే నెలలో నిబంధనలు అతిక్రమించి లావాదేవీలు జరిపిన అమ్మకం దారులు, కొనుగోలు దారులకు ఆదాయ పన్నుశాఖ అధికారులు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది. రూ.20వేలకు పైబడి తీసుకున్న నగదుపై లావాదేవీలపై జరిమానా విధించనున్నారు. ఈ సందర్భంగా కొనుగోలుదారుడు కూడా ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చిందో లెక్క చెప్పాల్సి ఉంటుందని ఓ ఐటీ అధికారి పేర్కొన్నారు.

జియోకు పెరిగిన చందాదారులు



న్యూఢిల్లీ: అతి తక్కువ ధరకే డేటాను అందిస్తూ టెలికం రంగంలోనే సంచల నాలు సృష్టిస్తున్న రిలయన్స్ జియో కొత్త చందాదారుల పొందే విష యంలోను అగ్రస్థానంలోనే నిలిచింది. 2018 నవంబరు నెలలో జియోకు 88.01లక్షల మంది చందాదారులు అదనంగా చేరారు. దీంతో నవంబరు 30 నాటికి రిలయన్స్ జియోకు మొత్తం 27.16లక్షల మంది చందాదారులు ఉన్నట్లు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) వెల్లడించింది. ట్రాయ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం అదనపు చందాదారులు పొందడంలో జియో అగ్రస్థానంలో ఉండగా, బీఎస్ఎన్ఎల్ రెండో స్థానంలో ఉంది.నవంబరు చివరి నాటికి దేశంలో మొత్తం 117.18కోట్ల మంది మొబైల్ ఫోన్ సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఇక బీఎస్ఎన్ఎల్‌కు అదనంగా 3.78లక్షల మంది చందాదారులు చేరారు. భారతీయ ఎయిర్‌టెల్‌కు 1.02లక్షల మంది కొత్త కస్టమర్లు వచ్చి చేరారు. 2018 డిసెంబరు నెలలో డౌన్‌లోడ్ స్పీడ్ తగ్గినప్పటికీ ఆ జాబితాలో జియో అగ్రస్థానంలోనే కొనసాగుతోందని ట్రాయ్ ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే. డౌన్‌లోడ్ స్పీడ్ 8శాతం తగ్గి 18.7ఎంబీపీఎస్‌గా నమోదైందని ట్రాయ్ వెల్లడించింది. గత 12 నెలలుగా జియోనే అగ్రస్థానంలోనే కొనసాగుతోంది.



ఇద్దరు పీఎన్‌బీ డైరెక్టర్లపై వేటు

ముంబై : పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను నీరవ్ మోదీ రూ.13వేల కోట్లకు మోసం చేసిన కేసులో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బ్యాంక్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సంజీవ్ శరణ్, కె.వీర బ్రహ్మాజీరావుపై విధుల నుంచి తొలగించింది. ఈ చర్యను ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్వాగతించింది. ఆ సంఘ జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం మాట్లాడుతూ "మేము కేంద్ర ప్రభుత్వ చర్యను స్వాగతిస్తున్నాం. అత్యున్నత నిర్వహణ బృందానికి తెలియకుండా ఇంత భారీ స్థాయిలో మోసం జరగడానికి అవకాశం లేదు. ప్రభుత్వం కూడా వారి వాదనలు విన్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకొంది" అని పేర్కొన్నారు.

ఇదే తొలిసారి..

నేషనల్ బ్యాంక్స్ స్కీం 1970 కింద ఒక జాతీయ బ్యాంక్‌కు చెందిన ఇద్దరు డైరెక్టర్లను తొలగించడం ఇదే తొలిసారి. 2018 జులైలో శరణ్, బ్రహ్మాజీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బ్రాడీ హౌస్ బ్రాంచ్‌లో స్విఫ్ట్ వ్యవస్థను దుర్వినియోగం చేయడంపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని నోటీస్‌లో పేర్కొంది. వారి వివరణలు పరిశీలించాక బ్యాంక్ బోర్డు అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని వారిని తొలగించింది.

రిలయన్స్ రికార్డులు

క్యూ3లో రూ.10.251 కోట్ల లాభం

కార్పొరేట్ చరిత్రలో ఇదే గరిష్ఠం

న్యూఢిల్లీ : దేశంలో అతిపెద్ద కార్పొరేట్ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ రికార్డుల మీద రికార్డులు బద్దలుకొడుతున్నది. కార్పొరేట్ చరిత్రను తిరగ రాస్తూ ఒక త్రైమాసికంలో రూ.10 వేల కోట్లకు పైగా నికర లాభాన్ని ఆర్జించిన సంస్థగా రికార్డు పుటల్లోకి ఎక్కింది. రిఫైనింగ్ మార్జిన్లు తగ్గుముఖం పట్టినప్పటికీ పెట్రో కెమికల్స్, రిటైల్, డిజిటల్ సేవల విభాగాల్లో మెరుగైన పనితీరు కనబర్చడం ఇందుకు దోహదం చేశాయి. చమురు నుంచి టెలికం వరకు సేవలు అందిస్తున్న సంస్థకు డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.10,251 కోట్ల(ప్రతిషేరుకు రూ.17.3) కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని నమోదుచేసుకున్నది. గతేదాది ఇదే సమయంలో వచ్చిన రూ.9,420 కోట్లతో పోలిస్తే 8.82 శాతం వృద్ధిని కనబరి చింది. మూడు నెలల్లో ఇంతటి లాభాన్ని ఆర్జించిన ప్రైవేట్ సంస్థగా ఆర్ఐఎల్ నిలిచింది. గతంలో ప్రభుత్వరంగ ఇంధన విక్రయ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) జనవరి-మార్చి 2013 మధ్య కాలంలో రూ.14,512.81 కోట్ల లాభాన్ని గడించింది. ఆదాయం విషయానికి వస్తే అక్టోబర్- డిసెంబర్ మధ్యకాలానికి రూ.1,71, 336 కోట్లు ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన ఆదా యంతో పోలిస్తే 56 శాతం ఎగ బాకింది. వరుసగా 16 త్రైమాసి కాలుగా లాభాలు ఆర్జించిన సంస్థగా



మరో రికా ర్డును నెలకొల్పింది. అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు తగ్గుముఖం పట్టడంతో చమురు రిఫైనింగ్ బిజినెస్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ రిటైల్ స్టోర్ల సంఖ్యను పెంచడం, జియో విని యోగదారులు సంఖ్య భారీగా పెరుగడం లాభాలు పుంజుకోవడానికి దోహదపడ్డా యని ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ తెలిపారు. కంపెనీ చరిత్రలో గడిచిన త్రైమాసికం మరో మైలు రాయిగా నిలిచిందని, ముఖ్యంగా లాభాల్లో పది వేల కోట్ల రూపాయలు దాటడంతో వాటాదారులు, దేశ విలువ కూడా మరింత పెరిగిందని ఆర్థిక ఫలితాల సందర్భంగా ఆయన వెల్లడించారు. చమురు ధరలు తీవ్ర ఆటోపోటులకు గురైనప్పటికీ పనితీరు మెరుగుపడటం విశేషమన్నారు.

జియో లాభం రూ.831 కోట్లు : ఇతర టెలికం సంస్థలు భారీ నష్టాలను మూటగట్టు కుంటున్న ప్రస్తుత తరుణంలో రిలయన్స్ జియో వరుసగా లాభాలతో విరజిల్లు తున్నది. గడిచిన ఏడాదికాలంగా లాభాలను ప్రకటించిన సంస్థ..డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల్లోనూ రూ.831 కోట్ల లాభం వచ్చినట్లు ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన రూ.681 కోట్ల లాభంతో పోలిస్తే 65 శాతం ఎగబాకింది. వినియోగదారులు పెరుగడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని కంపెనీ వెల్లడించింది. ఏడాది క్రితం 16 కోట్లుగా ఉన్న కస్టమర్లు..గత నెల చివరినాటికి 28 కోట్లకు పెరిగారు. ప్రతి భారతీయుడికి, ప్రతిదీ, ప్రతిచోట అందించాలనే తమ లక్ష్యం దిశగా చర్యలను వేగవంతం చేయడంతో ప్రపంచంలో అత్యధిక మొబైల్ డాటా నెట్‌వర్క్ కలిగిన సంస్థల్లో ఒక్కటిగా నిలిచినట్లు ముకేశ్ అంబానీ ఈ సందర్భంగా చెప్పారు. ఆదాయం విషయానికి వస్తే రూ.10,383 కోట్లు ఆర్జించింది. 2017-18 ఇదే సమయంలో వచ్చిన రూ.6,879 కోట్లతో పోలిస్తే 50.9 శాతం ఎగబాకింది. సరాసరిగా ఒక్కో వినియోగదారుడు నెలకు 10.8 జీబీల డాటాను, 794 నిమిషాల వాయిస్ కాల్స్ చేశారు. ఒక్కో వినియోగదారుడి ద్వారా రూ.130 ఆదాయం లభించింది.

ఓబీసీకి పూర్వ వైభవం తీసుకువద్దాం : ఈడీ



హైదరాబాద్ : 'ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్'కు (ఓబీసీ) పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు గాను సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని ఆ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలకృష్ణ ఆల్లే ఎస్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన హైదరాబాద్, విజయ వాడకు చెందిన సర్కిల్ ఉద్యోగ సభ్యులతో టౌన్‌హాల్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన రెండు నగరాల్లోని బ్యాంకు ప్రగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ సర్కిల్ హెడ్ అరుణ్ కుమార్ అగర్వాల్ స్వాగతోపన్యాసంతో ప్రారంభమైంది. అనతరం ఈడీ మాట్లాడుతూ సిబ్బంది ఒక జట్టుగా రాణించి వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడం ద్వారా ఓబీసీని వీలైనంత త్వరగా పీసీఏ నిబంధనల నుంచి బయటపడేసేలా కృషి చేయాలని కోరారు. దృఢ సంకల్పంతో జట్టుగా రాణిస్తే సాధించలేనిదంటూ ఏదీ ఉండదని ఆయన అన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి ఉద్యోగులు కృషి చేయాలని బాలక్రిష్ణ సూచించారు. ఈ సందర్భంగా మెరుగ్గా రాణించిన శాఖల మేనేజర్లను ఈడీ సత్కరించారు. మేటి పనితీరుతో రాణించిన వారికి ప్రశంసా పత్రాలను అందించి సన్మానించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్, విజయవాడకు సర్కిల్ కార్యాలయానికి చెందిన అధికారులు ఉద్యోగులతో పాటు జంటనగరాలలోని ఓబీసి బ్యాంక్‌నకు చెందిన శాఖత ఉద్యోగులు, శాఖల సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణలో మరో రెండు చేనేత శిక్షణ కేంద్రాలు



వరంగల్, సిద్దిపేటలో ఏర్పాటు చేయనున్న మైక్రోసాఫ్ట్

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులకు టెక్నాలజీ పరంగా శిక్షణ ఇవ్వడానికి మరో రెండు సెంటర్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్. ఇప్పటికే పోచంపల్లి, నారాయణపేట్, రాజోల్, చౌటుప్పల్ వద్ద శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయగా, త్వరలో వరంగల్, సిద్దిపేటలలో కూడా అలాంటివే ఏర్పాటు చేయనున్నట్లు మైక్రోసాఫ్ట్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ చిత్రా సూద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, మైక్రోసాఫ్ట్, నెఫ్ట్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కేంద్రాల ద్వారా మూడు నెలలపాటు 1,500 మందికిపైగానే శిక్షణ పొందారని, వీరిలో 140 మందికి సర్టిఫికేట్‌ను అందచేయడం జరిగిందన్నారు. ప్రధానంగా ఈ శిక్షణ కార్యక్రమం.. టెక్నాలజీ రంగం ద్వారా చేనేత కార్మికులను చైతన్య పరుచడంతోపాటు డిజైనింగ్‌లో మెలకువల్ని, వినియోగదారులతో నేరుగా అనుసంధానం కావడానికి దోహదం చేస్తున్నది. ఈ చేనేత సాధి కారత సెంటర్ల ద్వారా శిక్షణ పొందిన వారి ఆదాయం సగటున 20-25 శాతం వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా వీరికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

ప్రత్యేక ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్

చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను నేరుగా విక్రయించేందుకుగాను మైక్రోసాఫ్ట్ ఇండియా నూతన ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేసింది. దాతృత్వ కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన రీవేవ్ వెబ్‌సైట్‌ను రాష్ట్ర ఐటీ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ శనివారం ప్రారంభించారు. చేనేత కళాకారులకు అండగా ఉండేందుకు ఏర్పాటు చేసిన ఈ పోర్టల్.. తాము నేసిన బట్టలను నేరుగా వినియోగదారుడికి విక్రయించేందుకు నేతన్నలకు సహాయపడనున్నది.

ప్రధానంగా ఈ వెబ్‌సైట్‌లో సంప్రదాయ డిజైన్ బట్టలు లభించనున్నాయి. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ.. నేత కార్మికులకు అందిస్తున్న శిక్షణ ద్వారా భవిష్యత్తులో కొత్త డిజైన్లు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన నేతన్న లను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుం టున్నదని, ఇప్పటికే పలు రాయితీలు, వడ్డీలేని రుణాలు అందిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచే శారు. ప్రస్తుతం రాష్ట్రంలో 43 లక్షల మంది నేత కార్మికులు ఉన్నారన్నారు.

బ్యాంకింగ్‌లో పారదర్శకత పెరగాలి..

- మరిన్ని విధానపరమైన చర్యలపై దృష్టి సారించాల్సి ఉంది
- ప్రభుత్వం, బీబీబీతో కలిసి పని చేస్తున్నాం
- బ్రెగ్జిట్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం
- ఆర్థిక స్థిరత్వమే ధ్యేయంగా మా అడుగులు
- ఆర్బీఐ కొత్త గవర్నర్ శక్తికాంత దాస్



గాంధీనగర్: దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేలా కార్పొరేట్ గవర్నెన్స్‌ను మరింతగా పటిష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వైబ్రెంట్ గుజరాత్ అంతర్జాతీయ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఆర్బీఐ గవర్నర్‌గిరి చేపట్టిన తరువాత ఆయన మొదటి అంతర్జాతీయ సదస్సులో ప్రసంగిస్తూ దేశీయ బ్యాంకింగ్‌లో పారదర్శకత, జవాబుదారీ తనం పెంచే విషయమై విధానపరమైన చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించాల్సి అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పెరుగుతోన్న భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం, సంక్లిష్టత ఈ అవసరాన్ని మరింతగా ఎత్తిచూపుతోందని ఆయన అన్నారు. ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తో పాటు వివిధ బ్యాంకుల్లో వెలుగుచూసిన మోసాలను ఆయన పరోక్షంగా ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. బ్యాంకుల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచేందుకు గాను ప్రభుత్వం, బ్యాంక్స్ బోర్డు బ్యూరో (బీబీబీ), ఆర్బీఐలు కలిసి పని చేస్తున్నాయని శక్తికాంత్ తెలిపారు. పనితీరు మూల్యాంకణ లక్ష్యంతో విధివిధానాలను రూపొందించే దిశగా తాము కలిసి పని చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఈ విధివిధానాలు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కార్పొరేట్ పాలనకు కొత్త రూపాన్ని నిర్వచించేలా వాటి రూపకల్పన జరుగుతోందని ఆయన అన్నారు. దీని వల్ల బ్యాంకుల్లో పారదర్శకత, జవాబుదారీ తనం పెరుగ గలదని ఆయన వివరించారు. దాస్ కంటే ముందు ఆర్బీఐ గవర్నర్‌గా పని చేసిన ఉర్జిత్ పటేల్ పలు ప్రయివేటు బ్యాంకుల పట్ల కఠినంగా వ్యవహరించి వాటి యాజమాన్యంలో మార్పులు వచ్చేలా పలు కీలక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఆ పదవిలోకి వచ్చిన శక్తికాంత బ్యాంకులపై ఎలాంటి తీరును ప్రదర్శిస్తారోనన్న ఆలోచనల మధ్య దాస్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

సూక్ష్మ గణాంకాలకే ప్రథమ ప్రాధాన్యత..

దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరుకు అద్దంలా నిలిచే సూక్ష్మగణాంకాల్లో మెరుగైన వృద్ధిని సాధించేందుకే తాము ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వనున్నట్టుగా ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత తెలిపారు. దీనికి తోడు అంతార్జతీయంగా నెలకొన్న తీవ్ర అనిశ్చిత వాతావరణం నెలకొన్న నేపథ్యంలో దేశంలో ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకురావడంపై కూడా ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు దాస్ వివరించారు. బ్రెగ్జిట్ విషయమై ఇటీవలి కాలంలో జరుగుతున్న పరిణామాలను గురించి శక్తికాంత్ మాట్లాడుతూ అంతర్జాతీయ పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలిస్తోందని అన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో భారత్‌కు ఎదుర య్యే సవాళ్లు, అందుబాటులోకి వచ్చే కొత్త అవకాశాలను క్షుణ్ణంగా బేరీజు వేసుకొని ఆర్బీఐ ఒక విధానపనరమై స్పందనను వెలువరిస్తుందని ఆయన అన్నారు. ఇటీవలి బ్రెగ్జిట్ పరిణామాల నేపథ్యంలో భారత కంపెనీలు, విధానకర్తలు తమ వ్యూహాలను తిరిగి రూపొందించుకొని తగిన విధంగా ప్రతిస్పందించాల్సి ఉంటుందని అన్నారు.

కేంద్ర ఉద్యోగాల్లో భర్తీ నిల్

- బీజేపీ హయాంలో నిలిచిన సర్కారు నౌకరీ
- లక్ష్యాన్ని మించి నియామకాలు జరిపినట్టు గణాంకాలు
- ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్లు అంటున్న మోడీ
- ఇది ఎన్నికల ఎత్తుగడే : రాజకీయ పరిశీలకులు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీయే లేనప్పుడు ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్ కల్పించి లాభమేంటన్న ప్రశ్న తలెత్తుతోంది. కొత్తగా ఉద్యోగాలు భర్తీ చేయటం అటుంచితే, పదవీ విరమణ ద్వారా ఏర్పడిన ఖాళీల్నే కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయలేకపోయింది. తద్వారా తగ్గిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగల సంఖ్య 75,231. 2018-19 బడ్జెట్ గణాంకాల్లో ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే పొందుపర్చింది. ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యపై కేంద్రం గణాంకాలతో గారడీ చేసింది. 2015లో 1.9లక్షలు, 2016లో 2.4లక్షలు, 2017లో 3లక్షల ఉద్యోగులు పెరిగినట్టు చూపింది. కాంట్రాక్ట్ పద్ధతిలో జరిపిన డ్రైవర్, పూన్ నియామకాల్ని లెక్కించి గణాంకాల్ని పెంచి చూపింది. నిజానికి ఈ నాలుగున్నరేండ్లలో లక్ష్యానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరగలేదు. రిటైర్ అవ్వటం ద్వారా ప్రతీ ఏటా ఏర్పడిన

ఖాళీల్ని కేంద్రం భర్తీ చేయటం లేదని తెలుస్తోంది. ఈనేపథ్యంలో ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టాన్ని తీసుకొచ్చి ప్రయోజనమేంటన్న ప్రశ్నను రాజకీయ, ఆర్థిక రంగ విశ్లేషకులు లేవనెత్తుతున్నారు.

తగ్గారా? పెరిగారా?

2018-19 బడ్జెట్, కేంద్ర ప్రభుత్వ సిబ్బంది వివరాల్ని విడుదల చేశారు. మొత్తం 55 కేంద్ర ప్రభుత్వ శాఖల్లో (రక్షణ శాఖ తప్ప..), రైల్వే శాఖతో కలుపుకొని...ప్రస్తుతం ఉన్న సిబ్బంది 32.52 లక్షలు. 2014, మార్చి 1న ఉన్న సిబ్బంది 33.3 లక్షలు. ప్యూన్, డ్రైవర్ ఉద్యోగాల్ని కాంట్రాక్ట్ విధానంలో కేంద్రం నియామకాలు జరిపింది. ఇవి మినహా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఆఫీసర్ స్థాయి ఉద్యోగాలేవీ భర్తీ చేయలేదు. ఇక రైల్వే శాఖ సంగతి చెప్పక్కర్లేదు. సరైన సంఖ్యలో సిబ్బంది లేక రైల్వే శాఖ పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతోంది. 2016లో 13.31 లక్షల మంది రైల్వేలో పనిచేయగా, 2017లో సిబ్బంది సంఖ్య 13.08లక్షలకు తగ్గిపోయింది. 23వేల ఉద్యోగాల్లో కోత పెట్టారు. ఖాళీ అయిన ఉద్యోగాల్ని భర్తీ చేయటంపై, సిబ్బందిని పెంచటంపై మోడీ సర్కార్ ఎన్నడూ కూడా ఆసక్తి చూపలేదు.

పెరిగిన పోలీస్ ఫోర్స్

సెంట్రల్ పారామిలటరీ విభాగంలో సిబ్బంది నియామకాల్ని జరిపారు. సిబ్బంది సంఖ్య 10.24లక్షల నుంచి 11.25లక్షలకు పెరిగింది. అంటే సుమారుగా లక్షమంది సిబ్బందిని పెంచారు. పన్నులు వసూలు చేసే శాఖల్లో, నిఘా, విదేశాంగ శాఖల్లో సిబ్బంది సంఖ్య పెరిగింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ జరుపుతామన్నట్టుగా ప్రతీ ఏటా 'స్టేటస్ రిపోర్ట్'లో మోడీ సర్కార్ అంకెల గారడీ చేసిందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకే ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్ల అంశాన్ని మోడీ? సర్కార్ తెరపైకి తెచ్చిందని విశ్లేషిస్తున్నారు

అమెజాన్ గ్రేట్ ఇండియన్ సేల్ షురూ..!

ముంబై : ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ వెబ్‌సైట్‌లో గ్రేట్ ఇండియన్ సేల్ షురూ అయింది. ఇందులో స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, హెడ్‌ఫోన్స్, టీవీలు, స్పీకర్లపై ఆకట్టుకునే ఆఫర్లు, రాయితీలను అందిస్తున్నారు. సేల్‌లో భాగంగా ఐఫోన్ N 64జీబీ రూ.74,999 ధరకే లభిస్తున్నది. అలాగే హువావే పీ20 ప్రొ రూ.59,999 ధరకు, శాంసంగ్ గెలాక్సీ ఎస్9 ప్లస్ రూ.52,990కు, ఎస్9 64 జీబీ రూ.48,990కి, నోట్ 8 రూ.39,990కి, ఒప్పో ఆర్17 రూ.31,990 ధరకు, హానర్ ప్లే 4జీబీ, 64 జీబీ రూ.13,999కు, హువావే నోవా 3ఐ రూ.16,990కి, వివో వి9 ప్రొ - రూ.15,990కి, రియల్ మి యు1 4జీబీ రూ.13,499 ధరకు, హువావే పి20 లైట్ రూ.12,999 ధరకు, హానర్ 8సి రూ.10,999కి, రియల్ మి యు1 3జీబీ రూ.10,999కి లభిస్తున్నాయి. అలాగే శాంసంగ్ గేర్ ఎస్3 ఫ్రాంటియర్ రూ.17,990 ధరకు, కిండిల్ పేపర్‌వైట్ రూ.10,499 ధరకు, ఎకో ప్లస్ (సెకండ్ జెన్) రూ.11,999 ధరకు, అమెజాన్ ఎకో రూ.7,999కు, ఎకో డాట్ (థర్డ్ జెన్) రూ.2,999 ధరకు, ఫైర్ టీవీ స్టిక్ రూ.2,999 ధరకు లభిస్తున్నాయి.

అమెజాన్ గ్రేట్ ఇండియన్ సేల్‌లో 2టీబీ హార్డ్ డిస్క్‌లు రూ.4699 ప్రారంభ ధరకు లభిస్తుండగా, 32 ఇంచుల టీవీలు, స్మార్ట్ టీవీలు, లార్జ్ స్క్రీన్ టీవీలు, ప్రీమియం ఓలెడ్, క్యూలెడ్ టీవీలపై 50 శాతం వరకు డిస్కౌంట్‌ను అందిస్తున్నారు. ల్యాప్‌టాప్‌లపై రూ.40వేల వరకు, కెమెరాలు, యాక్ససరీలు, హెడ్‌ఫోన్స్‌పై 60 శాతం వరకు, స్పీకర్లపై 50 శాతం వరకు, గేమింగ్ కన్సోల్స్, యాక్ససరీలపై 40 శాతం వరకు రాయితీలను ఇస్తున్నారు. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ కార్డులతో ప్రొడక్ట్స్‌ను కొనుగోలు చేస్తే 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ ఇస్తారు. ఈ నెల 23వ తేదీ వరకు ఈ సేల్ కొనసాగనుంది

జాగ్రత్తలతో తలనొప్పి దూరం

మనలో చాలా మంది తలనొప్పితో ఇబ్బంది పడుతుంటారు. ఏదో ఒక కారణం వల్ల తలనొప్పికి గురవుతూనే ఉంటాం. తలనొప్పి వస్తే ఏం చెయ్యాలో అర్థంకాక సతమతం అవుతుంటాం. దీంతో అది మరింత ఎక్కువవుతుంది. కొందరు తలనొప్పిని వచ్చినప్పుడల్లా ట్యాబ్లెట్స్ వేసుకుంటారు. అది కూడా మంచిదికాదు. కొన్ని రకాల చిట్కాలు పాటించి తలనొప్పిని ఈజీగా తగ్గించుకోవొచ్చు.

నిమ్మరసం

- గోరు వెచ్చని నీళ్లలో నిమ్మరసం కలుపుకోండి. దాన్ని కొద్దికొద్దిగా తాగుతూ ఉండండి. క్రమంగా మీ తలనొప్పి తగ్గిపోతుంది.

యూకలిప్టస్ ఆయిల్

- యూకలిప్టస్ ఆయిల్‌తో నుదుటిపై, తలపై మసాజ్ చేయించుకోండి. వెంటనే తలనొప్పి తగ్గిపోతుంది.

పాలు

- ఆవు పాలను కాసేపు వేడి చేయండి. తర్వాత వాటిని తాగండి. దీని వల్ల కూడా తలనొప్పి ఈజీగా తగ్గిపోతుంది.

గంధపు చెక్క

- గంధపు చెక్క ద్వారా కూడా తలనొప్పిని ఈజీగా తగ్గించుకోవొచ్చు. గంధాన్ని కాస్త పేస్ట్ మాదిరిగా చేసుకోండి. దాన్ని నుదుటిపై రాసుకుని కాసేపు విశ్రాంతి తీసుకోండి. అంతే తలనొప్పి మాయం అవుతుంది.

కొబ్బరి నూనె

- తలనొప్పి బాగా ఎక్కువగా ఉంటే కొద్దిసేపు కొబ్బరి నూనెతో తలపై, నుదుటిపై మసాజ్ చేసుకోండి. దీని వల్ల కూడా ఈజీగా తలనొప్పి తగ్గిపోతుంది. వెల్లుల్లిని మెత్తగా చేసి అలాగే వెల్లుల్లి వల్ల కూడా తలనొప్పిగా ఈజీగా తగ్గించుకోవొచ్చు. వెల్లుల్లిని మెత్తగా చేసి దాని రసాన్ని తయారుచేసుకోండి. వెల్లుల్లి రసాన్ని కాస్త తాగితే చాలు.. తలనొప్పి తేలిగ్గా తగ్గిపోతుంది.

కాళ్లను వేడి నీళ్లలో

- కాళ్లను వేడి నీళ్లలో ఉంచుకోవడం వల్ల కూడా



తలనొప్పిని తగ్గించుకోవొచ్చు. కాళ్లను కిందకు విడుస్తూ మంచంపై కూర్చోండి. మీకాళ్లను వేడి నీళ్లు ఉండే పాత్రలో ఉంచుకోండి. అలా కొద్ది సేపు పెట్టుకున్న తర్వాత పడుకోండి. నిద్రలోనే మీ తలనొప్పి మాయం అయిపోతుంది.

ఆపిల్ ద్వారా

- ఆపిల్ ద్వారా కూడా మీ తలనొప్పి తగ్గిపోతుంది. ఆపిల్‌కు కాస్త ఉప్పు రాసుకుని తినండి. ఒక పది నిమిషాల తర్వాత వేడి పాలు తాగండి. దీంతో తల నొప్పి పోతుంది. ఇలా కొన్ని రోజుల పాటు చేస్తే చాలు.

ఆలివ్ ఆయిల్

- ఆలివ్ ఆయిల్ ద్వారా కూడా తలనొప్పి తగ్గిపోతుంది. ఆలివ్ ఆయిల్‌ను వేడి చేసి దాంతో తలకు మసాజ్ చేసుకోండి. తేలిగ్గా తలనొప్పి తగ్గిపోతుంది.

గ్రీన్ టీ

- గ్రీన్ టీ ద్వారా కూడా తలనొప్పిని తగ్గించుకోవొచ్చు. గ్రీన్ టీలో కాస్త తేనె కలుపుకోండి. అలాగే దాల్చిన చెక్కను కూడా వేసుకోండి. దాన్ని తాగి కాసేపు రెస్ట్ తీసుకుంటే చాలు తలనొప్పి తగ్గిపోతుంది.

బ్రౌన్ పేపర్

- అలాగే ఒక బ్రౌన్ పేపర్‌ను తీసుకుని దాన్ని వైట్ వెనిగర్‌లో కాసేపు ఉంచాలి. తర్వాత దాన్ని మీ నుదుటిపై కొద్దిసేపు పెట్టుకోండి. కొద్దిసేపట్లోనే మీ తలనొప్పి పోతుంది.



యోగాతో నడుం నొప్పి నుంచి ఉపశమనం

మన చుట్టూ ఉన్న వారిలో కనీసం సగం మందికి నడుం నొప్పి సమస్య ఉండే ఉంటుంది. అటు ఇటూ కదల్లేనంత తీవ్రస్థాయిలో కొందరిని బాధిస్తూంటే.. మిగిలిన వారిలో నొప్పి తక్కువగా ఉండవచ్చు. అయితే వీరందరూ పెయిన్ కిల్లర్లను వాడటం కంటే యోగాను నమ్ముకోవడం మేలని అంటున్నారు యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ మెడికల్ శాస్త్రవేత్తలు. యోగాతోపాటు కాగ్నెటివ్ బిహేవియరల్ థెరపీలను వాడటం వల్ల నొప్పిని గుర్తించే పరిస్థితి రాదని వీరు అంటున్నారు.

కొంతమంది స్వచ్ఛంద కార్యకర్తలను రెండు గుంపులుగా విడగొట్టి తాము ప్రయోగాలు నిర్వహించామని.. రోజూ రెండు గంటలపాటు మైండ్‌ఫుల్‌నెస్ బేస్డ్ స్ట్రెస్ రిడక్షన్ (ఎంబిఎస్ఆర్) అనే పద్ధతిలో భాగంగా యోగా ప్రాక్టీస్, కాగ్నెటివ్ బిహేవియరల్ థెరపీ (సీబీటీ) చేపట్టామని... 26 వారాల తరువాత రెండు వర్గాల్లోని 60 శాతం మంది తమ నడుం నొప్పి చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గినట్లు చెప్పారని శాస్త్రవేత్తలు తెలిపారు. 1979లో యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ఎంబిఎస్ఆర్ పద్ధతిని ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 ఆసుపత్రుల్లో ఉపయోగిస్తున్నారని, ఆన్‌లైన్ ద్వారా కూడా ఈ పద్ధతి అందుబాటులో ఉందని ఈ ప్రయోగాల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఒకరు తెలిపారు.

కుంగుబాటుతో స్ట్రోక్ ముప్పు



కుంగుబాటుకు గురైన వారిలో హృదయ స్పందనలు అస్తవ్యస్తంగా తయారై స్ట్రోక్, అకాల మరణానికి దారి తీసే ముప్పు అధికమని తాజా అధ్యయనం హెచ్చరించింది. కుంగుబాటును నివారించే మాత్రలతో ఈ రిస్క్‌కు సంబంధం లేదని స్పష్టం చేసింది. కుంగుబాటును నివారించే మందులు వాడే ముందు వీరి అకాల మరణం ముప్పు ఏడు రెట్లు ఉండగా, చికిత్స తీసుకున్న నెలలోనే ముప్పు మూడు రెట్లకు తగ్గిందని అధ్యయనంలో వెల్లడైంది.

డెన్మార్క్‌కు చెందిన అర్హస్ యూనివర్సిటీ పరిశోధకులు 2000 నుంచి 2013 వరకూ కుంగుబాటు మందులు తీసుకుంటున్న 7.8 లక్షల మందిని పరీక్షించిన అనంతరం ఈ వివరాలు వెల్లడించింది. మనసుకు, గుండెకు మధ్య ఉన్న సంబంధం ఈ అధ్యయనంలో ప్రస్ఫుటంగా స్పష్టమైందని పరిశోధకులు పేర్కొన్నారు. కుంగుబాటుకు లోనైన వ్యక్తులు అస్తవ్యస్త హార్ట్‌బీట్‌తో పాటు గుండెకొట్టుకునే వేగం అసాధారణంగా పెరిగే సమస్యను ఎదుర్కొంటారని, మందులతో దాన్ని నియంత్రించవచ్చని అధ్యయనం వెల్లడించింది. మానసిక సమస్యలు గుండెపై ప్రభావం చూపవచ్చనేందుకు తమ అధ్యయనంలో ఆధారాలు లభించాయని పరిశోధకులు పేర్కొన్నారు.

ప్రయాణంలో వాంతులు రాకుండా పాటించాల్సిన చిట్కాలు

కొందరికి ప్రయాణాలంటే చాలా ఇష్టం ఉంటుంది. కానీ ప్రయాణించాలంటే చాలా భయం వేస్తూ ఉంటుంది. వాహనాల్లో ప్రయాణిస్తే కొందరికి వాంతులు అవుతుంటాయి. దీంతో ఎక్కడికి వెళ్లకుండా ఉంటారు. కొన్ని రకాల చిట్కాలు పాటిస్తే తేలిగ్గా ఈ సమస్య నుంచి బయటపడొచ్చు.

పుదీనా



పుదీనాకు వాంతులను ఆపే గుణం ఉంటుంది. ప్రయాణంలో మీతో పాటు పుదీనా ఆకులను ఉంచుకోండి. వాటిని నములుతూ ఉండండి. అలాగే పుదీనా టీ తాగండి. ఇలా చేస్తే దాదాపు కడుపులో వికారం కంట్రోల్ అవుతుంది.

అల్లం రసం



మీరు ప్రయాణం చేసే ముందు కాస్త అల్లం రసం తాగండి. అలాగే మధ్యమధ్యలో అల్లం టీ కూడా తాగుతూ ఉండండి. దాని వల్ల మీకు వాంతులు రాకుండా ఉంటాయి.

నిమ్మ

ఒక నిమ్మకాయను తీసుకోండి. దాన్ని తొక్క తీసి బ్యాగులో పెట్టుకోండి. ప్రయాణం ప్రారంభమైన వెంటనే దాన్ని రసం



పీల్చుతూ ఉండండి. కొద్దికొద్దిగా నిమ్మరసాన్ని టేస్ట్ చేస్తూ ఉంటే కడుపులో వికారం అనేది ఉండదు. వాంతులు రావు. ఇది చాలా మందికి వర్కవుట్ అవుతుంది.

కిటికీల్లోంచి చూడకండి

కొందరికి కిటికీల్లోంచి బయటకు చూస్తూ ఆ వేగానికి కళ్లు తిరిగినట్లు అవుతుంది. దాంతో వాంతులు వస్తాయి. అందువల్ల బయటకు చూడకుండా కూర్చోండి. ఇలా చేస్తే కొద్ది వరకు కడుపులో వికారాన్ని తగ్గించుకోవొచ్చు.

ఎక్కువగా తినొద్దు

ప్రయాణం చేయాలనుకున్నప్పుడు ఎక్కువగా తినడం కూడా మంచిది కాదు. అలా చేస్తే వాంటింగ్స్ వచ్చే అవకాశం ఉంది. అందువల్ల మితంగా తినండి. దగ్గర ప్రాంతాలకు ప్రయాణం చేసేటప్పుడు ఈ చిట్కాను పాటించండి.

ఆ నాలుగు డ్రైఫ్రూట్స్

మధుమేహులకూ మంచివే

ఆహారం విషయంలో మధుమేహ వ్యాధి గ్రస్తులకు చాలా ఇబ్బందులు ఉన్నాయి. ఏం తింటే చక్కెర శాతం పెరుగుతుందో స్పష్టంగా తెలియకపోవడం వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు వీరు. మిగిలిన వాటి మాటెలా ఉన్నా.. నాలుగు రకాల డ్రైఫ్రూట్స్ మాత్రం చాలా నెమ్మదిగా చక్కెరలను శరీరంలోకి విడుదల చేస్తాయని తేల్చారు కెనెడాలోని మైకేల్స్ హాస్పిటల్ శాస్త్రవేత్తలు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే.. గోధుమ బ్రెడ్ కంటే.. ఖర్జూరాలు, ఆప్రికాట్స్, ఎండు ద్రాక్ష, సుల్తానాస్‌లు చాలా నెమ్మదిగా చక్కెరలను విడుదల చేస్తాయి కాబట్టి.. మధుమేహులు వీటిని ఎలాంటి సంశయం





లేకుండా తినవచ్చు.

తియ్యటి పండ్లను తీసుకునే విషయంలోనూ మధుమేహులు చాలా సందిగ్ధంలో ఉంటారని.. కాకపోతే పండ్ల ద్వారా అందే చక్కెరలు దుష్ప్రభావం చూపవని... వీటి గ్లైసిమిక్ ఇండెక్స్ చాలా తక్కువని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త జాన్ సైవిన్‌పైపర్ అంటున్నారు. ఆహార పదార్థాల తయారీలో తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ ఉన్న డ్రైఫ్రూట్స్‌ను వాడేందుకు తమ పరిశోధన ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. మరింత విస్తృత స్థాయిలో పరిశోధనలు చేసి ఈ ఫలితాలను నిర్ధారించుకోవాలని సూచించారు.

పదేళ్ళ తర్వాత హైదరాబాద్‌లో

కాన్సర్ట్ చేయడం ఆనందంగా ఉంది

లెజండరీ సింగర్ కె.జె.ఏసుదాస్ చాలా కాలం తర్వాత హైదరాబాద్‌లో లైవ్ కాన్సర్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. జనవరి 20న హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఈ కాన్సర్ట్ జరిగింది. ఈ సంగీత విభావరిలో ఏసుదాస్‌తోపాటు విజయ్ ఏసుదాస్, కల్పన కూడా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో జనవరి 19న కె.జె.ఏసుదాస్, ఆయన తనయుడు విజయ్ ఏసుదాస్ విలేకరుల సమా వేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కె.జె. ఏసుదాస్ మాట్లాడుతూ "నేను అక్షరాల విషయంలో చాలా పర్‌ఫెక్ట్‌గా ఉండాలనుకుంటాను. ఇది నా తల్లి నుంచి నేర్చుకున్నాను. నేను క్రిష్టియన్ ఫ్యామిలీలో పుట్టినప్పటికీ సంస్కృతంలోని అక్షరాలను నేర్చుకో మని ఆమె చెప్పారు. అది ఆమె నాకు అందించిన ఆశీర్వాదం. మరో ఆశీర్వాదం ఏమిటంటే.. నేను ఐదేళ్ళ వయసులో ఉన్నప్పుడు చదువు గురించి ఎలాంటి బెంగా పెట్టుకోవద్దు. నార్మల్‌గా చదువు కుంటే చాలు. కానీ, కర్నాటిక్ క్లాసికల్ మ్యూజిక్‌ని ప్రాపర్‌గా నేర్చుకోమని చెప్పారు. మ్యూజిక్, ఆర్ట్స్ లాంటివి ఏమీ వద్దు.. స్కూల్‌కి వెళ్ళి చదువుకోమని చెప్పే ఆరోజుల్లో నన్ను సంగీతం నేర్చుకోమని ప్రోత్సహించారు. నాకు బ్రదర్స్, సిస్టర్ ఉన్నారు. వాళ్ళు కూడా బాగా పాడేవారు. కానీ, వాళ్ళను మా నాన్నగారు ఎంకరేజ్ చెయ్యలేదు. నన్ను మాత్రమే ఈ విషయంలో ప్రోత్సహించారు. ఈ సందర్భంగా నా తల్లిదండ్రుల్ని, నా మాస్టర్‌ని గుర్తు చేసుకుంటున్నాను. గురువు లేకుండా ఎవరూ గొప్పవారు కాలేరు. మనల్ని తీర్చిదిద్దిన గురువులు అంతా దేవుళ్ళతో సమానం. అది నా నమ్మకం. నేను ఇప్పటివరకు ఏం సాధించినా అదంతా నా తల్లిదండ్రులు, గురువుల వల్లే సాధ్యమైంది. అలాగే



నా పాటలు వినేవారు, సంగీత ప్రియుల ప్రార్థనల వల్లే నేను ఈ స్థాయికి వచ్చాను. అంతకుమించి మరేం లేదు. నేను దాదాపు 10 సంవత్సరాల తర్వాత హైదరాబాద్‌లో లైవ్ మ్యూజిక్ చేస్తున్నాను. మధ్యలో కొన్ని క్లాసికల్ కాన్సర్ట్స్ చేసినప్పటికీ లైవ్ మ్యూజిక్ మాత్రం చాలా కాలం తర్వాత చేస్తున్నాను. నా బ్రదర్ అలేఖ్య హోమ్స్ శ్రీనాథ్ నన్ను లైవ్ మ్యూజిక్ చెయ్యమని చెప్పారు. హైదరాబాద్‌లో మళ్లీ ఈ కాన్సర్ట్ చెయ్యడం చాలా ఆనందంగా ఉంది. ఈ కాన్సర్ట్‌లో ప్రధానంగా తెలుగు పాటలు పాడతాము. అలాగే కొన్ని తమిళ్, హిందీ, మలయాళం పాటలు ఉంటాయి. నేను త్రివేండ్రంలో విద్వాన్ కోర్సు చేశాను. ఆ సమయంలో నా తండ్రిగారు అస్వస్థతకు లోనుకావడం, ఆర్థికంగా సరైన స్థితిలో లేకపోవడం వల్ల ఆ కోర్సు పూర్తి చేయకుండానే వచ్చేయడం జరిగింది. అందుకే నేను సంగీతంలో విద్వాన్‌ని కాదు, విద్యార్థిని మాత్రమే. ప్రతి రోజూ కర్నాటిక్ మ్యూజిక్ నేర్చుకుంటూనే ఉంటాను. అంతకు ముందు నేను చేసిన పొరపాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటాను. విద్యార్థులెవరైనా ఇది గుర్తుంచుకోవాలి. ముందు రోజు చేసిన తప్పుల్ని తెలుసుకొని వాటిని సరిదిద్దుకోగలిగితే ముందు ముందు ఎంతో సాధించవచ్చు. ఇది సంగీతానికి మాత్రమే కాదు, ఏ రంగానికైనా వర్తిస్తుంది. మా నాన్నగారు చనిపోయే వరకు కూడా ఒక్కసారి కూడా నేను బాగా పాడుతున్నానని చెప్పలేదు. మన పిల్లల్ని మనమే అప్రిషియేట్ చెయ్యకూడదు. వాళ్ళకు వాళ్ళు ఎదగాలి. మా అబ్బాయి విజయ్ కూడా పాటలు పాడుతున్నాడు. అతని వయసు ఇప్పుడు 40. నా వయసు 79. కానీ, నేను ఇప్పటికీ విద్యార్థిననే చెప్తున్నాను. కానీ, మా అబ్బాయి ఆలోచన వేరుగా ఉండొచ్చు. ఇప్పుడొస్తున్న సింగర్స్ చాలా మంది బాగా పాడుతున్నారు. ఇప్పుడు సౌకర్యాలు బాగా పెరిగాయి. ఆరోజుల్లో నేను, సుశీల డ్యూయట్ పాడితే ఒకే మైక్‌లో ఒకరి తర్వాత ఒకరం పాడే వాళ్లం. కానీ, ఇప్పుడలా కాదు. డిఫరెంట్ ట్రాక్స్ వచ్చేసాయి. నిన్న నేను ఓ మలయాళం పాట పాడాను. నాతో పాట పాడే అమ్మాయిని నేను చూడ లేదు కూడా. నా ట్రాక్ వరకు నేను పాడాను. తర్వాత ఆమె పాడిన ట్రాక్‌ని మిక్స్ చేస్తారు. అయితే ఆరోజుల్లో సింగర్స్ మధ్య సాన్నిహిత్యం ఉండేది" అన్నారు.

విజయ్ ఏసుదాస్ మాట్లాడుతూ "మొదట్లో నేను నాన్నగారి అడుగుజాడల్లోనే వెళ్ళాను. ఆ తర్వాత నేను రియలైజ్ అయ్యాను. ఎందుకంటే అవి ఆయన వేసుకున్న పుట్‌స్టెప్స్. అందుకే నా సొంతదారిలోనే వెళ్ళాలని డిసైడ్ అయ్యాను. అయితే కొన్ని విషయాల్లో ఆయన గైడెన్స్ తీసుకుంటాను. నాన్నగారి టైమ్‌లో ఇళయరాజాగారితో కలిసి చాలా సినిమాలకు పనిచేశారు. ఇద్దరూ ఫ్రెండ్స్‌లా, బ్రదర్స్‌లా ఉండేవారు. అలాగే ఇప్పుడు నేను, యువన్‌శంకర్‌రాజా కలిసి పనిచేస్తున్నాం. నాన్నగారు ఈ వయసులో కూడా ఇంకా నేర్చుకుంటున్నానని చెప్పడం మా జనరేషన్‌కి టెన్షన్ కలిగిస్తుంది. నేను రెండు సినిమాల్లో నటించాను కూడా. అయితే నేను నటుడ్ని కాదు. కెమెరా ముందు ఉండడం, యాక్ట్ చేయడం నేను చాలా ఎంజాయ్ చేశాను. ఇప్పుడు బయోపిక్‌లు చాలా వస్తున్నాయి. అలాగే నాన్నగారి బయోపిక్ చేసే ఆలోచన ఉందా అని అడుగుతున్నారు. అయితే నాకు అలాంటి ప్లాన్స్ ఏమీ లేవు. కానీ, ఎవరైనా చేస్తే నేను ఇన్‌వాల్వ్ అవ్వాలనుకుంటున్నాను" అన్నారు.



'గోల్డెన్ రీల్ అవార్డు'కు నామినేట్ అయిన 2.ఓ



సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన 'రోబో 2.ఓ' బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిపించింది. ఇప్పుడీ చిత్రం మరో అరుదైన ఘనత కూడా సొంతం చేసుకుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చిత్రాల్లో 'బెస్ట్ సౌండ్ ఎడిటింగ్'కి గానూ విదేశీ విభాగంలో 2.ఓ నామినేట్ అయినట్లు ఈ సినిమా సౌండ్ డిజైనర్ రసూల్ ట్విటర్ ద్వారా వెల్లడించారు.

'గోల్డెన్ రీల్ అవార్డుకు 'రోబో 2.0 ఎంపికయిందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. సౌండ్ డిజైనింగ్ విభాగంలో ఈ చిత్రానికి ఈ ఘనత దక్కింది. భారతీయ సినిమా మరింత ముందుకు వెళ్తుందని ఆశిస్తున్నాను. శంకర్, రజినీ, ఏఆర్ రెహమాన్‌లకు ధన్యవాదాలు, అభినందనలు' అని రసూల్ ట్వీట్ చేశారు.

ప్రతి ఏడాది మాదిరిగానే ప్రఖ్యాత మోషన్ పిక్చర్ సౌండ్ ఎడిటర్స్(ఎంపీఎస్ఈ)66వ వార్షిక గోల్డెన్ రీల్ అవార్డులు కార్యక్రమాన్ని నిర్వహించనుంది. లాస్ ఏంజిల్స్ వేదికగా ఫిబ్రవరి 17న ఈ వేడుకలు జరుగుతాయి. 2.ఓ తో పాటు మరెన్నో అంతర్జాతీయ చిత్రాలు ఈ అవార్డులకు ఎంపికయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా సౌండ్ ఎడిటింగ్ విభాగంలో అత్యంత ప్రజాదరణ పొందిన చిత్రాలను ఈ అవార్డులకు ఎంపిక చేస్తారు. రజినీ కాంత్ ప్రధాన పాత్రలో నటించిన 'రోబో 2.ఓ' చిత్రానికి శంకర్ దర్శకత్వం వహించారు. అక్షయ్‌కుమార్ ప్రతినాయక పాత్రలో కనిపించారు. అమీ జాక్సన్ కథానాయిక. ఈచిత్రానికి ఏఆర్ రెహమాన్ బాణీలు అందించారు. నవంబర్ 29న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈచిత్రం రూ.700కోట్లు రాబట్టిందని అంచనా.

ఫుట్ బాల్ కోచ్‌గా విజయ్..!



కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ.. ఇళయ దళపతి విజయ్‌తో ఓ క్రేజీ ప్రాజెక్ట్ తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన తెరి, మెర్సల్ చిత్రాలు మంచి విజయం సాధించాయి. విజయ్ 63వ చిత్రంగా రూపొందనున్న ఈ చిత్రం ఆదివారం పూజా కార్యక్రమాలు జరుపుకున్నట్లు తెలిసింది. సోమవారం నుండి షూటింగ్ ప్రారంభం కానుందని అంటున్నారు. కతిర్, యోగి బాబు, వివేక్ ముఖ్య పాత్రలలో కనిపించనున్న సినిమాలో నయనతార కథానాయికగా నటించనుంది. ఆస్కార్ అవార్డ్ విన్నర్ ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. దీపావళి కానుకగా చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ చిత్రం స్పోర్ట్స్ డ్రామాగా రూపొందనుందని, ఇందులో విజయ్ ఫుట్ బాల్ కోచ్‌గా కనిపించనున్నాడని కోలీవుడ్ టాక్. మరి కోచ్‌గా విజయ్ తన అభిమానులని ఏ రేంజ్‌లో అలరిస్తాడో చూడాలి మరి. విజయ్ నటించిన చివరి చిత్రం సర్కార్ పలు వివాదాల మధ్య విడుదలై మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే.

ఇది నా బలం కాదు..మీ ఆశీర్వాదం



'ఇది నా బలం కాదు.. మీ ఆశీర్వాదం' అని అంటున్నారు స్టైలిష్‌స్టార్ అల్లు అర్జున్. బన్నీ ట్విటర్ ఫాలోవర్ల సంఖ్య మూడు మిలియన్ మార్క్‌కు చేరింది. ఈ సందర్భంగా తనకు మద్దతుగా నిలిచిన అభిమానులకు ట్విటర్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. 'ట్విటర్‌లో మూడు మిలియన్ల ఫాలోవర్లు. మీరు నాపై చూపించిన ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు. ఇది నా బలం కాదు.. మీ ఆశీర్వాదం' అని పేర్కొన్నారు.

ప్రస్తుతం బన్నీ.. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు. బన్నీ 19వ సినిమాగా ఇది రూపుదిద్దుకోబోతోంది. 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి' వంటి హిట్‌ల తర్వాత బన్నీ, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న మూడో చిత్రమిది. దీంతో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయని నిర్మాతలు తెలిపారు. చిత్రానికి సంబంధించిన ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

అమ్మవారి గుడి వద్ద కంగన నృత్య ప్రదర్శన



బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్ హిమాచల్ ప్రదేశ్‌లోని మండిలోగల దేవాలయం వద్ద న ృత్య ప్రదర్శన ఇచ్చారు. ఆమె టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'మణికర్ణిక'. క్రిష్ దర్శకత్వం వహించిన ఈ సినిమా జనవరి 25న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌కు విశేష స్పందన లభించింది. త్వరలో చిత్రం విడుదల నేపథ్యంలో ఈ సినిమా ప్రచార కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయి.

కంగన దీన్నుంచి చిన్న బ్రేక్ తీసుకుని ఇటీవల తన స్వస్థలమైన హిమాచల్ ప్రదేశ్‌కు వెళ్లారు. మండిలోని మహిషాసురమర్దని ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఆలయం వద్ద నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఆమెతోపాటు మరికొంత మంది మహిళలు కూడా నృత్యం చేశారు. దీనికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. కంగన అందులో ఆలయం పరిసరాల్లో భక్తిగీతానికి నృత్యం చేస్తూ కనిపించారు. మండిలో కంగన ఓ ఆలయాన్ని కట్టించనున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. వీర వనిత ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం ఆధారంగా తీసిన చిత్రం 'మణికర్ణిక'. విజయేంద్ర ప్రసాద్ ఈ సినిమాకు కథ అందించారు. ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. చిత్రానికి యు/ఏ సర్టిఫికెట్ లభించినట్లు చిత్ర బృందం పేర్కొంది. సినిమా నిడివి 148 నిమిషాలు (2 గంటల 28 నిమిషాలు) ఉన్నట్లు తెలిపారు.

ఏపీ మహిళా సమాఖ్య
'అనంత' జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఆశాబీ, పద్మావతి



విశాలాంధ్ర - అనంతపురము అర్బన్ : ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలుగా డి.ఆశాబీ, ప్రధాన కార్యదర్శిగా ఎ.పద్మావతి ఎన్నికయ్యారు. ఈనెల 19న స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో జరిగిన మహిళా సమాఖ్య జిల్లా స్థాయి సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా ఆశాబీ, ప్రధాన కార్యదర్శిగా పద్మావతి, గౌరవ అధ్యక్షురాలుగా బి.వరలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా అరుణ, జయలక్ష్మి, పవిత్ర, పార్వతిప్రసాద్, ఖుర్షీదా, ఉపాధ్యక్షులుగా అన్నపూర్ణ, నాగమణి, సరోజ, లక్ష్మీదేవి, కళమ్మ, రామాంజినమ్మ, కోశాధికారిగా ప్రభావతితోపాటు 25 మందిని కార్యవర్గ సభ్యులుగా, 55 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఆశాబీ, పద్మావతి మాట్లాడుతూ జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

హోదాకు కేసీఆర్ మద్దతు : సారథి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీకి ప్రత్యేక హోదాకు టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మద్దతిస్తామన్నారని, ఈ విషయాన్ని పార్లమెంటులో టీఆర్ఎస్ సభ్యులు ప్రస్తావించారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కే.పార్థసారథి అన్నారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. చంద్రబాబు నాలుగున్నరేళ్లపాటు బీజేపీతో కలిసి కాపురం చేశారని, కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి రాష్ట్రానికి హోదాగాని, విభజన హామీలనుగాని సాధించలేదని ఎద్దేవా చేశారు. ఫెడరల్ ఫ్రంట్‌పైనే టీఆర్ఎస్‌తో వైసీపీ చర్చలు కొనసాగుతోందని స్పష్టం చేశారు. దీనిపై టీడీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. రాష్ట్ర ప్రయోజనాల్ని ఎవరు తాకట్టు పెడుతున్నారనేదీ ప్రజలకు తెలుసన్నారు. ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు సొంత జాగీరులాగా కేసీఆర్‌కు మూడు గిఫ్టులు ఇస్తానని అంటున్నారని, నాలుగున్నరేళ్లుగా రాష్ట్ర ప్రజలకు ఇవ్వాల్సిన గిఫ్టులు చాలా ఉన్నాయని, వాటిపై ఆలోచించాలని సూచించారు. ఎన్నికలు సమీపించడంతో కుర్చీ కోసం చంద్రబాబు హడావుడీ చేస్తున్నారని మండిపడ్డారు.

'అగ్రిగోల్డ్'పై నేడు కేబినెట్‌లో నిర్ణయం

- మరో 20 రోజుల్లో రైతు రుణమాఫీ పూర్తి
- ఏపీ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు



విశాలాంధ్ర బ్యూరో - విజయనగరం : అగ్రిగోల్డ్ బాధితులందరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు అన్నారు. సోమవారం జరిగే కేబినెట్ కీలక సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మాన్సాస్ ట్రస్టు సమావేశానికి కుటుంబరావు ఆదివారం విజయనగరం వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైకోర్టు విభజన కారణంగా కొన్ని ఫైళ్లు రాష్ట్రానికి రావడం ఆలస్యం అయ్యిందని, అందుకే ప్రభుత్వం హైకోర్టులో అఫిడవిట్ వేయలేకపోయిందని చెప్పారు. హైకోర్టులో కేసు విచారణకు వచ్చేలోగానే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంపై ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఉద్దేశపూర్వకంగా బాధితులను తగ్గించామనడం అవాస్తవమన్నారు. రాష్ట్రంలో సుమారు 19 లక్షలకు పైగా ఖాతాలు ఉన్నప్పటికీ, బాధితులు మాత్రం పది లక్షలు మాత్రమే ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో రైతు రుణ మాఫీ ప్రక్రియ మరో 20 రోజుల్లో పూర్తి చేస్తామని కుటుంబరావు అన్నారు. జిల్లాలో మాన్సాస్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని భావించిన వైద్య కళాశాలపై ఆచితూచి అడుగులు వేస్తున్నామన్నారు. ఏ ట్రస్టు కూడా అప్పులు చేసి, విద్యాసంస్థలను నడపలేరన్న విషయాన్ని గమనించాలని కుటుంబరావు అన్నారు.

అసమానతలకు ప్రభుత్వాలే కారణం



- కార్పొరేట్‌లకే మరిన్ని ప్రోత్సాహకాలు
- సంక్షోభంలో గ్రామీణ రైతాంగం
- 80 శాతం ధనికులే పాలకులా..?
- రైతులు, శ్రామికుల సమస్యలపై మీడియా చిన్నచూపు
- విద్యారంగంలోనూ అణచివేత చర్యలు
- మెగసెసే అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్
- 'సామాజిక అసమానతలు-మీడియా పాత్ర' సదస్సులో ఉపన్యాసం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : దేశంలో మెజార్టీ ప్రజల ప్రయోజనాలను ప్రభుత్వాలు విస్మరించి, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ సాంఘిక, ఆర్థిక అసమానతలకు పాల్పడుతున్నాయని రామన్ మెగసెసె అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ విమర్శించారు. విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం కంఠంనేని రవీంద్రరావు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన 'సామాజిక అసమానతలు-మీడియా పాత్ర' అంశంపై స్మారకోపన్యాసం నిర్వహించారు. కంఠంనేని రవీంద్రరావు మెమోరియల్ నాల్గవ స్మారకోపన్యాసానికి ప్రముఖ న్యాయవాది బండ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సాయినాథ్ ప్రసంగిస్తూ, 1990 నుంచి పాలకుల విధానాలతో ఆర్థిక అసమానతలు మరింత జటిలమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాంఘిక, ఆర్థిక అసమానతలు పెంచేందుకు బీజేపీ, ఆరెస్సెస్ శక్తులు కుటిల యత్నాలు చేస్తున్నాయని, ఇది డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. కార్పొరేట్ రంగాలకు పెద్ద ఎత్తున కల్పిస్తున్న సదుపాయాలతో గ్రామీణ ప్రాంత రైతాంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోయిందని విశ్లేషించారు. ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలతో కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయని ధ్వజమెత్తారు. గ్రామీణ రైతులు, వ్యవసాయరంగానికి రుణాలివ్వకుండా, బడా పెట్టుబడి దారులకే ప్రోత్సాహకాలు కల్పిస్తున్నాయని ఎద్దేవా చేశారు. దేశవ్యాప్తంగా 90 శాతంగా ఉన్న పేద వర్గాలకుగాను లోక్‌సభలో 80 శాతం మంది ధనికులే పాలకులుగా ఉన్నారని తెలిపారు. ప్రజాస్వామ్య దేశమంటే ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. కొన్ని ప్రసార మాధ్య మాలు కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతున్నాయని, ప్రాధాన్యత గల అంశాలకు అరకొరగానే సమాచారం ఇవ్వడం దురదృష్టకరమని ఎద్దేవా చేశారు. అనవసర విషయాలకు అవి ప్రాధాన్యత ఇస్తున్నాయని, రైతులు, శ్రామికుల సమస్యలపై ప్రధానంగా దృష్టి పెట్టట్లేదని విమర్శించారు. ప్రభుత్వాలు రాజ్యాంగ పరంగా విద్యారంగంలోనూ అందరికీ సమాన హక్కులను కల్పించకుండా, కులాల వారీగా అసమానతలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. విద్యాహక్కు చట్టం(ఆర్టీఈ) చట్టాన్ని నీరుగారుస్తున్నాయని, పేద, బడుగు వర్గాలకు 25 శాతం ఉచిత విద్యను అందించట్లేదని తెలిపారు. ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో దళితులు, గ్రామీణులు నేటికీ వెనుకబాటుకు గురవ్వడం దురదృష్టకరమని చెప్పారు. దేశంలో 30 ఏళ్ల నుంచి వ్యవసాయ రంగం సంక్షోభంలో కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 90 శాతం మంది గ్రామీణులను ఆదుకోవడంలో పాలకులు విఫలమయ్యారని అన్నారు. పెద్దఎత్తున నీటి వ్యాపారంతో దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి విచ్చలవిడిగా పట్టణ ప్రాంతాలకు నీటి పంపిణీతోనే అక్కడ వ్యాపారం కొనసాగుతోందని వివరించారు. ఆహార పంటలకు సరఫరా చేయాల్సిన నీటిని చెరకు తదితర వాణిజ్య పంటల సాగుకు మళ్లిస్తున్నారని ఎద్దేవా చేశారు. పట్టణాల్లో విలాసవంతమైన అవసరాలకు నీటి వాడకాన్ని ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందన్నారు. నీటి కొరతకు ప్రధాన కారణం వర్షాభావం కాదని, దీనికి ప్రభుత్వ విధానాలేనని ఆయన స్పష్టం చేశారు. ఆరెస్సెస్, బీజేపీలు జాతీయభావన పేరిట మత విద్వేషాలను సృష్టిస్తున్నాయని విమర్శించారు. శబరిమల వివాదం స్త్రీ హక్కులకు చెందిన అంశమని, ఈ సంఘటనలో సుప్రీం కోర్టు తీర్పును గౌరవించకుండా ప్రధాని మోడీ వ్యాఖ్యానించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. దీనిపై బీజేపీ, ఆరెస్సెస్‌లు వివాదం సృష్టిస్తున్నాయని అన్నారు.

విశాఖపట్నం బి.ఆర్.అంబేద్కర్ లా కళాశాల ప్రొఫె సర్ ఎన్.నిర్మల మాట్లాడుతూ కంఠంనేని రవీంద్ర రావు జీవితం నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ మహిళలు కుల, లింగ వివక్షతలకు గురవుతున్నారని పేర్కొన్నారు. డిగ్రీలు చదివిన వారు సైతం షాపింగ్ మాల్స్‌లో అతి తక్కువ వేతనాలకు పని చేస్తున్నారని, వారంతా శ్రమ దోపిడీకి గురవుతు న్నారని తెలిపారు. ఈ సమస్యలపై మీడియా దృష్టిసారిం చాలని సూచించారు. ప్రజాసంఘాల ఉద్యమాలపై మీడియా చిన్నచూపు చూసే విధానాన్ని విడనాడాలని హితవు పలికారు.

బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో ధనిక, పేద తారతమ్యాలు కొనసాగుతున్నాయని, వాటిని అరికట్టేం దుకు సమైక్యంగా కృషి చేయాలని సూచించారు. నేడు న్యాయం అందరికీ అందుబాటులో లేని పరిస్థితులు నెలకొన్నాయన్న అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.మల్లేశ్వరరావు మాట్లాడుతూ కంఠంనేని పేదలకు అందించిన న్యాయపరమైన సేవలు మరువరానివని గుర్తు చేశారు. ఈయన ఒక ప్రజాన్యాయవాది అని కొనియాడారు. కంఠంనేని బాటలోనే తామంతా నడుస్తున్నామని చెప్పారు. సదస్సు ప్రారంభంలో కంఠంనేని జీవిత విశేషాలపై రూపొందించిన కవితను సింగంపల్లి అశోక్‌కుమార్ సదస్సులో చదివి వినిపించారు. ఈ కార్యక్రమానికి న్యాయవాదులు, వివిధ ప్రజాసంఘాలు, సాహిత్య రంగాలకు చెందిన ప్రముఖులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. కంఠంనేని సేవలను స్మరిస్తూ గౌరవ సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఉపాధ్యాయవాణి సంపాదకులుగా శీరంశెట్టి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అధికార మాసపత్రిక ఉపాధ్యాయవాణి పూర్తిస్థాయి సంపాదకుడుగా శీరంశెట్టి శ్రీనివాసరావును నియమించారు. ఈ మేరకు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నియామకం పట్ల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర నేతలు సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పి.సుబ్బరాజు, రాష్ట్ర, జిల్లాల నాయకులు, మండలాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంపాదకులు శీరంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయవాణి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

మా పక్షాన పోరాడండి

ముప్పాళ్లకు అభయా గోల్డ్ బాధితుల వినతి

విశాలాంధ్ర అమరావతి : అభయ గోల్డ్ బాధితుల పక్షాన పోరాటం చేయాలని కోరుతూ పలువురు బాధితులు అభయా గోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు లను కలిసి వినతిపత్రం సమర్పించారు. 2008 లో స్థాపించిన అభయా గోల్డ్ ను నమ్మి నాలుగు లక్షల మంది ఖాతాదారులు నుండి రూ.174 కోట్లను పలు స్కీములు పేరుతో వసూలు చేసారని అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఐడి విచారణ జరుగుతుందని అయినప్పటికీ తమకి 2013 నుంచి నేటికీ ఏ విధమైన న్యాయం జరగలేదని వాపోయారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కత్తి నర్సింహారెడ్డి లు మాట్లాడుతూ అభయా గోల్డ్ బాధితుల పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అభయా గోల్డ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాపారావు, దుర్గారావు, కె కుమార్ తదితరులు పాల్గొన్నా



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కత్తి నరసింహారెడ్డి, ఓబులేసు, ఆర్ రవీంద్రనాథ్ తదితరులు

పోరాటాలే హక్కుల సాధనకు మార్గాలు : ఎమ్మెల్సీ కత్తి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కార్మికుల హక్కుల సాధనకు పోరాటాలే పరిష్కార మార్గమని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ 2019 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ సభ యూనియన్ అధ్యక్షులు ఎం.యేసోబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కత్తి మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం శాసన మండలిలో లేవనెత్తుతున్నట్లు చెప్పారు. అలాగే సభ వెలుపల కూడా పోరాటం చేస్తున్నట్లు వివరించారు. కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కొన్ని సంవత్సరాలుగా ఆందోళనల పోరాట ఫలితంగానే కార్మికులకు వేతనాల పెంపు జరిగిందన్నారు. ఉద్యోగ కార్మికుల సమస్యలపై మండలిలో చర్చించి, పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం తమ యూనియన్ అనుబంధంగా ఉన్న ఏపీ ఎలక్ట్రికల్ అండ్ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ నాయకత్వం పనిచేస్తుందన్నారు. అనేక పోరాటాల ఫలితంగా కొంత మెరుగైన వేతనాలు సాధించుకోగలిగినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత ముఖ్యమని, అది యూనియన్ వల్లే సాధ్యమవుతుందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, డిప్యూటి జనరల్ సెక్రటరీ ఎస్.వెంకట సుబ్బయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నా శివయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ యం.గంగాధర్, నాయకులు బ్రహ్మానందరెడ్డి,బడుగు హరిప్రకాష్, హెచ్.నరసింహులు, వాకా శ్రీనివాస్, విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల యూనియన్ నాయకులు ఎం.మల్లిఖార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలి

సీపీఐ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర ఇన్‌ఛార్జ్ హరనాథ్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పి.హరనాథ్‌రెడ్డి

విశాలాంధ్ర - డోన్ : ఉద్యమాల్లో సోషల్ మీడి యాను నాయకులు, కార్య కర్తలు ఉపయోగించుకోవాలని సీపీఐ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర ఇన్‌ఛార్జ్, విశాలాంధ్ర దినపత్రిక జనరల్ మేనేజర్ హరనాథ్ రెడ్డి తెలిపారు. ఆదివారం కర్నూలు జిల్లా డోన్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో కర్నూలు, అనంతపురం జిల్లాల సోషల్ మీడియా కార్యకర్తలకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ రంగనాయుడు అధ్యక్షత వహించారు. హరనాథ్ రెడ్డి మాట్లాడుతూ కత్తిని చెడుకు, మంచికి ఎలా వాడతారో సామాజిక మాధ్యమాలను కూడా మంచికే ఉపయోగిం చాలని, చెడుకు సంబంధించిన విషయాలను పోస్టు చేయరాదన్నారు. సోషల్ మీడియాలో సమాచారాన్ని పోస్టు చేసేటప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాలకు ఫోబియాగా మారితే ప్రమాదమని, ఎక్కడ వాడాలో అక్కడ వాడుకుం టేనే ఆరోగ్యకర సామాజిక అభివృద్ధికి దోహదపడు తుందని ఆయన అభిప్రాయ పడ్డారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాలు సైతం పేద వర్గాల చేతుల్లో లేవని, వాటిపై పెత్తనమంతా పెట్టుబడిదారుల గుప్పిట్లో ఉందన్నారు. ఉన్న పరిమితుల మేరకు వాటిని సద్వినియోగం చేసుకుని సీపీఐ కార్యక్రమాలు, ఉద్యమాలు, సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సాప్‌ల్లో సమాచారాన్ని ఎలా పోస్టు చేయాలి, వాటిని సామాన్య ప్రజలకు ఎలా చేరువ చేయాలో వివరించారు.

అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఎన్.రసూల్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబులు సోషల్ మీడియా ప్రాధాన్యత, వాటి ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుంకయ్య, ఏపీజీఎస్ జిల్లా కార్యదర్శి మోటా రాముడు, సీపీఐ పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, విశాలాంధ్ర కర్నూలు బ్రాంచ్ మేనేజర్ కె.నాగరాజు, విశాలాంధ్ర స్టాఫర్ శ్రీనివాసులు గౌడ్, విశాలాంధ్ర యాడ్స్ ఇన్‌ఛార్జ్ నాగరాజు, సీపీఐ ప్రజా సంఘాల నాయకులు చంద్రశేఖర్, పుల్లయ్య, అబ్బాస్, నారాయణ, శివన్న, అనీల్, సోషల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు జగన్ అన్యాయం : ఉమా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: తెలంగాణ సీఎం కేసీఆర్‌తో వైసీపీ అధినేత జగన్ చేతులు కలిపి రాష్ట్ర రైతాంగానికి తీరని అన్యాయం చేస్తున్నారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం అడ్డగోలుగా ప్రాజెక్టులు కడుతుంటే తమ ప్రభుత్వం న్యాయస్థానాల్లో పోరాటం చేస్తోందన్నారు. జలవనరులశాఖ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంట్రాక్టులు, వందలాది కోట్ల డబ్బు కోసమే జగన్ ఏపీ రాష్ట్ర ప్రయోజనాలను కేసీఆర్ వద్ద తాకట్టుపెట్టారని ధ్వజమెత్తారు. జగన్ హైదరాబాద్‌లో కూర్చుని ఏపీపై కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అలాగే బీజేపీతో కూడా కుమ్మక్కై రాజకీయాలు చేస్తోందన్నారు. కడపలో జరిగిన బీజేపీ సభకు వైసీపీ నేతలు జన సమీకరణ చేశారని ఆరోపించారు. బీజేపీ, కేసీఆర్‌తో కలసిన జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలే సరైన బుద్ధి చెబుతారన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతలో నిర్వహించిన ర్యాలీ విజయవంతమైందన్నారు. త్వరలో అమరావతిలో కూడా భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. బీజేపీ వ్యతిరేక పక్షాలన్నీ ఒకే వేదికపైకి వచ్చాయన్నారు. ఈ ర్యాలీకి కేసీఆర్, జగన్ ఎందుకు దూరంగా ఉన్నారో ప్రజలకు చెప్పాలని ఉమా డిమాండు చేశారు.

అప్పుల బాధ తాళలేక..
సీఎం ఎదుట ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర - మంగళగిరి : స్థోమతకి మించిన అప్పు.. దానికి వడ్డీ... ఆపై చక్ర వడ్డీ.. ఆ మొత్తం చెల్లించలేక ఒకరు సీఎం ఎదుట ఆత్మహత్య చేసుకునేందుకు విఫలయత్నం చేశాడు. వివరాలిలా ఉన్నాయి. మంగళగిరి మార్కండేయ కాలనీకి చెందిన గుంటుపల్లి సాంబశివరావు తాపీ మేస్త్రీగా పని చేస్తుంటాడు. 2012లో పార్కు రోడ్డుకు చెందిన శ్రీను అనే వ్యక్తి వద్ద రూ.3.50 లక్షల అప్పు తీసుకున్నాడు. రెండేళ్లలో అది కాస్తా వడ్డీతో కలిపి రూ.7 లక్షలు అయ్యింది. మధ్యలో మళ్లీ అవసరం వచ్చి రూ.రెండు లక్షలు తీసుకున్నాడు. 2016 నాటికి మొత్తం అప్పు చక్ర వడ్డీతో సహా రూ.25 లక్షలకు చేరింది. చెల్లించలేని స్థితిలో పెద్ద మనుషుల వద్ద పంచాయతీ పెట్టి నెలకు రూ.40 వేల చొప్పున రూ.20 లక్షలు ఇచ్చేందుకు అంగీకారం తెలిపాడు. అయితే నెలవారీ చెల్లించకపోవడంతో శ్రీను నుంచి ఒత్తిడి ఎక్కువైంది. మార్కండేయ కాలనీలో ఉన్న సొంత ఇల్లు అమ్ముకోవడం ఇష్టం లేక అటు అప్పు చెల్లించలేక ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నాడు. చివరిసారిగా ప్రభుత్వం నుంచి సాయం అర్థించాలని భావించి శనివారం సాయంత్రం ఉండవల్లిలోని సీఎం ఇంటి వద్ద జరిగే ప్రజా వేదిక వద్దకు వచ్చాడు. తనతోపాటు ద్విచక్ర వాహనంలోని 5 లీటర్ల డబ్బాలో కిరోసిన్ తెచ్చుకున్నాడు. ముందుగానే పసిగట్టిన సీఎం సెక్యూరిటీ సాంబశివరావుని నిలువరించి విచారించడంతో అసలు విషయం బయట పడింది. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోల్‌కతా ర్యాలీతో బీజేపీ గుండెల్లో రైళ్లు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కోల్‌కతలో జరిగిన యునైటెడ్ ఇండియా ర్యాలీతో బీజేపీ గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నాయని రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. బహిరంగసభలో 22 పార్టీల నేతలను ఒకే వేదికపై చూసి ప్రధాని మోడీ బెంబేలెత్తిపోతున్నారని ఆయన తెలిపారు. ఈమేరకు ఆదివారం యనమల ప్రకటన చేశారు. దోపిడీదారులందరూ ఒక్కటయ్యారని మోడీ సిల్వాసాలో చేసిన వ్యాఖ్యలు ఆయన దివాలాకోరు తనానికి నిదర్శనంగా నిలుస్తాయన్నారు. రాఫెల్ కంటే పెద్ద దోపిడీ ఏమి ఉంటుంది? అని ప్రశ్నించారు. ఈ కుంభకోణంలో రూ. 43 వేల కోట్ల దోపిడీ మోడీ ఘనత కాదా? అన్నారు. నీరవ్ మోడీ, విజయ్‌మాల్యా వంటి ఆర్థిక నేరగాళ్లను వెనుక పెట్టుకుని దోపిడీదార్ల గురించి మోడీ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకునే దుస్థితికి మోడీ చేరారని, బీజేపీ ప్రభుత్వం పతనం అంచున ఉందన్నారు. మోడీపై ఏమేరకు వ్యతిరేక ఉన్నదో కోల్‌కత ర్యాలీ అద్దంపట్టిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి, మోడీ నియంతృత్వపాలనకు మధ్యే ప్రధానంగా పోటీ ఉంటుందన్నారు. ఏది కావాలో ప్రజలే నిర్ణయిస్తారని, ఎన్నికల్లో అంతిమ విజయం ధర్మానిదే అవుతుందని యనమల స్పష్టం చేశారు.

చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి

- వేధింపులు, అత్యాచారాలను అరికట్టాలి
- ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని డిమాండు



సభలో ప్రసంగిస్తున్న దుర్గాభవాని

విశాలాంధ్ర - కమలాపురం : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని డిమాండు చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని సీఎస్ఎస్ఆర్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఆదివారం జిల్లా 6వ మహాసభలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా నలుమూలల నుంచి 1500 మందికిపైగా వచ్చిన మహిళలతో స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచి రైల్వే గేటు మీదుగా కళాశాల వరకు జెండాలు, ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. దీంతో పట్టణంలో సందడి నెలకొంది. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన దుర్గా భవాని మాట్లాడుతూ మహిళా సంక్షేమమే ధ్యేయంగా, సాధికారతే లక్ష్యంగా విద్య, వైద్యం, ఉపాధితో పాటు సామాజిక, సాంస్కృతిక రంగాలలో సమాన ప్రాతినిధ్యం కల్పించాలని, మహిళల హక్కుల కోసం మహిళా సమాఖ్య దేశంలో, రాష్ట్రంలో అలుపెరుగని పోరాటాలు చేస్తూ వస్తుందన్నారు. పోరాటాల ఫలితంగా మహిళలు విద్య, ఉద్యోగ, ఆస్తి తదితర హక్కులను సాధించుకున్నారన్నారు. వరకట్నం నిషేధం, లైంగిక వేధింపులు, గృహ హింస, నిర్భయ చట్టం వంటి ఎన్నో చట్టాలు చేసినా మహిళలను యంత్రాలుగానే చూడటం సరికాదన్నారు. వేధింపులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఐదేళ్ల పసిపాప నుండి 80 ఏళ్ల వృద్ధురాలి వరకు వారిపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచారాలను ప్రభుత్వం అరికట్టాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా మహిళలకు న్యాయం జరగడం లేదన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా ఆదాయాలు పెరగడం లేదని, దీంతో 70 శాతం మంది ఒక పూట తింటూ, రెండో పూట పస్తు ఉంటున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయన్నారు. పౌష్టికాహారం లోపం కారణంగా 48 శాతం మంది పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. నూటికి 67 మంది రక్త హీనతతో బాధపడుతున్నారని, దీనికంతటికీ కారణం ప్రభుత్వమే సరైన ఆహారం అందించడం లేదని ఆమె ఆరోపించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖజానా నింపేందుకు మద్యం, బెల్టు షాపులు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. మద్యం దుకాణాలు ఎక్కువగా ఉన్న అనంతపురం జిల్లాలో ఇటీవల 72 కుటుంబాలను సర్వే చేయగా మద్యం సేవించడం కారణంగా 30 ఏళ్ల లోపు వయస్సు కలిగిన పురుషులే ఎక్కువగా మృతి చెందుతున్న విషయం వెల్లడయ్యిందని దుర్గా భవాని తెలిపారు. జాతీయ రహదారిలో మద్యం దుకాణాలు పెట్టవద్దని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వాలు ఆదాయం తప్ప ప్రజల భవిష్యత్తుపై దృష్టి పెట్టడం లేదన్నారు.

మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ మహిళా సంక్షేమమే లక్ష్యంగా అలుపెరుగని పోరాటాలు చేస్తున్నామన్నారు. మహిళలకు పురుషులతో సమానమైన రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ మహిళలకు సమాన పనికి సమాన వేతనాలు అందడం లేదని, దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. సమాన పనికి సమాన వేతనాలు అందిం చాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో వృద్ధులకు పెన్షన్ మొత్తాన్ని రూ.2 వేలకు పెంచిందని, గత నాలుగేళ్లలో ఆ ఆలోచన రాలేదా అని ఆయన ప్రశ్నించారు. మహిళలకు ఉపాధి కల్పించేందుకు పరిశ్ర మలు ఏర్పాటు చేయడం లేదని, వారి భద్రతకు సంబం ధించిన బిల్లులకు మద్దతు ఇవ్వడం లేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు చంద్రశేఖర్, రాము, అంగన్వాడీ వర్కర్స్ ఆయా సంఘం రాష్ట్ర నాయకురాలు మంజుల, విశ్రాంత ప్రిన్సిపాల్ సంజీవమ్మ, సీనియర్ మహిళా నాయకులు శ్యామల, కృష్ణవేణి, ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళాతో లక్ష కోట్లకుపైగా ఆదాయం

లక్నో : కుంభమేళా ద్వారా ఉత్తరప్రదేశ్‌కు రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరనున్నట్లు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ వెల్లడించింది. జనవరి 15న ప్రారంభమైన ఈ మెగా మేళా మార్చి 4 వరకు కొనసాగనుంది. ఇది నిజానికి మత పరమైన ఓ భారీ వేడుక అయినా దీనితో ముడిపడి ఉన్న ఆర్థిక కార్యకలాపాలు వివిధ రంగాల్లోని ఆరు లక్షల మందికిపైగా ఉపాధి కల్పిస్తున్నదని సీఐఐ తెలిపింది. 50 రోజుల కుంభమేళా నిర్వహణ కోసం యూపీ ప్రభుత్వం రూ.4200 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. 2013లో జరిగిన మహా కుంభమేళా కంటే మూడు రెట్లు ఎక్కువ నిధులను ఈసారి ఇవ్వడం విశేషం. ఆతిథ్య రంగం 2 లక్షల 50 వేల మందికి, ఎయిర్‌లైన్స్, ఎయిర్‌పోర్ట్స్ లక్షా 50 వేల మందికి, టూర్ ఆపరేటర్స్ 45 వేల మందికి, ఎకో టూరిజం, మెడికల్ టూరిజంలో 85 వేల మందికి ఈ కుంభమేళా ఉపాధి కల్పిస్తున్నట్లు సీఐఐ అధ్యయనం వెల్లడించింది.

ఇది కాకుండా అసంఘటిత రంగంలో టూర్ గైడ్స్, ట్యాక్సీ డ్రైవర్స్, వలంటీర్లు, ఇంటర్‌ప్రీటర్స్ రూపంలో మరో 55 వేల ఉద్యోగాలు వచ్చినట్లు సీఐఐ చెప్పింది. ఇవన్నీ ప్రభుత్వ ఏజెన్సీలు, వ్యాపారుల ఆదాయాన్ని భారీ పెంచినట్లు తెలిపింది. అంతే కాదు ఈ కుంభమేళాకు ఆస్ట్రేలియా, యూకే, కెనడా, మలేషియా, సింగపూర్, సౌతాఫ్రికా, న్యూజిలాండ్, మారిషస్, జింబాబ్వే, శ్రీలంకల నుంచి భారీ ఎత్తున విదేశీయులు కూడా వచ్చారు. ఈ భారీ ఆదాయం ద్వారా ఉత్తరప్రదేశ్ ఒక్కటే కాకుండా రాజస్థాన్, ఉత్తరాఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు కూడా లబ్ధి పొందనున్నట్లు సీఐఐ చెప్పింది.



'ఆపరేషన్ ఆకర్ష్' భయం



- కర్ణాటకలో కాంగ్రెస్, బీజేపీ రిసార్టు రాజకీయాలు
- తన్నుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు - ఒకరు ఆసుపత్రికి తరలింపు
- తిరిగి రావాలంటూ బీజేపీ ఎమ్మెల్యేలకు ఆదేశం
- ప్రభుత్వ అస్థిరతకు ప్రయత్నించబోమని యడ్యూరప్ప హామీ

బెంగళూరు : కర్ణాటక రాజకీయాలు రోజురోజుకు వేడెక్కుతున్నాయి. అధికారం నిలుపుకునేందుకు కాంగ్రెస్-జేడీఎస్ తంటాలు పడుతుండగా..ఎలాగైనా అధికారం లాక్కోవాలని బీజేపీ తహతహలాడుతోంది. అందుకోసం అటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు బీజేపీ, బీజేపీ ఎమ్మెల్యేల కోసం కాంగ్రెస్ వల విసురుకుంటున్నాయి. దీంతో బీజేపీ, కాంగ్రెస్ రెండూ తమ శాసనసభ్యులను రిసార్టులకు పంపాయి. చాలా రోజుల క్రితమే బీజేపీ ఎమ్మెల్యేలు ఢిల్లీ దగ్గర గల ఓ రిసార్టుకు మకాం మార్చగా కాంగ్రెస్ మాత్రం శుక్రవారం నుంచి క్యాంపునకు తరలించింది. తమ ఎమ్మెల్యేల పట్ల ఎవరికి వారు మేకపోతు గాంభీర్యం వ్యక్తం చేస్తున్నప్పటికీ రెండు పార్టీలకు ఆపరేషన్ ఆకర్ష్ భయం పట్టుకుంది. తమ ప్రభుత్వ సుస్థిరతకు ముప్పేమీ లేదని, తామంతా కలిసే ఉన్నామని కాంగ్రెస్, జేడీఎస్ ప్రకటనలు గుప్పిస్తున్నాయి. అదేసమయంలో తమ ఎమ్మెల్యేలను లాక్కోవడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని ఆ పార్టీలు ఆరోపిస్తున్నాయి. బీజేపీ సైతం ఇదే తరహా ప్రకటనలు చేస్తోంది. తాము ఎవరికీ వల వేయడం లేదని, కుమార స్వామి ప్రభుత్వాన్ని అస్థిరపరచబోమని బీజేపీ చెబుతోంది.

ఇకపోతే బీజేపీ తమ ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టకుండా చేసేందుకు కాంగ్రెస్ పార్టీ.. వారిని ఈగల్టన్ రిసార్ట్‌కు తరలించింది. అయితే, ఆ రిసార్టులో శనివారం సాయంత్రం కొందరు ఎమ్మెల్యేలు ఘర్షణకు దిగినట్లు ప్రచారం జరిగింది. ఎమ్మెల్యే ఆనంద్ సింగ్ తలపై ఎమ్మెల్యే జేఎన్ గణేశ్ ఓ బాటిల్‌తో కొట్టడంతో ఆయనను ఆస్పత్రికి తరలించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ విషయంపై కొందరు కాంగ్రెస్ నేతలను ప్రశ్నించగా.. వారు ఈ ఆరోపణలను కొట్టేస్తున్నారు. ఆనంద్ సింగ్ చికిత్స తీసుకుంటున్న అపోలో ఆస్పత్రికి ఆదివారం ఉదయం కాంగ్రెస్ నేతలు క్యూ కట్టారు. ఆయనను పరామర్శించేందుకు ఆస్పత్రికి చేరుకున్న ఆ పార్టీ నేత రఘునాథ్ మీడియాతో మాట్లాడుతూ తాము లోపలికి వెళ్లడానికి అనుమతి ఇవ్వడం లేదని తెలిపారు. ఎమ్మెల్యేల మధ్య ఘర్షణ జరిగినట్టు వస్తున్న ప్రచారాన్ని ఆ పార్టీ నేత డీకే శివకుమార్ కొట్టిపారేశారు. అయితే, ఆయన సోదరుడు, కాంగ్రెస్ నేత డీకే సురేశ్ అదే ఆస్పత్రి వద్ద ఉన్నారు. కాంగ్రెస్ తీరుపై బీజేపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. 'కాంగ్రెస్ పార్టీలో పరిస్థితులు దిగజారి పోయాయని చెప్పడానికి ఇంతకన్నా రుజువు ఇంకేం కావాలి? ఆ పార్టీ నేతలు ఈగల్టన్ రిసార్ట్‌లో ఘర్షణ పడ్డారు. వారిలో ఒకరు ఆస్పత్రి పాలయ్యారు. తమలో ఉన్న అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఇంకెంత కాలం మాపై ఆరోపణలు చేస్తుంది?' అని ఆ పార్టీ తమ అధికారిక ట్విటర్ ఖాతాలో విమర్శలు గుప్పించింది. ఈ వార్తలపై స్పందించిన డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ... 'ఇది అసత్య వార్త. మా పార్టీ నేతలు ఐకమత్యంతో, కలిసిమెలసి ఉన్నారు' అని అన్నారు

కొన్ని రోజులుగా గురుగ్రామ్‌లోని ఓ ప్రైవేటు రిసార్టులో తలదాచుకున్న బీజేపీ ఎమ్మెల్యేలు తిరిగి ఆదివారం కర్ణాటక చేరుకున్నారు. తక్షణమే తిరిగి బెంగళూరు రావాల్సిందిగా బీజేపీ కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప ఆదేశించడంతో మొత్తం 104 మంది శాసనసభ్యులు రాష్ట్ర రాజధానికి వచ్చారు. శనివారం రాత్రికే ఎమ్మెల్యేలంతా బెంగళూరు వచ్చినట్టు బీజేపీ ఎమ్మెల్సీ లెహర్‌సింగ్ ఆదివారం పీటీఐకి తెలిపారు. కొంత మంది నేరుగా తమ తమ నియోజకవర్గాలకు చేరుకోగా మాజీ డిప్యూటీ సీఎంలు ఆర్.అశోక్, కేఎస్ ఈశ్వరప్ప సహా మిగిలిన వారు బెంగళూరు వచ్చారన్నారు. తమ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ తన్నుకుపోతుందన్న భయంతో కొంతకాలంగా బీజేపీ తన శాసనసభ్యులను రిసార్టులకు పంపింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ వైపునకు రాకపోవడం, అంతర్గత పోరుతో ఆ పార్టీ సతమతమవుతుండటంతో బీజేపీ ఊపిరిపీల్చుకుంది. ఇక రిసార్టు రాజకీయాలకు స్వస్తి చెప్పి నియోజకవర్గాలకు వెళ్లాలని నిర్ణయించింది. ఇప్పుడు ఆపరేషన్ ఆకర్ష్ భయం కాంగ్రెస్‌కు పట్టుకున్నది.

కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే చర్యలకు తాము పాల్పడబోమని యడ్యూరప్ప చెప్పుకొచ్చారు. ఈ విషయంలో కాంగ్రెస్-జేడీఎస్ నాయకులు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీఎల్పీ సమావేశానికి గైర్హాజరు కావడంతో యడ్యూరప్ప ఈ ప్రకటన చేశారు. తమ శాసనసభ్యులను ఆకర్షించేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని ఆరోపిస్తూ కాంగ్రెస్ సైతం శుక్రవారం నుంచి తమ ఎమ్మెల్యేలను క్యాంపునకు తరలించింది. 8 మంది శాసనసభ్యులకు బీజేపీ వలేసిందని కాంగ్రెస్ కీలక నేతలు చెప్పారు. దీనికి బలాన్ని చేకూరుస్తూ ఏడుగురు సభ్యుల బృందం సోమవారం నుంచి కరవు జిల్లాల్లో పర్యటిస్తారని బీజేపీ వెల్లడించింది. బీజేపీ శాసనసభ్యులను వెనక్కి రావాలని యడ్యూరప్ప ఆదేశించడాన్ని సీఎల్పీ నేత సిద్దరామయ్య స్వాగతించారు. అదేసమయంలో పాలక సంకీర్ణ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే చర్యలకు స్వస్తి చెప్పాలని హితవు పలికారు. మరోవైపు కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరితో తాను మాట్లాడుతున్నానని, అందరూ టచ్‌లోనే ఉన్నారని రాష్ట్రమంత్రి డీకే శివకుమార్ చెప్పారు.

సిద్దూకు బెంజ్ కారు గిఫ్ట్

రాజకీయ దుమారం



బెంగళూరు : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ముఖ్య మంత్రి సిద్దరామయ్య వివాదంలో చిక్కుకున్నారు. సిద్ధరామయ్యకు తాను లగ్జరీ (మెర్సిడెజ్ బెంజ్) కారును కానుకగా ఇచ్చానని కాంగ్రెస్ శాసన సభ్యుడు బి.సురేష్ చెప్పినట్టు వచ్చిన వార్తలు రాజకీయ దుమారం రేపాయి. ఈ వార్తలను కాంగ్రెస్ నాయకుడు డీకే శివకుమార్ ఖండించారు. సిద్ధ రామయ్యకు సురేష్ ఆ కారును కానుకగా ఇవ్వలేదని, ప్రయాణ అవసరం కోసమే ఇచ్చారని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. 'బహుమతి లేదూ...ఏమీ లేదు. కొన్నిసార్లు ప్రయాణం కోసం మిత్రుల కార్లు మేము తీసుకుంటాం. ఇది పెద్ద విషయమేమీ కాదు. దీనిని రాద్ధాంతం చేయాల్సిన అవసరం అంతకన్నా లేదు. సిద్ధరామయ్య కానుకగా తీసుకున్నట్టు ఆధారాలేమైనా ఉన్నాయా అని ఎదురు ప్రశ్నించారు. గతంలోనూ సిద్ధరామయ్య ఇలాంటి వివాదంలోనే చిక్కుకున్నారు. అప్పటి తన మంత్రివర్గ సహచరుడు కేజీ జార్జి నుంచి సిద్ధరామయ్య టొయోటా ల్యాండ్ క్రూజర్ బహుమతిగా తీసుకున్నట్టు వార్తలు వచ్చాయి. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి అలా చేయడం వివాదంగా మారింది. దీనికి జార్జి వివరణ ఇస్తూ ఇన్నోవాలో దూర ప్రాంతాల ప్రయాణం ఇబ్బందికరంగా ఉండటంతో తన వాహనాన్ని సీఎంకు ఇచ్చానని చెప్పారు.

ఒకేసారి లోక్‌సభ, జమ్మూ, కాశ్మీర్ ఎన్నికలు

కేంద్రం యోచన



న్యూఢిల్లీ : ఏప్రిల్-మే నెలల్లో జరుగుతాయని భావిస్తున్న సార్వత్రిక ఎన్నికలతోపాటు జమ్మూ, కాశ్మీర్ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు కూడా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు అధికారిక వర్గాల సమాచారం. గత ఏడాది జూన్‌లో మెహబూబా ముఫ్తీకి చెందిన పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి బీజేపీ మద్దతు ఉపసంహరణతో గవర్నర్ పాలన విధించబడింది. ఆరు నెలల తర్వాత తర్వాత డిసెంబరు మధ్య నుంచి రాష్ట్రం రాష్ట్రపతి పాలనలోకి వెళ్లింది. 'అయితే లోక్‌సభ ఎన్నికల మొదటి దశ లేదా తుది దశ ఎన్నికలతో కలిసి జమ్మూ, కాశ్మీరు అసెంబ్లీ ఎన్నికలను నిర్వహిస్తారా అన్నదే నిర్ణయించుకోవాల్సిన ప్రశ్న. రాష్ట్రానికి అదనపు భద్రతా బలగాలు, ముఖ్యంగా పారామిలటరీ బలగాలు అందుబాటుపై, వాటి సమీకరణ షెడ్యూల్‌పై ఇది ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం లోకసభ ఎన్నికల తొలిదశతోనే రాష్ట్రానికి కూడా ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచన ఉంది' అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని అధికారి ఒకరు తెలిపారు. తొలుత రాష్ట్రానికి వచ్చిన అదనపు బలగాలు మొదటి దశ పోలింగ్ పూర్తయిన తర్వాత పోలింగ్ షెడ్యూల్ ప్రకారం ఇతర రాష్ట్రాలకు పంపబడతాయి. కానీ ప్రస్తుతం తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదు' అని ఆ అధికారి చెప్పారు. భద్రతా పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్రాన్ని ఎన్నికల కమిషన్ బృందం ఒకటి సందర్శించే అవకాశం ఉంది. రాష్ట్రంలో సుమారు 87 వేల మంది కేంద్ర సాయుధ బలగాలు ఉన్నారని, ఎన్నికల నిర్వహణకు మరో 10 వేల మంది భద్రతా సిబ్బంది అవసరమవుతారని శ్రీనగర్‌కు చెందిన భద్రతాధికారి ఒకరు తెలిపారు. మొదటి దశలో ఎన్నికలను నిర్వహించదలిస్తే, మరింత సుస్థిర భద్రతా పరిస్థితి కోసం కనీసం నెల రోజుల ముందే అదనపు బలగాలు రాష్ట్రానికి అవసరమవుతాయన్నారు. ఇదిలాఉండగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం సార్వత్రిక ఎన్నికల తుది దశతోపాటు అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు మొగ్గు చూపుతోంది. 'ఈ ప్రాంతంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విస్తృత ప్రచారం నిర్వహించిన తర్వాతే రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలని బీజేపీలోని ఒక వర్గం నాయకులు సూచిస్తున్నారు' అని పార్టీ కార్యకర్త ఒకరు తెలిపారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించినట్లయితే లోక్‌సభ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ శాతం సమస్య కూడా పరిష్కారమవుతుందని కేంద్ర నాయకత్వం చెబుతోంది. కాగా జమ్మూ, కాశ్మీర్ రాష్ట్ర శాసనసభ గత ఎన్నికల్లో బీజేపీ 25 స్థానాలను గెలుచుకుంది. లడఖ్ నుంచి ఉన్న ఒకే ఒక ఎంపీ గత నవంబరులో పార్టీని వీడారు. లడఖ్‌కు కేంద్ర పాలిత ప్రాంత హోదా మంజూరు, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను పరిష్కరించనందుకు పార్టీ నాయకత్వంతో ఆ బీజేపీ ఎంపీ విభేదించారు. ఒక జమ్మూలో కూడా, రొహింగ్యా శరణార్థులకు పునరావాసంపై బీజేపీ ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కొంటోంది. భద్రతా కారణాల దృష్ట్యా శరణార్థులను అక్కడి నుంచి తరలించాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు.

మేనిఫెస్టోలో పెడితే మద్దతిస్తాం

కాంగ్రెస్‌కు వీహెచ్‌పీ బంపర్ ఆఫర్



లక్నో : అయోధ్యలో రామ మందిరం నిర్మిస్తామని లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో చేరిస్తే కాంగ్రెస్‌కు మద్దతివ్వగలమని వీహెచ్‌పీ చెప్పింది. ప్రయోగరాజ్‌లో కుంభమేళాకు హాజరైన వీహెచ్‌పీ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు అలోక్ కుమార్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తమకు అన్ని తలుపులూ మూసేసిందని, అయితే మూసిన తలుపులు తెరిచి రామమందిర నిర్మాణాన్ని ఎన్నికల ప్రణాళికలో చేరిస్తే ఆ పార్టీకి మద్దతివ్వడానికి తమకేమీ అభ్యంతరం లేదని చెప్పారు. ఈనెల 31న వీహెచ్‌పీ ధర్మసంసద్ జరగనున్న నేపథ్యంలో అలోక్ కుమార్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ధర్మ సంసద్‌లో సాధువులు, సంతుల ఆశీస్సులు తీసుకుంటామని, రామమందిరం అంశాన్ని వారి ముందుంచి సలహాలు కోరుతామని తెలిపారు. ఆ తర్వాతే భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామని కుమార్ తెలిపారు. తమ పార్టీ ఇటీవల అన్ని రాజకీయ పార్టీలనూ కలిసి రామాలయ అంశం పార్లమెంటు ముందుకు వస్తే మద్దతివ్వాల్సిందిగా కోరామని అన్నారు. రాజకీయ పార్టీలన్నీ ఏకాభిప్రాయానికి రావాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలోనూ రామాలయం అంశాన్ని చేర్చాలని కోరామన్నారు. అన్నీ పార్టీలూ ఆ పని చేస్తాయనే అనుకుంటున్నామని తెలిపారు. కాంగ్రెస్‌కు మద్దతుపై తాను చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించడంతో కుమార్ మరోసారి స్పందించారు. తన వ్యాఖ్యలను మరీ అంతగా సాగదీయరాదని, అత్యుత్సాహంతో చూడరాదని అన్నారు. మద్దతివ్వడం తమ పని కాదని, తాము అలా చేయబోమని మాట మార్చారు. రామాలయ నిర్మాణంపై ఆర్డినెన్స్‌కు బీజేపీపై ఒత్తిడి తెచ్చే క్రమంలోనే వీహెచ్‌పీ నేత ఇలాంటి వ్యాఖ్యలు చేసి ఉండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

2017-18లో కాంగ్రెస్ ఆదాయం రూ.199 కోట్లు

- 11 ఏళ్లలో ఇదే తక్కువ
- బీజేపీ ఆదాయంలో ఐదో వంతు..!

న్యూఢిల్లీ : జాతీయ పార్టీగా, లోక్‌సభలో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌కు విరాళాల ద్వారా వస్తున్న ఆదాయం ఏటికేడు తగ్గిపోతున్నది. 2001-13 మధ్య విరాళాలను అధికంగా పొందిన ఆ పార్టీ 2014 తర్వాత అదే ఆధిపత్యాన్ని కొనసాగించలేకపోయింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.199 కోట్ల ఆదాయాన్ని మాత్రమే గడించింది. కిందటేడాది(రూ.225 కోట్లు)తో పోల్చుకుంటే ఆపార్టీ ఆదాయం 12శాతం తగ్గిపోయింది. అంతేకాకుండా గత 11 ఏళ్లలో ఇంత తక్కువ ఆదాయాన్ని ఆ పార్టీ పొందడం ఇదే మొదటిసారి. భారత ఎన్నికల సంఘం(ఈసీఐ)కి కాంగ్రెస్ సమర్పించిన తన వార్షిక ఆడిట్ నివేదిక ప్రకారం ఈ విషయం వెల్లడైంది. దీనిని ఈసీఐ రెండురోజుల క్రితం బహిరంగపరచింది. ఈ సమారాన్ని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫార్మ్స్(ఏడీఆర్) తన వెబ్‌సైట్లో పొందుపరిచింది. ప్రత్యర్థి బీజేపీ ఆదాయం 2017-18లో రూ.1,027 గా ప్రకటించింది. అంటే బీజేపీ ఆదాయంలో కాంగ్రెస్ పార్టీ ఆదాయం ఐదో వంతు అన్నమాట. 2001-02 నుంచి 2012-13 మధ్య కాంగ్రెస్ పార్టీ బీజేపీ కంటే ఎక్కువ ఆదాయాన్ని గడించింది. అనంతరం 2014లో కేంద్రంలో బీజేపీ అధికారాన్ని చేపట్టిన తర్వాత నుంచి కాంగ్రెస్‌ను అపార్టీ వెనక్కి నెట్టి ఆదాయంలో ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 2017-18లో ఈ రెండు పార్టీల మొత్తం ఆదాయంలో కాంగ్రెస్ పార్టీ షేరు చూసుకుంటే కేవలం 16శాతంగా(2001-02నుంచి ఇది చాలా తక్కువ) ఉన్నది.

ఎలక్టోరల్ బాండ్‌ల ద్వారా బీజేపీకి రూ.210 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.5 కోట్లు

ఎలక్టోరల్ బాండ్‌ల ద్వారా బీజేపీ ఎక్కువగా లాభపడింది. ఈ విషయంలో బీజేపీ అధికంగా రూ.210కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇక కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఆదాయంలో రూ.5 కోట్లు మాత్రమే ఎలక్టోరల్ బాండ్ల నుంచి వచ్చాయి. దేశంలోని మిగతా జాతీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్‌ల ద్వారా ఏమాత్రం ఆదాయాన్ని పొందక పోవడం గమనార్హం. అలాగే 2017-18లో వాటి మొత్తం ఆదాయం(రూ.171 కోట్లు) కూడా బీజేపీ, కాంగ్రెస్‌ల మొత్తం ఆదాయంలో 14శాతంగా ఉన్నది. ఇక 2017-18లో కాంగ్రెస్ పార్టీ పొందిన మొత్తం ఆదాయంలో రూ.197 కోట్లను ఖర్చు చేసింది.



10 శాతం పెరగనున్న ఎన్‌డీఏ ఓట్లు



న్యూఢిల్లీ : జనరల్ కేటగిరిలో వెనుకబడిన తరగతుల (ఈబీసీ) వారికి విద్యా, ఉద్యోగాలలో పది శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించటం వల్ల బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏకు పది శాతం ఓట్లు అదనంగా లభిస్తాయని కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ చెప్పారు. ప్రతిపక్షాలతో ఏర్పడిన మహా కూటమిని ప్రజలు తిరస్కరిస్తారని తెలిపారు. పాశ్వాన్ న్యూఢిల్లీలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, ప్రధాని మోడీ దీర్ఘకాల ప్రయోజనాలను కల్పించే ప్రజా రంజక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సుపరిపాలనను అందిస్తున్న మోడీని మళ్లీ గెలిపిస్తారని తెలిపారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకుంటామన్నారు. ఇప్పటికే ఎన్‌డీఏ ప్రభుత్వం పెద్ద ఎత్తున పథకాలను అమలు చేస్తోందని ఆయన వివరించారు.

ప్రజాస్వామ్య రక్షణకే కోల్‌కతా ర్యాలీ



పాట్నా (బీహార్) : దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకే పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ప్రతిపక్షాలు ర్యాలీ నిర్వహించినట్లు బీజేపీ రెబల్ ఎంపీ శత్రుఘ్న సిన్హా చెప్పారు. కోల్‌కతాలో శనివారం జరిగిన విపక్షాల భారీ బహిరంగ సభలో పాల్గొన్న ఆయన పాట్నాలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బెంగాల్ సభకు భారీగా జనం తరలివచ్చి ప్రతిపక్షాలకు సంపూర్ణ మద్దతునిచ్చారని తెలపారు. లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలను చూస్తే ప్రభుత్వంలో మార్పు తప్పదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 23 రాజకీయ పార్టీల నేతలంతా ఒకే వేదికపైకి వచ్చి కేంద్రంలోని ప్రధాని మోడీకి వ్యతిరేకంగా పోరాడతామని ప్రకటించారన్నారు. ప్రతిపక్షాలన్నింటినీ ఒకే వేదికపైకి తెచ్చిన పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మోడీ పాలనలో దేశంలో ప్రజాస్వామ్య ప్రమాదంలో పడిందని, దానిని రక్షించటమే అందరి అజెండాగా చెప్పారు.

బీజేపీ ఎమ్మెల్యే అనుమానాస్పద మృతి



బర్వానీ (మధ్యప్రదేశ్) : మధ్యప్రదేశ్ బీజేపీ నాయకుడు, బర్వాని ఎమ్మెల్యే మనోజ్ ఠాకరే అనుమానాస్పదస్థితిలో ఆదివారం మృతి చెందారు. మార్నింగ్ వాక్‌కు వెళ్లిన ఆయన మృతదేహాన్ని వార్లా పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు గుర్తించారు. మందసౌర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు ప్రహ్లాద్ బంధ్వార్ హత్య జరిగిన వారం రోజులకు మనోజ్ ఠాకరే అనుమానాస్పదస్థితిలో మృతి చెందటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఘటనాస్థలంలో రక్తం అంటిన రాయిని గుర్తించారు. ఎప్పటి మాదిరిగానే ఎమ్మెల్యే మనోజ్ ఠాకరే మార్నింగ్ వాక్‌కు వెళ్లారని, ఎవరో ఉద్దేశపూర్వకంగానే రాయితో కొట్టి హత్య చేసినట్లు అనుమానిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. హత్య కోణంలోనే కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను పరిరక్షించటంలో అధికార కాంగ్రెస్ వైఫల్యం చెందిందని మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ విమర్శించారు.

భయ్యూ ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

ఇండోర్ (మధ్యప్రదేశ్) : స్వయం ప్రకటిత బాబా భయ్యూ మహారాజ్ ఆత్మహత్య కేసులో ముగ్గురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఆధ్యాత్మిక గురువుకు హైడోస్ మెడిసిన్స్ రహస్యంగా ఇచ్చి హత్య చేసి, దానిని ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు పోలీసు అధికారి ఒకరు తెలిపారు. భయ్యూ మహారాజ్ వ్యక్తిగత కార్యదర్శి పాలక్ పురాణిక్ (25), ఆమె అనుచరులు వినాయక్ దుద్వాడే (42), శరద్ దేశ్‌ముఖ్ (34) అరెస్టయిన వారిలో ఉన్నారు. స్వయంప్రకటిత బాబాను బ్లాక్‌మెయిల్ చేయటంతోపాటు తనను వివాహం చేసుకోవాలని పురాణిక్ ఒత్తిడి తెచ్చినట్లు డీఐజీ హెచ్‌సీ మిశ్రా తెలిపారు. ఈ నేపథ్యంలో మహరాజ్‌ను తమ అదుపులో పెట్టుకునేందుకు హైడోస్ మందులను ఇచ్చినట్లు విచారణలో తేలిందన్నారు. పురాణిక్, భయ్యూ మధ్య సాగిన అసభ్యకర పదజాలానికి సంబంధించిన సోషల్ మీడియా రికార్డులను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు.

సాధానా సింగ్ మానసిక రోగి : సతీష్ చంద్ర

లక్నో (ఉత్తరప్రదేశ్) : బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి ట్రాన్స్‌జెండర్‌కంటే ఘోరమని వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే సాధనా సింగ్ (ముఘల్‌సరై) మానసిక రోగి అని బీఎస్పీ నాయకుడు సతీష్ చంద్ర విమర్శించారు. లక్నోలో ఆయన ఆదివారం మాట్లాడుతూ, మానసిక రోగి ఎమ్మెల్యే సాధనాసింగ్ వెంటనే ఆగ్రా లేదా బరేలీ ఆసుపత్రిలో చేరాలని ఆయన సూచించారు. మాయావతిపై సాధనాసింగ్ చేసిన వ్యాఖ్యలబట్టే బీజేపీ వైఖరేంటో చెప్పవచ్చన్నారు. రాష్ట్రంలో ఎస్పీ, బీఎస్పీ పొత్తుపై బీజేపీ అసహనంతో ఉందనే విషయం స్పష్టమైందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ ఒక్కసీటును కూడా గెలిచే బలంలేదన్నారు.

పరిశుభ్రతలో శతాబ్ది రైళ్లు భేష్

- దురంతో అధ్వానం
- రైల్వేశాఖ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలో అన్ని వర్గాల ప్రజలు ప్రయాణించే రైళ్లలో పరిశుభ్రతపై భారతీయ రైల్వే తొలిసారిగా సర్వే నిర్వహించింది. ప్రీమియం రైళ్ల విభాగంలో పరిశుభ్రతలో శతాబ్ది రైలు మొదటిస్థానంలో నిలవగా, దురంతో రైళ్లు అధ్వానంగా ఉన్నాయి. దేశంలో రాకపోకలు సాగించే పూణే - సికింద్రాబాద్, హౌరా - రాంచీసహా మూడు శతాబ్ది రైళ్లలో పరిశుభ్రతపై ప్రయాణికులు సంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం 77 ప్రీమియం రైళ్లపై సర్వే నిర్వహించగా, దురంతో రైళ్లు చివరి స్థానంలో నిలిచాయి. 'ది ట్రెన్ క్లీన్‌లీనెస్ సర్వే 2018' పేరిట గతేడాది డిసెంబరులో రైల్వేశాఖ సర్వే నిర్వహించింది. ప్రీమియం, నాన్ - ప్రీమియం విభాగాల్లో 210 రైళ్లను సర్వే చేశారు. ఈ సర్వేలో రెండు అంశాలపైనే ప్రయాణికులు అసంతృప్తిని వ్యక్తపరిచినట్లు రైల్వేశాఖ వెల్లడించింది. అన్ని రైళ్లలో టాయ్‌లెట్లను శుభ్రం చేయటంలేదని, కోచ్‌లను శుభ్రం చేసేందుకు తగిన సౌకర్యాలు లేవని అభిప్రాయపడినట్లు రైల్వేశాఖ తెలిపింది. సర్వేలో భాగంగా 15 వేల మంది అభిప్రాయాలను సేకరించినా, ఇందుకు సంబంధించిన నివేదికను వెల్లడించలేదని అధికారులు తెలిపారు. రైల్వేలోని పర్యావరణ, హౌస్ కీపింగ్ విభాగాలు సంయుక్తంగా సర్వే చేశాయన్నారు. దేశంలోని 23 రాజధాని రైళ్లలో ముంబై - న్యూఢిల్లీ రాజధాని రైలు మొదటిస్థానంలో నిలవగా, న్యూఢిల్లీ - దిబ్రుగఢ్ రైలు చివరిస్థానంలో ఉన్నట్లు వెల్లడించారు. ప్రీమియం రైళ్లలో పారిశుధ్య నిర్వహణ, టాయ్‌లెట్లను శుభ్రపరచటం, బెడ్‌షీట్‌ల మార్పిడి, పెస్ట్ మేనేజ్‌మెంట్ పనితీరు, హౌస్ కీపింగ్ సిబ్బంది పనితీరును అంచనా వేసే లక్ష్యంతో ఈ సర్వే నిర్వహించామని రైల్వేశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇదిలావుండగా, రైళ్లలో టాయ్‌లెట్లను శుభ్రం చేయటం కష్టతరమని ఆయన చెప్పారు. రైళ్లలో ఒక్కో టాయ్‌లెట్‌ను రోజులో 60 సార్లు వినియోగిస్తారని, ఈ నేపథ్యంలో వాటిని శుభ్రం చేయటం కష్టతరమని తెలిపారు.

నెలాఖరు కల్లా అన్ని ఇళ్లకు విద్యుత్ ?

న్యూఢిల్లీ : దేశంలో నూరుశాతం గృహాలకు విద్యుత్తు కనెక్షన్లు అందజేయాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం ఈ నెలాఖరుకు పూర్తికావచ్చని భావిస్తున్నారు. ఈ దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రూ.16,320 కోట్లతో మొత్తం 2.48 కోట్ల ఇళ్లకు విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలన్న లక్ష్యంతో 2017 సెప్టెంబరులో 'సౌభాగ్య' (ప్రధాన మంత్రి సహజ్ బిజ్లీ హర్ ఘర్ యోజన) పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటి వరకు ఈ పథకం కింద 2.44 కోట్ల గృహాలకు విద్యుత్తు కనెక్షన్లు కల్పించారు. రోజుకు 30వేల కనెక్షన్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు లక్ష్యం నెరవేరనుందని అధికారులు చెబుతున్నారు. దేశంలోని అన్ని గృహాలకు విద్యుత్తు కనెక్షన్లు కల్పించాలని మోడీ పభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. దీనిని 2018 డిసెంబరు నాటికే పూర్తి చేయాల్సి ఉంది. కానీ విద్యుత్తు శాఖ మంత్రి ఆర్‌కే సింగ్ దీనిపై సమీక్ష నిర్వహించి లక్ష్యాన్ని 2019 మార్చి 31కు పొడిగించారు. కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు, మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పనుల్లో జాప్యం జరుగుతోంది. మొత్తం నాలుగు రాష్ట్రాల్లో దాదాపు 3.58లక్షల ఇళ్లకు విద్యుత్తును అందజేయాల్సి ఉంది. వీటిల్లో అసోం (1,63,016), రాజస్థాన్ (88,219), మేఘాలయ (88,317), ఛత్తీస్‌గఢ్ (20,293) ఉన్నాయి.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్



విశాలాంధ్ర-జగిత్యాల బ్యూరో: జిల్లాలోని మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా సారంగపూర్, బీర్పూర్ మండలాలకు సంబంధించిన ఎన్నికల సామాగ్రిని సారంగపూర్ మండలంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.శరత్ పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పోలింగ్ రోజున బ్యాలెట్ బాక్సులను ఏవిధంగా తెరవాలి, మూసివేయాలి, లాక్ వేయడం, సీల్ వేయడం మొదలగు వాటిని జిల్లా కలెక్టర్ ఆద్వర్యంలో సిబ్బందితోనే చేయించడం జరిగింది. సిబ్బంది అందరూ పోలింగ్ కేంద్రంలో అవసరమైనవన్ని ముందుగానే చూసుకోవాలని శిక్షణ కార్యక్రమంలో మీకు సూచించిన విధంగా సక్రమంగా విధులను నిర్వహించాలని, ఎలాంటి అలసత్వం వహిం చరాదని అన్నారు. పోలింగ్ రోజున ఏవైనా సమస్యలు ఎదురైనట్లయితే మైక్రో అబ్జర్వర్లకు గాని, ఆర్వోల దృష్టికి గాని తీసుకువెళ్ళాలని వారు వెంటనే మీ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. గత శాసన సభ ఎన్నికల మాదిరిగానే స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగ డానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద పోలిసు బందోబస్తును, సిసి కెమెరాలను, వీడియో కెమెరాలను, మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పోలింగ్ రోజున కౌంటింగ్ చేసి అదే రోజున ఫలితాలను తెలపవలసి వుంటుంది. కనుక సిబ్బంది అప్రమత్తంగా వుండి ఎలాంటి పొరపాట్లు జరుగకుండా సక్రమంగా విధులను నిర్వహించాలని కోరారు. ఆర్డివో జి.నరేందర్, ఇంచార్జి లక్ష్మీ నారాయణ, ఎంపిడివోలు, జోనల్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం కాపాడడం మన బాధ్యత



విశాలాంధ్ర-తొర్రూరు : పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రజాస్వామ్య పరిరక్షణ మనందరి బాధ్యత అని జిల్లా అడిషనల్ ఎస్పీ గిరిధర్ రావు అన్నారు. ఆదివారం తొర్రూరు నర్సింహులపేట పెద్దవంగర మండ లాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అనంతరం తోరూర్ హైస్కూల్లో ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో శాసన సభ ఎన్ని కలను సమర్థవంతంగా నిర్వహించామని ఆ అనుభవంతో పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో ఏడు మండలాల్లో మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయని అన్నారు దీనిలో భాగంగా తొర్రూరు, నర్సింహులపేట, పెద్దవంగర మండలాల్లో మొత్తం 71 గ్రామ పంచాయతీలు ఉండగా 21 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయినాయని మిగిలిన 51 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరుగుతున్నాయని అన్నారు. ఒక్కొక్క మండలాన్ని ఆరు రూట్ లుగా విభజించి ఒక్కొక్క రూటు కు ఒక ఎస్.ఐ చొప్పున 18 మంది ఎస్ఐలను, ముగ్గురు సీఐలు, ఒక డి.ఎస్.పి, ప్రతి గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేశామన్నారు. గతంలో గ్రామాలలో బైండోవర్ చేసినవారికి ప్రత్యేక సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు . పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జెసి డేవిడ్, డిఎస్పి మదన్ లాల్, ఆర్డీవో ఈశ్వరయ్య, జిల్లా సహాయ ఎన్నికల అధికారి గుండె బాబు, సిఐ వి. చేరాలు, ఎస్ఐ నగేష్ , మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు చేరిన సిబ్బంది, సామాగ్రి

విశాలాంధ్ర-తొర్రూరు : తొర్రూరు పెద్దవంగర మండ లాల్లో సోమవారం జరగ నున్న మొదటి విడత పంచా యతీ ఎన్నికలకు ఏర్పాట్లు అన్ని పూర్తిచేశామని, ఆది వారం రాత్రి అన్ని గ్రామాలకు పోలింగ్ సిబ్బంది సామాగ్రి చేరవేయడం జరిగిందని ఆర్డీవో ఈశ్వరయ్య, జిల్లా ఎన్నికల సహాయ అధికారి గుండె బాబు ఆదివారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. తొర్రూరు మండలంలోని 266 పోలింగ్ స్టేషన్లలో 40 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు తెలిపారు అలాగే పెద్ద వంగర మండలంలోని 172 పోలింగ్ కేంద్రాలలో 22 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోనున్నారని తెలిపారు. పోలింగ్ సామాగ్రిని సిబ్బందిని చేరవేసేందుకు 25 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. తొర్రూరు మండలంలో 361 మంది పి వో లు, నాలుగు వందల మంది ఏ పీ ఓ లు, 30 మంది రిటర్నింగ్ అధికారులను, 331 పోలీస్స్టేషన్లలో 361 పోలింగ్ బాక్స్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటికప్పుడు సమా చారం చేరవేసేందుకు 15 మంది రూట్ ఆఫీసర్లను ఐదుగురు జోనల్ ఆఫీసర్లను నియమించడం జరిగింది అన్నారు. పోలింగ్కు అవసరమైన మెటీరియల్ మొత్తం సిబ్బందికి అందజేశామన్నారు.

సేవ చేసే భాగ్యాన్ని కల్పించండి : అభినవ్‌రెడ్డి



విశాలాంధ్ర-మరిపెడ: ఒక్కసారి అవకాశం కల్పించి గెలిపించి సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి తనయుడు సర్పంచ్ అభ్యర్థి నూలక అభినవ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పురుషోత్త మాయగూడెంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆదరించి ఉంగరం గుర్తుకు ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు కాలం రవీందర్‌రెడ్డి, మెంచు అశోక్‌కుమార్, పటేల్ దుర్గయ్య, గుండగాని సుందర్, గుండగాని బాబు, పొన్నం శ్రీకాంత్, సుమన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు కేంద్రాలను పరిశీలించిన దానకిషోర్



విశాలాంధ్ర-హైదరాబాద్ : జిల్లాలో నిర్వహిస్తున్న ఓటర్ నమోదు కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి ఎం.దానకిషోర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. నగరంలోని సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజవకర్గాల్లోని పోలింగ్ స్టేషన్‌లను ఆయన పరిశీలించారు. విధులకు హాజరుకానీ బూత్ లెవల్ అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జనవరి ఒకటి నాటికి 18ఏళ్ళు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరు జాబితాల్లో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. అర్హత ఉన్నవారు ఓటు హక్కును తప్పక పొందాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు మరో సారి జాబితాలో ఉన్నదిలేనిది పరిశీలించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్, సికింద్రాబాద్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఉప కమిషనర్‌లు పాల్గొన్నారు.

నేడే తొలి సమరం

188 సర్పంచుల జాతకాలు తేలనున్నాయి



విశాలాధ్ర-ఖమ్మం బ్యూరో : ఎన్నికల సామాగ్రితో ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రం గ్రామాలకు తరలి వెళ్లారు. ఎన్నికలు జరుగుతున్న ప్రతి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ఉదయం నుంచే ఎన్నికల సిబ్బంది హడావిడి కనిపించింది. ఎన్నికల నిర్వహణకు కేటాయించిన ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది ఎన్నికల సామాగ్రి తీసుకునేందుకు బారులు తీరారు. సామాగ్రి తీసుకుని గ్రామాలకు తరలి వెళ్లారు. జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు 3 విడతలుగా జరుగుతున్నాయి. తొలి విడత ఎన్నికలు 21న, రెండవ విడత ఈనెల 25న, 3వ విడత ఎన్నికలు ఈ నెల 31న జరగనున్నాయి. నేడు జరగనున్న తొలి విడత ఎన్నికల్లో మొత్తం 188 పంచాయతీలకు గాను 21 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. అవి పోను మిగిలిన పంచాయతీలకు నేడు ఎన్నికలు జరుగుతున్నాయి. ఏకగ్రీవం అయిన పంచాయతీల వివరాలు ఇలా ఉన్నాయి. ముదిగొండ మండలంలోని గోకినేపల్లి అదే మండలంలోని మేడేపల్లి పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. నేలకొండపల్లి మండలంలోని శంకరగిరితండా, ముజ్జు గూడెం, తిరుమల పురం తండా, అప్పల నర్సింహాపురం, సుర్దేపల్లి, పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. తిరుమలాయ పాలెం మండలంలో 3 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఇస్లావత్ తండా, సోలిపురం, గోల్ తండా, ఖమ్మం రూరల్ మండలంలో



తెల్దారు పల్లి ఏక గ్రీవం కాగా, కామేపల్లిలో అత్యధికంగా 7 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. పాత లింగాల, తాళ్లగూడెం, కొత్తలింగాల, లాల్యా తండా, ముచ్చర్ల, రుక్కి తండా, జాస్తిపల్లి, కూసుమంచి మండల పరిధిలో 3 పంచాయతీలు కొత్తూరు, గోన్ల పాడు తండా, ధర్మా తండా ఏకగ్రీవం అయ్యాయి. కాగా ఇవి పోను నేడు మిగిలిన పంచాయతీల్లో హోరాహోరీగా ఎన్నికలు జరుగుతున్నాయి.

చిత్ర విచిత్రమైన పొత్తులు....

గ్రామాల్లో పంచాయతీని దక్కించుకునేందుకు రాజకీయ పార్టీలు చిత్ర విచిత్రంగా పొత్తులు పెట్టుకున్నాయి. సహజంగానే సాధారణ ఎన్నికలకు భిన్నంగా స్థానిక ఎన్నికలు జరుతాయంటారు. అది నిజమే అని చెప్పవచ్చు. ముదిగొండ మండలంలో విచిత్రమైన పొత్తులు కనిపించాయి. మండల కేంద్రమైన ముదిగొండ పంచాయతీలో టీఆర్ఎస్, కాంగ్రెస్ కలసి పోటీలో ఉన్నాయి. వెంకటాపురంలో సీపీఎం, కాంగ్రెస్, లక్ష్మీపురంలో టీడీపీ, కాంగ్రెస్, చిరుమర్రిల్లో సీపీఎం, కాంగ్రెస్, పమ్మి గ్రామంలో ప్రజాకూటమి పక్షాలు పోటీలో ఉన్నాయి. కాగా మల్లన్న పాలెంలో సీపీఎం, కాంగ్రెస్, వనంవారి కిష్టాపురంలో కాంగ్రెస్, టీఆర్ఎస్ కలసి పోటీ చేస్తు న్నాయి. ఇక కమలా పురంలో టీడీపీ, టీఆర్ఎస్ పొత్తు పెట్టుకున్నాయి.

ఏకగ్రీవంలో ఏ పార్టీకి ఎన్ని....

ఏకగ్రీవం అయిన పంచాయ తీల్లో పార్టీలు చెప్పే ప్రకారం గులాబీ పార్టీ టిఆర్‌యస్‌కు 11, కాంగ్రెస్‌కు 8, సీపీఎంకు 1, తెదేపాకు 1 వచ్చాయి. ప్రస్తుతం ట్రెండ్ ను బట్టి చూస్తే తొలి విడతలో టీఆర్ఎస్ మెజారిటీ పంచాయతీలు గెలుచుకునే పరి స్థితి కనిపిస్తోందని పరిశీలకులు అంటు న్నారు. అయితే పొత్తులు విచిత్రంగా ఉన్నందున ఏ పార్టీకి ప్రజలు పట్టం కట్టారో అర్థం కావడం కష్టమని కూడా వారంటున్నారు. ఎన్నికల నిర్వహణకు పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి : కలెక్టర్



విశాలాంధ్ర-జగిత్యాల బ్యూరో : జగిత్యాల జిల్లాలోని మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా బుగ్గారం, ధర్మపురి, మండ లాల్లో జరుగు ఎన్నికల కొరకు ధర్మపురి మండలం ప్రభుత్వ జూనియర్ కళా శాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రి బ్యూషన్ సెంటర్‌ను ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.శరత్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికలు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగిన విధంగా స్వేచ్ఛా యుత వాతావరణంలో ఎన్నికలను జరుప నున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను చేసిందని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా సిబ్బంది కేటాయించిన పోలింగ్ స్టేషన్‌కు సంబం ధించిన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, వాటి గుర్తులు, శిక్షణలో ఇచ్చిన పుస్తకాలు, తదితర మెటీరియల్‌ను సరిగ్గా ఇక్కడే చూసుకోవాలని, పి.ఓ. డైరీ రాయాలని, గ్రామ పంచాయతీ ఎన్నికలు క్రియాశీలమైన పని అన్నారు. మొదటి విడత ఎన్నికలు తేది: 21-01-2019 ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై ఒంటి గంట వరకు కొనసాగుతుందని అనంతరం అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి కౌంటింగ్ ప్రారంభించి అదే రోజు ఫలి తాలను ప్రకటించవలసి ఉన్నందున అధికారులు జాగ్రత్తగా విధులను నిర్వ హించాలని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో పోలిసు బందో బస్తు, సీసీ కెమెరాలు, వీడియో కెమెరాలు, వెబ్ కాస్టింగ్ చేస్తున్నట్లు తెలి పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల విధు లను సక్రమంగా నిర్వహించాలని కోరారు. అదేవిధంగా ఎన్నికలు నిర్వహించు సిబ్బంది వారి విధులపై పూర్తి అవగాహనను కలిగి ఉండాలని, బ్యాలెట్ బాక్సులను తెరవడం, మూయడం, లాక్ వేయడం, సీల్ ఏవిధంగా వేయాలి మరోసారి చూపించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జి.నరేందర్, ఇంచార్జి డీపీఓ లక్ష్మీ నారాయణ, ఎంపీడీఓలు, తహశీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

భారీ బందోబస్తు : సీపీ



విశాలాంధ్ర-నిజామాబాద్ బ్యూరో : ఆర్మూర్ రెవెన్యూ డివిజన్‌లో ఈనెల 21న గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు గాను అన్నిరకాలుగా పకడ్బంధీగా భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పోలీసు కమీషనర్ కార్తీకేయ తెలిపారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, ముఖ్యంగా గొడవలు సృష్టించే వ్యక్తులపై తమ దృష్టి ఉందని, ప్రజలు పోలీసుశాఖ పట్ల ఎంతో స్నేహాభావంతో నమ్మకంతో ఉంటారని, ఎవ్వరికైనా శాంతిభద్రతలకు సమస్య ఏర్పడితే, స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు ఫోన్ చేయాలని, ఎన్నికల సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఎల్లప్పుడు పోలీసులకు సహకరించాలన్నారు. 1405 పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.

చిన్న 'పంచాయతీ'ల్లో రాజకీయ రగడ

మంగయ్య బంజర్‌లో టీఆర్ఎస్‌కు గడ్డుకాలం

విశాలాంధ్ర-భద్రాద్రి, చంద్రుగొండ : మండలంలోని అతిచిన్న పంచాయతీగా కొనసాగుతున్న మంగయ్యబంజర్ గ్రామంలో రాజకీయ ప్రతిష్ఠల మధ్య ఎన్నికలు కొనసాగుతున్నాయి. అధికార టీఆర్ఎస్ పార్టీకి చెందిన మండల అధ్యక్షుడు భోజ్యా నాయక్ సొంత గ్రామపంచాయతీ కావడంతో సహజంగానే అందరి దృష్టి దీనిపై పడింది. పంచాయతీల పునర్విభజనలో భాగంగా అచ్చం లంబాడా గిరిజనులు నివసించే ఈ గ్రామం చిన్న పంచాయతీగా అవతరించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో తొలుత గ్రామస్థులంతా కలిసి ఏకగ్రీవం చేసుకునేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. 496మంది ఓటర్లు కలిగిన ఈ కొత్త పంచాయితీలో 8 వార్డులున్నాయి. దశాబ్దాల తరబడి భోజ్యా నాయక్ ప్రభావం ప్రతి ఎన్నికల్లోను కనిపించేది. సొంతగ్రామంలో తన సామాజిక వర్గాన్ని దాదాపుగా ఆయన ఏకతాటిపై నడిపించి విజయం సాధిస్తూ వచ్చారు. కానీ గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ గ్రామానికి చెందిన ఓట్లను టీఆర్ఎస్‌కు 241 పోల్ కాగా మిత్రకూటమి ఎమ్మెల్యే 210 ఓట్లు పడ్డాయి. దీంతో ఈ గ్రామం ఆ సామాజిక వర్గంలో మార్పులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జరుగుతున్న తొలి పంచాయతీ ఎన్నికల్లో జయాపజయాలను దృష్టిలో పెట్టుకొని భోజ్యా నాయక్ ఒక మెట్టు దిగి తొలుత ఏకగ్రీవ ప్రతిపాదనాలను ఆమోదించారు. కాంగ్రెస్ కూటమి, గ్రామంలోని మెజార్టీ జనాలు ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఉన్న గుగులోత్ సునీతను సర్పంచ్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకుందామని భావించారు. ముందు సరేనన్న టీఆర్ఎస్ నాయకులు తర్వాత ప్లేటు ఫిరాయించినట్లు తెలుస్తుంది. దీంతో ఎన్నికలు అనివార్యమైయ్యాయి. గ్రామం నుండి ప్రస్తుతం ఇండిపెండెంట్ అభ్యర్థిగా సునీత బరిలో ఉండగా టీఆర్ఎస్ మద్దతుతో భూక్య సరోజను ప్రత్యర్థిగా నిలిపారు. కాగా మొదటి ఒప్పందంలో భాగంగా 8వార్డుల్లో కూటమి, టీఆర్ఎస్ నాయకులు చెరిసగం పంచుకున్నారు. దీంతో వార్డుల వరకు ఏకగ్రీవం జరిగింది. రెండవ విడత ఎన్నికల్లో భాగంగా ఈ నెల 25న ఈ పంచాయితీలో పోలింగ్ జరగనుంది. దీంతో సర్పంచ్ అభ్యర్థుల వరకు తీవ్ర పోటీ నెలకొంది. గ్రామంలో ఎవర అంచనాలు వారికున్నాయి. భోజ్యా నాయక్ అంత సులువుగా తొలిసారి ఏర్పడ్డ తన స్వగ్రామ పంచాయితీని కోల్పోకుండా గెలుపు కోసం తన రాజకీయ అనుభావాన్నంతా వడ్డిస్తున్నారు. రాజకీయ వ్యూహాలకు ఈయన పెట్టింది పేరుగా ఉన్నారు. దీనికి భిన్నంగా ఇతని ప్రత్యర్థి వర్గం కూడా చాలా ఎత్తుగడలతో సర్పంచ్ పదవీ గెలుచుకోవాలని ప్రతి ఓటరును వ్యూహాత్మకంగా తమవైపు తిప్పుకుంటున్నారు. ఎవరు గెలిచిన 30లోపు ఓట్ల మెజార్టీయే సాధించే అవకాశముందని ఇక్కడి పరిస్థితులు అద్దం పడుతున్నాయి. మండలవ్యాప్తంగా రాజకీయ నాయకుల దృష్టంతా ఈ పంచాయతీవైపే ఉంది.

అసెంబ్లీ నిరవధిక వాయిదా



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. చివరిరోజు ఆదివారం ఉదయం 10.30 గంటలకు స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి సమావేశాలు ప్రారంభిం చారు. ముందుగా సత్తుపల్లి నుంచి ఎన్నికైన టీడీపీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య ప్రమాణం చేశారు. కాంగ్రెస్ సీఎల్పీ నేతగా ఎంపికైన మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కను ప్రతిపక్ష నేతగా పోచారం శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్‌ను ప్రధాన ప్రతిపక్షంగా గుర్తిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. భట్టి విక్రమార్కను సీఎల్పీ నేతగా ప్రకటించడంతో సీఎం కేసీఆర్ ఆయనను అభినందించారు. ఎంఐఎం పక్ష నేతగా అక్బరుద్దీన్ వ్యవహరిస్తారని స్పీకర్ ప్రకటించారు. అనంతరం గవర్నర్ నరసింహన్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ ప్రారంభమైంది. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదం తెలిపే తీర్మానాన్ని కొప్పుల ఈశ్వర్ ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బలపరిచారు. కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాలా, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చర్చను కొనసాగించారు. కేసీఆర్ చర్చలో పాల్గొని ప్రసంగించారు. మరోవైపు శాసనమండలిలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదం తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టగా ఎమ్మెల్సీ బోడికుంటి వెంకటేశ్వర్లు బలపరిచారు. హోంమంత్రి మహమూద్ అలీ చివరగా ప్రభుత్వం తరపున సమాధానం చెప్పారు. అనంతరం రెండు సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

భారీగా బంగారం స్వాధీనం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీ బంగారం పట్టుబడింది. ఆదివారం ఉదయం తనిఖీలు నిర్వహించిన అధికారులు ఇండోర్ నుంచి వచ్చిన ప్రయాణీకుడి కాలి బూట్లలో విదేశీ మార్కు గల బంగారపు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. షార్జా నుంచి త్రివేండ్రం వెళుతున్న మరో ప్రయాణికుడి దగ్గర కూడా అధికారులు బంగారాన్ని సీజ్ చేశారు. ఇద్దరు ప్రయాణికుల్ని అరెస్ట్ చేసిన పోలీసులు స్మగ్లింగ్ వెనుక ఎవరున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సీజ్ చేసిన బంగారం రెండు కేజీల వరకు ఉంటుందని, విలువ రూ.66 లక్షల 27 వేల వరకు ఉండొచ్చని చెబుతున్నారు. ఈ మధ్య కాలంలో ఎయిర్‌పోర్టులో తరచూ బంగారం బయటపడుతూనే ఉంది.

టీఆర్ఎస్ మ్యానిఫెస్టోలా ఉంది : చాడ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: శాసనసభలో గవర్నర్ ప్రసంగం టీఆర్ఎస్ మ్యానిఫెస్టోలాగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు. సాధారణంగా గవ ర్నర్ ప్రసంగాలలో నా ప్రభుత్వం అనడం ఆనవాయితీ అని, కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం అనడం ఏమిటని ప్రశ్నించారు. గవ ర్నర్ ప్రసంగంలో ఎక్కడా ప్రభుత్వోద్యోగాల భర్తీ ఉసేలేకపో వడం దారుణమని తెలిపారు. ఐదేళ్లలో లక్షకు పైగా ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న వాగ్దానం గురించి మరిచిపోయారని, ప్రభుత్వోద్యోగులకు పీఆర్సీ, రిటైర్ మెంట్ వయసును 61 సంవత్సరాలకు పెంచడం వంటి హామీలు ఎప్పటి నుండి అమలు చేస్తారో చెప్పలేదన్నారు. భూప్రక్షాళన తప్పుల తడకగా మారిందని, దాదాపు 94శాతం భూ ములకు యాజమాన్య హక్కులు వచ్చింది అనడం పచ్చి అబద్ధమన్నారు. ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు, పట్టా భూములకు సంబంధించిన వేలాది కేసులు ఇప్పటికీ కోర్టులో మూలుగుతున్నాయని, రెవెన్యూ చట్టాలలో మార్పు లేకుండా భూ ప్రక్షాళన అసాధ్యమన్నారు. విచ్చల విడిగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంపై ఎలాంటి వ్యాఖ్య చేయకపోవడం దురదృష్టకరమన్నారు. గతంలో అనేకమార్లు ఖరీదవుతున్న వైద్యం గురించి మాట్లాడిన గవర్నర్ ఆ అంశాన్ని ప్రసంగంలో ప్రస్తావించలేదన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల ధరల నియంత్రణపై సూచన చేయలేదని, ఆరోగ్యశ్రీ పథకం క్రింద ఉన్న ఆసుపత్రి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి ప్రస్తావన లేకపోవడం దారుణమన్నారు.

22న సినీనటి జమునకు పురస్కారం

విశాలాంధ్ర-హైదరాబాద్ (కల్చరల్): వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 22న శ్రీత్యాగరాయ గానసభలో జరుగనున్న కార్యక్రమంలో ప్రజానటి, కళాభారతి డా.జమునా రమణారావుకు ఎన్టీఆర్-ఏఎన్ఆర్- వంశీ జీవిత సాఫల్య పురస్కారం, వెండి కిరీట ధారణతో వైభవంగా సత్కరిస్తున్నట్లు వంశీ సంస్థల అధ్యక్షురాలు పత్రికా ప్రకటనలో తెలిపారు. పలు రంగాల ప్రముఖులు డా.కె.రోశయ్య, రుద్రరాజు పద్మరాజు, రేలంగి నరసింహారావు, నటీమణులు గీతాంజలి, రోజారమణిలు అతిథులుగా వస్తున్నారన్నారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్ చిత్రగీత విభావరి అలరింపనున్నదని ఆమె తెలిపారు.

ప్రమాదంలో ఉస్మానియా భవనం: రాజాసింగ్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఉస్మానియా ఆసుపత్రి భవనం చాలా ప్రమాదకరంగా ఉందని బీజేపీ సభ్యులు రాజాసింగ్ అన్నారు. ఆసుపత్రిని ఆధునికంగా నిర్మిస్తామన్నారని, ఆ హామీ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం సందర్భంగా చేపట్టిన చర్చలో ఆయన మాట్లాడారు. ఉస్మానియా ఆస్పత్రిలో వైద్యులు హెల్మెట్లు పెట్టుకుని తిరిగే పరిస్థితి ఉందని రాజాసింగ్ అన్నారు. కొందరు ఏ పార్టీ అధికారంలోకి వస్తే వారితో వెళ్తున్నారని, అవకాశవాద పార్టీకి అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి బాగానే గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కంటి వెలుగు పథకం ఉద్దేశం మంచిదే కానీ ఇప్పటివరకు ఎంతమందికి శస్త్ర చికిత్సలు చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని ప్రశంసిస్తూనే మాదక ద్రవ్యాల(డ్రగ్స్) కేసు ఏమైందని, ఆ కేసు దర్యాప్తు ఎందుకు అర్ధాంతరంగా ఆగిపోయిందని నిలదీశారు. క్రికెట్ బెట్టింగ్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టిందో చెప్పాలన్నారు. కేసీఆర్ హామీ మేరకు ధూల్‌పేటలో సారా తయారీ ఆపేశారని, సారా తయారీ కుటుంబాలను ఆదుకోవాలని రాజాసింగ్ ప్రభుత్వాన్ని కోరారు.

మంత్రులు లేని పాలన ఇంకెన్నాళ్లు?

గండ్ర సూటిప్రశ్న



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :

ఎన్నికలు పూర్తయి నెలరోజులు గడిచినా ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తి స్థాయిలో ప్రభుత్వాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. ఆదివారం శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణ జరగకపోవడంతో పాలన కుంటుపడే ప్రమాదం ఉందన్నారు. గవర్నర్ ప్రసంగం ఎన్నికల్లో కేసీఆర్ ప్రసంగాన్ని తలపించిందని ఆయన ఎద్దేవా చేశారు. రుణమాఫీ ప్రక్రియపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని డిమాండు చేశారు. ఏకకాలంలో రుణాలు మాఫీ చేస్తే రైతులకు మేలు కలుగుతుందని గండ్ర వెంకటరమణారెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. గతంలో రుణమాఫీ నాలుగు విడతల్లో చేయడం వల్ల రైతులు నష్టపోయారన్నారు. దాదాపు 94 శాతం భూములు యాజమాన్యాలకు హక్కులు వచ్చినట్లు గవర్నర్ ప్రసంగంలో పేర్కొనడం సత్యదూరమని, ఆయా గ్రామాల్లో 30 నుంచి 40 శాతం మంది రైతులకు పాస్ పుస్తకాలు అందాల్సి ఉందన్నారు. భూప్రక్షాళన తప్పుల తడకగా మారిందన్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌లో, రెండు పడకగదుల ఇళ్ల పథకంలో తీవ్రమైన జాప్యం జరుగుతోందని, దీనివల్ల ప్రజల సొంతింటి కల నెరవేరలేదన్నారు. రైతుబీమా చెల్లింపు దస్త్రాలు చాలావరకు పెండింగ్‌లో ఉన్నాయని, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో మిర్చి రైతులకు గిట్టుబాటు ధర దక్కక నష్టపోతున్నారని చెప్పారు. పింఛన్లు పెంచుతామని ప్రకటించిన ప్రభుత్వం, వాటిని ఎప్పటిలోగా అమలు చేస్తుందో చెప్పాలని డిమాండు చేశారు.



అశ్రునయనాల మధ్య నరసింహయ్యకు అంతిమ వీడ్కోలు

విశాలాంధ్ర - కర్నూలు కలెక్టరేట్ : తొలితరం కమ్యూనిస్టు, సీపీఐ(ఎం) సీనియర్ నేత టీ నరసింహయ్య భౌతికకాయానికి ఆదివారం కర్నూలు వీధుల్లో అశ్రునయనాల మధ్య కమ్యూనిస్టు కార్య కర్తలు, అభిమానులు, ప్రజలు అంతిమ వీడ్కోలు పలికారు. కర్నూలు కొత్తబస్టాండ్ సుందరయ్యభవన్ నుంచి మొదలైన నరసింహయ్య అంతిమయాత్ర రాజ్‌విహార్, కిడ్స్‌వరల్డ్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌మీదుగా జమ్మిచెట్టు శ్మశానవాటిక వరకు సాగింది. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత సుందరయ్యభవన్ వద్ద సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు బీ శ్రీనివాసరావు, ఎంఏ గఫూర్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బీ.గిడ్డయ్య, తెలంగాణ రాష్ట్ర సీపీఐ(ఎం) నాయకులు వెంకట్, నవ తెలంగాణ సంపాదకులు వీరయ్య, బీజేపీ రాష్ట్ర నాయకులు కపిలేశ్వరయ్య తదితరులు నరసింహయ్య భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం సంతాపసభలో నరసింహయ్య పోరాట ఘట్టాలను, పేదల హక్కుల కోసం ఆయన చేసిన కృషిని నేతలు కొనియాడారు.



రాజ్యాధికారం కోసం బీసీలంతా ఏకతాటిపైకొద్దాం

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : భారత రాజ్యాంగంలో బీసీలకు అనేక హక్కులు కల్పించినప్పటికీ అమలులో పాలకులు వైఫల్యం చెందారని, ఇప్పటికైనా బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారం సాధించాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు దేరంగుల ఉదయ్‌కిరణ్ తెలిపారు. బీసీల హక్కుల సాధన కోసం ఆదివారం విజయవాడ ధర్నా చౌక్‌లో బీసీలు ధర్మదీక్ష చేపట్టారు. రాష్ట్రం నలుమూలల నుంచి బీసీ సంఘ నాయకులు తరలివచ్చారు. ముఖ్యఅతిథిగా ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బీసీలకు 100 శాసనసభ నియోజకవర్గాలు, 15 ఎంపీ సీట్లను కేటాయించాలన్నారు. బీసీ జాబితాలో 149 కులాల్లో నేటికీ అసెంబ్లీలో అడుగు పెట్టని వడ్డెర, రజక, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ, నాయీ బ్రాహ్మణ, మేదర ప్రతినిధులకు రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చట్టసభల్లో 50 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కులవృత్తుల ఆధారంగా జీవిస్తున్న బీసీల్లో 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలన్నారు. బీసీ సబ్‌ప్లాన్ కింద రూ.50 వేల కోట్ల నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీఎస్.ప్రసాద్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు తోటేటి శ్రీకాంత్, నాయకులు బాలాజీ ప్రసాద్, మల్లి, నిర్మల, కామాచార్యులు, బాలాంజనేయులు, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై అధికారుల ఒత్తిడి వద్దు



విశాలాంధ్ర - విజయవాడ కల్చరల్ : ఆలయాల్లో నిత్యం ధూపదీప నైవేద్యాలు పెడుతూ అంకితభావంతో పనిచేస్తున్న అర్చకులపై దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఒత్తిడి తీసుకురావద్దని రాష్ట్ర దేవదాయశాఖ సలహాదారు చెరువు కోటయ్య సూచించారు. విజయవాడలోని మాచవరం ఆది శైవ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆది శైవ అర్చక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా కోటయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దేవదాయశాఖ ఆధ్వర్యంలోని ఆలయాలలో ప్రతి అర్చకునికి కనీస వేతనం పదివేల రూపాయలు చెల్లించేందుకు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుముఖత వ్యక్తం చేశారన్నారు. కొన్ని దేవాలయాల అంతరాలయంలో ఎక్కువ సేపు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు అనారోగ్యం పాలవుతున్న నేపథ్యంలో అందరికీ ఆరోగ్య బీమా, ఆలయాల సమీపంలోనే గృహ వసతి కల్పించేలా ప్రభుత్వం త్వరలో ప్రకటన చేయనుందని తెలిపారు. అర్చకులు ఎదురుచూస్తున్న వంశపారంపర్య అర్చక విధానానికి త్వరలో జీవో నంబరు 64 ద్వారా అర్హులందరికీ ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. అన్ని జిల్లాల అర్చకులతో సమావేశాల అనంతరం సమస్యలను నివేదిక రూపంలో దేవదాయశాఖ ఉన్నతాధికారులకు వివరించడం ద్వారా పరిష్కరిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ జీవీ హనుమంతరావు మాట్లాడుతూ సొసైటీలో సభ్యత్వం పొందటం ద్వారా రుణ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల అర్చకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆది శైవ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బహుజనుల ప్రగతి



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజ్యాధికారం చేతికొస్తేనే సమాజంలో అసమానతలు తొలగి అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ దిశగా రానున్న ఎన్నికల్లో సంఘటితం కావాలని రాజ్యాధికార పార్టీ జాతీయ అధ్యక్షులు వి.జి.ఆర్ నారగోని తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నారగోని మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా అన్ని స్థానాల నుంచి రాజ్యాధికార పార్టీ అభ్యర్థులు పోటీ చేసేలా ప్రణాళిక తయారు చేస్తున్నామన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలపై ప్రజలకు విశ్వాసం లేకుండా పోయిందన్నారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన ప్రజాప్రతినిధులు స్వార్థ రాజకీయ ఎత్తుగడలతో కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారన్నారు. బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాధికారంలో స్థానం లేకుండా కేవలం ఓటు బ్యాంకు కార్య కర్తలుగానే చూస్తున్నారన్నారు. రాజధాని నిర్మాణం పేరుతో పేదల భూములను లాక్కున్న ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం బాధాకరమన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో బలహీనవర్గాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు చెబుతున్నా సక్రమంగా ఖర్చు చేస్తున్న దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో రెండు అగ్రవర్ణ సామాజికవర్గాలు మాత్రమే అధికారంతో పాటు అన్నింటినీ అనుభవిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా బలహీనవర్గాలంతా ఏకతాటిపైకి వచ్చి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాజ్యాధికార పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హెచ్.ఎ. సలీం బాషా, నాయకులు పి.ప్రభుసాయి, ఎన్.వీరాంజనేయులు, డీఏఎస్‌ఏ. గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు ఇంధనం అందిద్దాం..

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఎంఎం నాయక్

విశాలాంధ్ర - తిరుపతి క్రైమ్ : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవుతూ భావితరాలకు మన వనరులను అందించేందుకు కృషి చేయాలని ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ఎం.ఎం. నాయక్ అన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ఆదివారం సైకిల్ డే కార్యక్రమంలో భాగంగా తిరుపతిలో సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. తారకరామ క్రీడా మైదానం నుంచి అలిపిరి గరుడ సర్కిల్ వరకు, తిరిగి తారకరామ క్రీడా మైదానం వరకు సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.ఎం. నాయక్ మాట్లాడుతూ సైకిల్ వినియోగంతో ఆరోగ్య పరిరక్షణతోపాటు కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించుకునేందుకు వీలవుతుందన్నారు. హిందుస్థాన్ పెట్రోలియం రీజనల్ మేనేజర్ జయసూర్య మాట్లాడుతూ వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగిపోవడంతో ప్రజలు కాలుష్యం బారిన పడుతూ రోగాలకు గురవుతున్నారన్నారు. ఇంధన వనరులకు అధికంగా ఖర్చు అవుతుందన్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే భవిష్యత్తు తరాలకు ఇంధనం అందించలేమన్నారు. ప్రజలు సైకిల్ వాడకంపై ఆసక్తి చూపాలని పిలుపునిచ్చారు. సైకిల్ ర్యాలీలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వనజ, ఏపీఎస్పీఎఫ్ బలగాలు, హెచ్‌పీ సేల్స్ ఎగ్జిక్యూటివ్ రాజశేఖర్, డిస్ట్రిబ్యూటర్లు, అవుట్ లెట్ డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.



సబ్‌ప్లాన్ ఊళ్ల ఉసురు తప్పదు

- అత్యంత దుర్భర స్థితిలో గిరిజనుల జీవనం
- గ్రామాల్లో కానరాని మౌలిక సదుపాయాలు
- రోడ్లు లేవు.. వైద్యం అందదు.. ఆర్టీసీ బస్సు రాదు
- నిధులు దారిమళ్ళిస్తూ తీరని ద్రోహం

విశాలాంధ్ర ప్రతినిధి - కాకినాడ : తరాలు మారుతున్నాయి.. పాలకులూ మారుతున్నారు.. ఆ గిరిజనుల గోడు వినేవారు కానరావడం లేదు. వారసత్వంగా వెంటాడుతున్న పేదరికం, నిరక్షరాస్యత ఆ ఆదివాసీయుల జీవితాలను నేటికీ అంధకారంలోనే ఉంచుతున్నాయి. కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామని పాలకులు పదేపదే చెబుతున్నా ఆ నిరుపేదల నివాస ప్రాంతాల్లో కాలిబాట రోడ్లలో కనీసం రాయిముక్క వేసే నాథుడు లేకపోవడం అభివృద్ధిలో వివక్షే. ఇది తూర్పుగోదావరి జిల్లా సబ్‌ప్లాన్ ఏరియాలోని సుమారు 45 గిరిజన గ్రామాల దుస్థితి. ఆ గ్రామాల్లో నేటికీ సరైన రోడ్లు లేవు. ఆర్టీసీ బస్సులు వెళ్ళవు. కనీస వైద్యం అందదు. మంచినీళ్ళూ దొరకవు. విద్యుత్ వెలుగులూ అంతంతమాత్రమే. ఊరు దాటాలంటే కాలినడకే. హామీలు గుప్పిస్తున్న పాలకులు తర్వాత ఆ గ్రామాల జోలికి వెళ్లడంలేదు. మళ్లీ ఎన్నికల సమయంలోనే ఆ గిరిజనుల మొఖం చూసేది. రాష్ట్రవ్యాప్తంగా వేల కిలోమీటర్లు రోడ్లు వేసేశామని, ఉన్నత వైద్యం అందిస్తున్నామని, ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు వెళుతుందనే ప్రకటనలు ఇక్కడ అపహాస్యానికి గురవుతున్నాయి. ఓసారి ఆ గిరిజన గూడేల పరిస్థితులను పరిశీలిస్తే..

తూర్పుగోదావరి జిల్లాలోని శంఖవరం, రౌతులపూడి, కోటనందూరు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లోని సుమారు 45 గిరిజన గ్రామాలు ఈ ఉపప్రణాళికా (సబ్ ప్లాన్) ప్రాంతాలు. శంఖవరం మండలంలోని అనుమర్తి, ఆవెల్తి, ఒండేగుల, గుమ్మరేగుల, డి పోలవరం, పి మల్లాపురం, రాజవరం, రౌతులపూడి మండలాల్లోని జర్దాం, దబ్బాక, ధనబంధ, గుండుసేరు, గ్రామాల్లో కనీస సౌకర్యాలు కానరావడం లేదు. విద్య, వైద్యం, భూ పరిరక్షణ హక్కు, రోడ్లు, తాగునీరు, విద్యుత్, పక్కా గృహాలు వంటి ప్రభుత్వ పథకాల ఫలితాలు ఈ గ్రామాల్లో కనిపించడం లేదు. కనీసం శుద్ధి చేసిన తాగునీటి సదుపాయాలు లేవు. కొన్ని గ్రామాల గిరిజనులకు సెలయేరు నీరే దిక్కు. వేసవిలో తాగునీటి సమస్య మరింత తీవ్రరూపం దాల్చుతుంది.

ఆదుకోని ఐటీడీఏ

సబ్‌ప్లాన్ గ్రామాలను గిరిజన అభివృద్ధి సంస్థ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మాకు సంబంధం లేదన్నట్టు అధికారులు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ఏటా ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామంటున్నా ప్రగతి జాడ లేదు. రెండేళ్ళ క్రితం పోడు భూముల సాగుకు రూ.35 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించినా ఒక్క రూపాయి ఖర్చు కాలేదు. సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మైదాన ప్రాంతాల్లో ఖర్చు చేసి సబ్‌ప్లాన్ ఏరియాలో వినియోగించినట్టు అధికారులు చెబుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ నిధులను మైనింగ్ మాఫియా అవసరాలకు మళ్లిస్తున్నారని జనం వ్యాఖ్యానిస్తున్నారు.

రోడ్లు లేక నరకయాతన

శంఖవరం మండల కేంద్రం నుంచి పెదమల్లాపురం, వేళంగి వరకూ రోడ్డు అత్యంత దారుణ పరిస్థితుల్లో ఉంది. ఐదేళ్ళుగా జనం నరకం చూస్తున్నా పాలకుల హామీలు తప్ప ఆచరణలో లేదు. గతంలో 50 గ్రామాల రాకపోకలకు 18.7 కిలోమీటర్ల మేర రోడ్డు ఉండేది. దీని అభివృద్ధికి కాగితాల్లో రూ.6 కోట్ల 30 లక్షలు కేటాయించారు. పనులు మాత్రం జరగవు. టెండర్లు వేశామని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నప్పటికీ జనం నమ్మలేని పరిస్థితి. గతంలో ఇక్కడ పనిచేసిన కలెక్టర్ అరుణ్‌కుమార్ వేళంగి గ్రామాన్ని సందర్శించి ప్రజల ఇబ్బందులను కళ్ళారా చూసి అయిదు నెలల్లో రోడ్డు వేస్తానని హామీ ఇచ్చారు. ఆయన బదిలీ అయి కొత్త కలెక్టర్ వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా రోడ్డు మాత్రం వేయలేకపోయారు.

వాగులు దాటాల్సిందే

సబ్‌ప్లాన్ ఏరియాలోని 45 గ్రామాల్లో కొన్ని ఊళ్లకు వెళ్ళాలంటే లోయల వెంబడి కొండలు, గుట్టలు, వాగులు, వంకలు దాటుకుంటూ అడవిదారుల్లో కాలిబాటన నడవాల్సిందే. కొండలపై గిరిజనులు శ్రమదానంతో గ్రామాలకు మధ్య సొంతంగా వేసుకున్న కాలిబాటలే దిక్కు. పాలకులు మారినా వీరి రోడ్డు బాధలు తీరడం లేదు. కొన్ని గ్రామాలకు అత్యవసర పరిస్థితుల్లో వెళ్ళాలంటే ఆటోలకు వందలాది రూపాయలు ఖర్చు చేయాల్సిందేనంటున్నారు.

ఆస్పత్రులున్నా.. సిబ్బంది కొరత

గిరిజన ప్రాంతవాసులకు ఏ రోగం వచ్చినా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్ళేందుకు కనీస రహదారి సౌకర్యం లేక నాటు వైద్యమే వాడుతున్నారు. రోగం ముదిరిన తర్వాత ఇతర ప్రాంతాలకు చేరుకున్నా ప్రాణాలను కాపాడుకోలేకపోతున్నారు. గ్రామాల్లో అపరిశుభ్రత గిరిజనులను రోగాల బారినపడేస్తున్నాయి. ఆకు పసర్లతో కాలం గడుపుతున్నారు. పెదమల్లాపురం, రౌతులపూడిలో ప్రజా వైద్యశాలలు, శంఖవరంలో 30 పడకల ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ డాక్టర్లు, సిబ్బంది కొరత అధికంగా ఉంది. గిరిజన గ్రామాలకు దగ్గరగా ఉన్న పెదమల్లాపురం ఆరోగ్య కేంద్రం ఒక్కపూటే పనిచేయడంతో సకాలంలో వైద్యసేవలు అందుకోలేకపోతున్నారు.

జన్మభూమి బహిష్కరణతో నిరసన

మా గ్రామాలకు కనీసం రోడ్లు వేయించలేని అధికారులు, ప్రజాప్రతినిధులు మా ఊళ్లకు రావొద్దంటూ సబ్‌ప్లాన్ పరిధిలోని వేళంగి, కొత్తపల్లి గ్రామాల ప్రజలు ఇటీవల జన్మభూమి కార్యక్రమాలను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. అధికారులను నడిరోడ్డుపైనే నిర్బంధించారు. చెట్లు నరికి రోడ్డుకు అడ్డుగా వేశారు. రోడ్డు వేసినప్పుడే మా గ్రామాల్లో అడుగు పెట్టాలని హెచ్చరించారు.

వచ్చే ఎన్నికలను బహిష్కరిస్తాం

సబ్ ప్లాన్ ఏరియాను ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు. అభివృద్ధి విషయంలో మా ప్రాంతాన్ని దూరం పెడుతున్నారు. నీరు దొరకదు. గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వరు. విద్య అందదు. తాగునీరు లేదు. రోడ్లు లేక నరకం అనుభవిస్తున్నాం. ఆసుపత్రుల్లో డాక్టర్లు ఉండరు. ఎవరిని కలిసినా మా గోడు పట్టించుకోవడం లేదు. విసుగుచెందిన జనం జన్మభూమి సభలను బహిష్కరించారు. వచ్చే ఎన్నికలను బహిష్కరించి నిరసన తెలియజేస్తాం.

మునలయ్య, గిరిజనుడు

అట్టహాసంగా ఫ్లెమింగో ఫెస్టివల్

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఆదివారం నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. నేలపట్టులో పక్షుల వీక్షణ కోసం సూళ్లూరుపేట నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఫ్లెమింగో ఫెస్టివల్ బెలూన్‌ను ఎగురవేశారు. ఈ సందర్భంగా మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ మొన్న సంక్రాంతి పండుగ, ఈరోజు పక్షుల పండుగ, రేపు పెన్షన్ల పండుగతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రం కోసం పాటుపడుతున్న చంద్రబాబునాయుడుని మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. లబ్ధిదారులకు ట్రాక్టర్లు అందజేసిన ఆయన ట్రాక్టర్ నడిపి ఉత్సాహం నింపారు. రకరకాల పాములు, చేపలు, కుక్కలు, ఇస్రో రాకెట్ నమూనాలు, శ్రీసిటీ అధినేత రవిసన్నారెడ్డి ఆధ్వర్యంలో కంపెనీల నమూనాలు, చిన్నారుల నృత్యప్రదర్శనలు,



ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ప్రారంభించిన మంత్రి సోమిరెడ్డి

జబర్దస్త్ రాంప్రసాద్‌టీం కామెడీ, షరీఫ్ మిమిక్రీ, జైసింహ సంగీతవిభావరి, వ్యాఖ్యాత చిత్రలేఖ వ్యాఖ్యలు అందరినీ అబ్బురపరిచాయి. కార్యక్రమంలో నెల్లూరు జాయింట్‌కలెక్టర్ వెట్రిశెల్వి, రెండవ జేసీ కమలకుమారి, మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, నాయుడుపేట ఆర్డీవో శ్రీదేవి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ నూలేటి విజయలక్ష్మి, చెంగాళమ్మ సేవాసమితి అధ్యక్షులు ముప్పాల వెంకటేశ్వర్లు, సతీష్‌రెడ్డి, పార్లమెంటు మాజీ సభ్యులు నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండ నిండా కోలాహలం

విశాలాంధ్ర - నరసరావుపేట : కోటప్పకొండ జన సమూహంతో కోలాహలంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రెండు రోజుల కొండ పండుగకు ఆదివారం భారీగా భక్తులు, పర్యాటకులు తరలివచ్చారు. రెండు నెలల ముందే మహా శివరాత్రి పండుగ వచ్చినట్లు కనిపించింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా కొండ పండుగను శని, ఆదివారాల్లో నిర్వహించింది. శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు పర్యవేక్షణలో జిల్లా అధికార యంత్రాంగం కొండపండుగ విజయవంతానికి అన్ని ఏర్పాట్లు చేశారు. పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం, కాలుష్యం నివారణ లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం కోసం కొండ పండుగ నిర్వహిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఈ పండగకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, రాష్ట్ర మంత్రులు అయ్యన్నపాత్రుడు, ప్రత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వరరావు, గంటా శ్రీనివాసరావు, శిద్దా రాఘవరావు, పరిటాల సునీత, నక్కా ఆనందబాబు, ఎంపీ సుజనాచౌదరి, కొనకళ్ళ నారాయణ, మహిళ కమిషన్ ఛైర్మన్ నన్నపనేని రాజకుమారి,



ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ మ్యాని, జిల్లా కలెక్టర్ కోన శశిధర్, ఎన్‌జీవోస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పి.అశోక్‌బాబు తరలివచ్చారు. నృత్య ప్రదర్శనలు, పశు ప్రదర్శన, సంగీత విభావరి, జబర్దస్త్ బృందం కామెడీ, గాయకుల పాడుతా తీయగా పోటీలు, ఉత్తరప్రదేశ్, ఒడిశా కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాల ఫుడ్‌కోర్టులు, హెలికాప్టర్ రైడ్, హాట్ బెలూన్ రైడ్స్, లేపాక్షి హస్తకళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాష్ట్రంలో మొదటిసారి కొండ పండుగను ఆహ్లాదకరంగా, వైభవంగా నిర్వహించారు.

పశువుల అక్రమ తరలింపు

విశాలాంధ్ర - నర్సీపట్నం : విజయనగరం జిల్లా పార్వతీపురం నుంచి పశువులను అక్రమంగా తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తుండగా విశాఖ జిల్లా నర్సీపట్నంలో శనివారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. చిన్న వ్యాన్‌లోని 26 పశువులను నర్సీపట్నం పెదబొడ్డేపల్లి వద్ద తనిఖీలో గుర్తించిన పోలీసులు సూత్రధారి అయిన కాకినాడకు చెందిన బలిరెడ్డి నాగభూషణం అలియాస్ డాన్ శ్రీను, డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నారు. పార్వతీపురంలో పశువులను కొనుగోలు చేసిన వ్యాపారి తెలంగాణ రాష్ట్రం మెదక్‌కు తరలిస్తున్నట్టు టౌన్ సీఐ సింహాద్రి నాయుడు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు. మన్యంలో పశువుల అక్రమ రవాణ



పట్టుబడిన ఆవులు

సూత్రధారిగా డాన్ శ్రీను గతంలోనే పోలీసు రికార్డుల్లో ఉన్నాడు. విశాఖ జిల్లాలోని రోలుగుంట, నర్సీపట్నం, గొలుగొండ, కోటవురట్ల, కేడీపేట, కొయ్యూరు పోలీస్‌స్టేషన్లలో ఈయనపై అనేక కేసులు ఉన్నట్లు సమాచారం.


పట్టపగలు తరలిపోతున్నా..

విశాఖ మన్యం నుంచి మూగజీవాలను పట్టపగలు అక్రమంగా తరలిస్తున్నా అడ్డుకునేవారు కానరాని పరిస్థితి. ఒకప్పుడు గుట్టుగా అర్ధరాత్రి వేళ సాగే ఈ తంపు నేడు పట్టపగలు దర్జాగా సాగిపోతోంది. విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల ఏజెన్సీ రహదారులను దళారులు రాజమార్గాలుగా మలచుకుంటున్నారు. ఈ దారిలో ఆరు పోలీస్‌స్టేషన్లు ఉన్నప్పటికీ నిఘా లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. చిన్న వ్యానులో 30 నుంచి 40 పశువులను కాళ్లుకట్టి బయటకు కనిపించకుండా టార్పాలిన్లు కప్పి తరలించేస్తున్నారు. కాళ్ళు, మెడలకు దగ్గరగా తాళ్ళు కట్టి పడేస్తున్నారు. పట్టుబడిన పశువులను గోశాలలకు తరలించడం, వాహనాలను విడిచిపెట్టడం షరా మామూలు అయ్యిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇక ల్యాప్‌టాప్‌లతో బోధన

- ప్రభుత్వ పాఠశాల పిల్లల్లో స్వీయ అభ్యసనానికి ప్రణాళిక
- మూడు జిల్లాల్లో ప్రయోగాత్మక అమలు

విశాలాంధ్ర - విజయనగరం : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో స్వీయ అభ్యసనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రంలోని విజయనగరం, గుంటూరు, ప్రకాశం జిల్లాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. సాంకేతికతను వినియోగిస్తూ దృశ్య శ్రవణ విధానంలో స్వీయ అభ్యసనాభివృద్ధికి బాటలు వేయనుంది. ఎంపికచేసిన పాఠశాలకు 30 ల్యాప్‌టాప్‌లతో పాటు ఫర్నిచర్ సరఫరా చేయనుంది. ఇప్పటివరకు డిజిటల్ తరగతులు, వర్చువల్ క్లాస్‌లను అమలు చేస్తున్న ప్రభుత్వం ఇటీవల కొన్నిచోట్ల తరగతి గదులను ఏసీలుగా మార్చింది. తాజాగా విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తూ సాంకేతిక నైపుణ్యాలను వెలికితీసేందుకు సరికొత్త విధానం అమలు చేయనుంది. అమలు కోసం ప్రాథమిక సర్వేను పూర్తి చేశారు. దారిద్ర్యరేఖ దిగువన (బీపీఎల్) ఉన్న విద్యార్థులను ఎంపికచేశారు. విజయనగరం జిల్లాలో 20, గుంటూరు జిల్లాలో 20, ప్రకాశం జిల్లాలో 40 పాఠశాలలను ఎంపిక చేయడం విశేషం.



సాంకేతిక నైపుణ్యమే లక్ష్యంగా..

ప్రస్తుతం పోటీ పరీక్షలన్నీ ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కంప్యూటర్ పరిజ్ఞానం పెంపునకు విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ల్యాప్‌టాప్‌ల సరఫరాకు టెండర్లను ప్రభుత్వం ఖరారు చేసినట్లు సమాచారం. 6, 7 తరగతుల విద్యార్థులపై ప్రయోగాత్మకంగా దృష్టిసారించారు. గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులకు సంబంధించిన అంశాలపై ల్యాప్‌టాప్‌ల వినియోగంతో అవగాహన పెంపొందించుకోవాల్సి ఉంది. ల్యాప్‌టాప్‌ల వినియోగంపై శిక్షణకు వారానికి రెండు పీరియడ్లను కేటాయించారు. ప్రతి నాలుగు పాఠశాలలకు ఒక నిపుణుడిని నియమిస్తారు. వారంలో ఒకరోజు విద్యార్థులు అభ్యసించిన అంశాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇప్పటికే డిజిటల్ తరగతులు, వర్చువల్ తరగతుల్లో ఈ రెండు తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ విధానం విజయవంతం అయితే మరో 20 పాఠశాలలను అదనంగా ఎంపిక చేయనున్నారు.



బ్రెయిన్ స్ట్రోక్‌కు తొలి నాలుగు గంటలు కీలకం

విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్) : బ్రెయిన్‌స్ట్రోక్ తర్వాత మొదటి నాలుగైదు గంటల సమయం అత్యంత కీలకమని, సరైన చికిత్స అందిస్తే మళ్లీ సాధారణ జీవనం గడిపేలా చేయవచ్చని అను హాస్పిటల్స్ సీఈఓ డాక్టర్ జి.రమేష్ పేర్కొన్నారు. అను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరో అండ్ కార్డియాక్ సైన్సెస్ ఆధ్వర్యంలో అమరావతి న్యూరో అండ్ కార్డియాక్ అప్‌డేట్ పేరిట బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్, పార్కిన్‌సోనిజం వ్యాధుల చికిత్సకు సంబంధించి ఆదివారం విజయవాడ క్లబ్‌లో జాతీయ సదస్సు జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 500 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. డాక్టర్ జి.రమేష్ స్వాగతోపన్యాసం చేస్తూ న్యూరో, కార్డియాక్ వైద్య విభాగాల్లో అద్భుత ఆవిష్కరణలు చోటుచేసుకున్నాయన్నారు. అత్యాధునిక చికిత్సా విధానాలు, ఆవిష్కరణలపై విస్తృత చర్చ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి ప్రముఖ పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె.దుర్గానాగరాజు, పార్కిన్సన్స్ వ్యాధి చికిత్సా విధానాలపై ప్రముఖ వైద్యులు డాక్టర్ తోట నవీన్, న్యూరో నావిగేషన్ సర్జరీపై ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ ఓసూరి బాలబాలాజీ, ఎపిలెప్సీ అంశంపై డాక్టర్ కె.వంశీకృష్ణ, హార్ట్ ఫెయిల్యూర్, రెసిస్టెంట్ హైపర్ టెన్షన్ తదితర అంశాలపై డాక్టర్ ఎస్.అనిల్‌కుమార్ ప్రసంగించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజయవాడ చాప్టర్ అధ్యక్షులు టి.వి.రమణమూర్తి, కార్యదర్శి సీహెచ్.మనోజ్‌కుమార్ హాజరయ్యారు.

31వ తేదీవరకూ మెమూ రైళ్ల రద్దు

విశాలాంధ్ర - గూడూరు : నెల్లూరు జిల్లా గూడూరు రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాం మరమ్మతులు, ఫుడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా ఈ నెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసినట్లు గూడూరు రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ చెన్నై నుంచి నెల్లూరు, నెల్లూరు నుండి చెన్నై వెళ్లే మెమూ రైలు, నెల్లూరు నుంచి తిరుపతి వెళ్లే రైలును రద్దు చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 30, 31 తేదీల్లో సికింద్రాబాద్ నుంచి గూడూరు వచ్చే సింహపురి రైలు నెల్లూరు వరకు మాత్రమే వస్తుందని, తిరిగి నెల్లూరు నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరి వెళ్తుందని వెంకటేశ్వరరావు వివరించారు.

ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి : కత్తి నరసింహారెడ్డి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని 8లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇంటీరియం రిలీఫ్ (ఐఆర్) వెంటనే ప్రకటించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 11వ వేతన సవరణ స్కేళ్ల అమలలు జాప్యం కారణంగా..ఐఆర్‌తోపాటు పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల ఉత్తర్వులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అడ్‌హాక్ నిబంధనలతో ఉపాధ్యాఉల మేనేజ్‌మెంట్ వారి పదోన్నతుల షెడ్యూలు ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ కమిటీలో తాము చేసిన ఒప్పంద అధ్యాపకులకు మినిమమ్ టైమ్ స్కేలుతోపాటు అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు 40శాతం జేఎల్ పదోన్నతులు, పాఠశాల విద్యాశాఖలో ఇంటర్మీడియట్ విలీనం తదితర సిఫార్సులపై వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండు చేశారు. సీపీఎస్ రద్దు, స్పెషల్ టీచర్ల నోషనల్ ఇంక్రిమెంట్ల జీవోల విడుదలలో జాప్యం కారణంగా ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. సోమవారం జరిగే కేబినేట్ సమావేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వైసీపీకి వంగవీటి రాధా రాజీనామా



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : వైసీపీకి ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ రాజీనామా చేశారు. ఈ మేరకు ఆదివారం పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన లేఖ పంపారు. కొంతకాలం నుంచి పార్టీ కార్యక్రమాలకు రాధా దూరంగా ఉంటున్నారు. ప్రధానంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం సీటు నుంచి ఆయన పోటీ చేయాలని ఆశించగా, దానికి అధిష్టానం అంగీకరించలేదు. ఆదివారం సాయంత్రం విజయవాడలో రాధాతో వైసీపీ అధినేత బొత్స సత్యనారాయణ దాదాపు గంటపాటు చర్చించారు. పార్టీ వీడొద్దని, అధిష్టానం న్యాయం చేస్తుందని రాధాకు భరోసా ఇచ్చారు. బొత్సా వెళ్లిన అర్ధగంటకే రాధా.. వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల్లో తన రాజకీయ భవిష్యత్తును ప్రకటిస్తానని రాధా మీడియాకు వెల్లడించారు. ఈయన జనసేనలో చేరతారా?..టీడీపీ వైపు వెళ్తారా? అనే విషయంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

యువతే మార్గ నిర్దేశకత్వం: గవర్నర్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: భవిష్యత్ ప్రపంచ మార్గ నిర్దేశకులుగా యువత తయారు కావాలని గవర్నర్ ఈఎస్ఎల్.నరసింహన్ పిలుపు నిచ్చారు. యువత అంటే మహిళలు కూడా అనే అంశం మరువకూడదన్నారు. వారిలో ఓపిక, సహనం తక్కువని, అవి అలవర్చుకున్నప్పుడే ఏదైనా సాదించగలమన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో రెండు రోజులపాటు తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సును నిర్వహించింది. ఆదివారం జరిగిన ముగింపు సమావేశానికి గవర్నర్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

బీజేపీ ఓటమే లక్ష్యం (మొదటిపేజీ తరువాయి)

నరేగాను సమర్ధవంతంగా అమలు చేయాలి, పేదలకు విద్య, వైద్యాన్ని అందించాలి, అంటరాని తనాన్ని నిర్మూలించాలి.. అనే నినాదాలతో ఉద్యమిం చాలని నిర్ణయించినట్లు చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తూ అత్యంత ప్రమాద కరంగా తయారైన బీజేపీని గద్దె దించేందుకు విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని పెరియస్వామి అన్నారు. మోడీ హయాంలో 73 శాతం దేశ సంపద ఒక శాతం మంది చేతుల్లోకి వెళ్లిపోయిందన్నారు. యూపీఏ-1 ప్రభుత్వం తీసుకొచ్చిన నరేగా పథకాన్ని ఎన్డీయే ప్రభుత్వం నిధుల లేమి సాకుతో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ నీరు గారుస్తోందన్నారు. ఇదే సమయంలో బడా పారిశ్రామికవేత్తలకు బడ్జెట్‌లో నిధులు కేటాయిం చడమే కాకుండా పన్నుల్లో రాయితీలు కల్పిస్తోందని ఆయన విమర్శించారు. దేశంలో రూ.2.41 లక్షల కోట్ల మొండి బకాయిలు వివిధ బ్యాంకులకు రావాల్సి ఉందని స్వయాన కేంద్రమంత్రి శివప్రసాద్ శుక్లా లిఖితపూర్వకంగా తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. కార్పొరేట్ వర్గాలకు వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తున్న మోడీ ప్రభుత్వం... రైతులు, వ్యవసాయ కార్మికులను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోవడంతో దానిపైనే అధారపడి జీవిస్తున్న 55శాతం మంది నిరుపేదలు ఆర్థికంగా, సామాజికంగా అణచివేతకు గురవు తున్నారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని దేశంపై రుద్దేం దుకు బీజేపీ యత్నిస్తోందన్నారు. ప్రశ్నించేవారిపై భౌతికదాడులకు పాల్పడు తోందన్నారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. కేంద్ర వ్యవస్థలను సైతం దెబ్బతీస్తూ లౌకికవాదానికి తూట్లు పొడుస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని పెరియస్వామి పిలుపునిచ్చారు.

బాబు ఒక్క ఎకరమూ పంచలేదు : రామకృష్ణ

కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వాలు పేదల వ్యతిరేక ప్రభుత్వాలుగా మారాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ఎక్కడా పేదలకు ఒక్క ఎకరం భూమి పంపిణీ చేయలేదన్నారు. కనీసం ఇళ్ల స్థలాలు ఇవ్వడం లేదన్నారు. ఇదే సమయంలో వేలాది ఎకరాల భూములను రైతుల నుంచి లాక్కొని కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. వర్షాభావం వల్ల కరవు విలయ తాండవం చేస్తోందని, దీంతో ప్రజలు అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న 670 మండలాల్లో ఇప్పటికే 347 మండలాలను ప్రభుత్వం కరవు మండలాలుగా ప్రకటిం చిందన్నారు. అయితే ఉపశమన చర్యలేవీ చేపట్టకపోవడంతో వేలాది మంది వ్యవసాయ కార్మికులు గ్రామాలను ఖాళీ చేసి పొరుగునున్న తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళ రాష్ట్రాలకు వలస పోతున్నారని తెలిపారు. ప్రభుత్వం మాటలు చెబుతుందే తప్ప వలసలు ఆపేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదన్నారు. కరవు పీడిత ప్రాంతాల్లో అన్ని రోజులూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని ఆయన డిమాండు చేశారు. నరేగా కోసం అనేక పోరాటాలు చేసిన వ్యవసాయ కార్మికులు, వామపక్షాలు మరోసారి కేంద్రంపై పోరాటానికి సమాయత్త మవుతున్నారని తెలిపారు. అంటరానితనం, పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 26న జరిగే కార్యక్రమానికి సీపీఐ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జల్లి విల్సన్, ఆవుల శేఖర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తిదారుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైనట్లు వివరించారు. ఫిబ్రవరి 26న దేశవ్యాప్త ఆందోళ నల్లో భాగంగా రాష్ట్రంలోని 13 జిల్లాల్లో కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు బండి వెంకటేశ్వరరావు, పి.కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుడు మృతి

విజయనగరం గొట్లాంలో విషాదచాయలు



విశాలాంధ్ర-బొండపల్లి : మరో అగ్రిగోల్డ్ బాధితుడు ఆదివారం మృత్యు వాతపడ్డాడు. తను కట్టిన డిపాజిట్ సొమ్ము రాదే మోనన్న వేధనతో గుండె ఆగి మరణించాడు. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలో ఈ ఘటన జరిగింది. దీంతో ఆ గ్రామంలో విషాధఛాయలు అలముకున్నాయి. వివరాల్లోకి వెళితే... గొట్లాం గ్రామానికి చెందిన మహంతి నారాయణప్పడు(70) తన జీవితాంతం కష్ట పడి, వృద్ధాప్యంలో ఆసరాగా నిలుస్తాయన్న ఆశతో అగ్రిగోల్డులో సొమ్ము దాచుకున్నాడు. తాను పొదుపుచేసిన రూ.3లక్షల రూపాయ లను 2016లో అందివచ్చేలా 2014 సెప్టెం బరు 27న అగ్రిగోల్డులో డిపాజిట్ చేశాడు. ఇంతలో అగ్రిగోల్డు మూతబడటం, డిపాజిట్ దారులకు మొండిచేయి చూపడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. అయినప్పటికీ తన సొమ్ము ఎలాగోలా తిరిగి వస్తుందన్న ఆశతో ఇన్నాళ్లూ ఎదురుచూసి, ప్రభుత్వం రోజుకో విధంగా ప్రకటనలు చేస్తుండటంతో ఆవేదనకు గురై ఆదివారం తెల్లవారుజామున గుండె పోటుతో మరణించాడు. దీంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు. పాలకులు ఇప్పటికైనా స్పందించి అగ్రిగోల్డు బాధితులను ఆదుకొనేందుకు చర్యలు చేపట్టాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాజంపేటలో పొలిటికల్ హీట్

- టీడీపీ వర్సెస్ ఎమ్మెల్యే
- మేడాకు తెలియకుండా సమావేశం
- హాజరైన మంత్రి ఆది, శ్రీనివాసులురెడ్డి
- ఎమ్మెల్యేని ఆహ్వానించకపోవటంపై నిలదీసిన కార్యకర్తలు



విశాలాంధ్ర - రాజంపేట : కడప జిల్లా రాజంపేటలో రాజకీయం వేడెక్కింది. మరో మూడు నెలల్లో సాధారణ ఎన్నికలు జరగనుండగా, అధికార టీడీపీలో వార్ మొదలైంది. రాజంపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మేడా మల్లిఖార్జునరెడ్డి పార్టీని వీడి వైసీపీలో చేరుతున్నారంటూ జరుగుతున్న ప్రచారమే ఇందుకు ఆజ్యం పోసింది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్‌శాఖ మంత్రి సీ ఆదినారాయణరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసులురెడ్డి రాజంపేటలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశమయ్యారు. ఆర్ అండ్ బీ అతిథి గృహంలో జరిగిన సమావేశంలో మాజీ మంత్రి పీ బ్రహ్మయ్య తోపాటు పార్టీ నాయకులు బీ హరిప్రసాద్, జీఎన్ నాయుడు, కుసుమకుమారి తదితరులు పాల్గొ న్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్లిఖార్జునరెడ్డిని ఆహ్వానించకుండా, కనీసం సమాచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహిస్తుం డటంతో మేడా వర్గీయులు భారీగా అక్కడకు వెళ్లి నాయకులను నిలదీశారు. అంతేగాకుండా మేడాకు అనుకూలంగా ఆయన వర్గీయులు గంగి రెడ్డి, దొరబాబు, చొప్పా వెంకటరెడ్డి నినాదాలు చేశారు. దీంతో టీడీపీ నాయకులు, మేడా వర్గీయుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటుచేసుకోవటంతో సమావేశంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. రాజంపేట డీఎస్పీ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను శాంతింప చేయటంతో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. గత ఎన్నికల్లో టీడీపీ నుంచి మేడా మల్లిఖార్జునరెడ్డి ఒక్కరే గెలుపొందారు. తాజాగా ఆయన పార్టీని వీడి వైసీపీలో చేరుతున్నారంటూ ప్రచారం సాగుతోంది. శనివారం ఆయన తన వర్గీయులతో సమావేశమై పార్టీ మార్పుపై చర్చించినట్లు సమాచారం. దీనిపై టీడీపీ అధిష్టానం అప్రమత్తమైంది. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని జిల్లా నాయకులను ఆదేశించింది. అయితే, తాను టీడీపీని వీడటం లేదని, తనకు తెలియకుండా కొందరు పార్టీ నేతలే దుష్ప్రచారం చేస్తున్నారని మేడా ఎదురుదాడికి దిగుతున్నారు. ఈ నేపథ్యంలోనే మంత్రి ఆది నారాయణరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి రాజంపేటలో కార్యకర్తల సమావేశం నిర్వ హించటం ఒక్కసారిగా పార్టీలో అంతర్గత విభేదా లను బహిర్గతం చేసింది. మేడా మల్లిఖార్జునరెడ్డి మొదటి నుంచి వైసీపీకి చెందిన వారికే కాంట్రాక్ట్ పనులను అప్పగిస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో కొంతకాలంగా నియోజక వర్గంలో రెండు గ్రూపుల మధ్య తరచూ విభేదాలు తలెత్తుతూనే ఉన్నాయి. తాను వైసీపీలో చేరుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని మేడా పలుమార్లు ఖండించారు. సీఎం చంద్రబాబు తనకు విప్ పదవిని ఇవ్వగా, తండ్రిని టీటీడీ బోర్డు సభ్యు డుగా నియమించారని, పార్టీకి కట్టుబడి ఉంటానని కూడా చెబుతూ వస్తున్నారు.

హుందాగా బయటకు వెళ్లండి : ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి

రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి పార్టీ మారితే హుందాగా బయటకు వెళ్లాలని మంత్రి సీ ఆది నారాయణరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి అన్నారు. వైసీపీలో చేరికపై జరుగు తున్న ప్రచారాన్ని ఖండించాలని పలుమార్లు కోరినా మేడా స్పందించ లేదన్నారు. పార్టీ నుంచి ఒకరిద్దరు బయటకు వెళ్లినంత మాత్రానా నష్టమేమీ ఉండదని పేర్కొన్నారు. ఈ నెల 22న అమరావతిలో సీఎం చంద్రబాబు రాజంపేట నియోజకవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఆ సమా వేశంలో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

అవన్నీ పచ్చి అబద్దాలు : మేడా మల్లిఖార్జునరెడ్డి

తనపై టీడీపీ నేతలు చేసేవన్నీ పచ్చి అబద్దాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి అన్నారు. రాజంపేటలో నిర్వహించిన పార్టీ సమావే శానికి తనను ఆహ్వానించలేదని చెప్పారు. టీడీపీకి వ్యతిరేకంగా పని చేసిన వారితో సమావేశం నిర్వ హించటం శోచనీయమ న్నారు. తాను పార్టీ మారేం దుకు ఎవరినీ సంప్రతించ లేదని స్పష్టం చేశారు. మంత్రి ఆదినారాయణరెడ్డి అవమానపరిచేలా మాట్లాడటం సహించరానిదని పేర్కొన్నారు.

ఆర్టీసీ పరిరక్షణకు రూ.3,720 కోట్లు కేటాయించాలి: జేఏసీ

విశాలాంధ్ర - అమరావతి : ఆర్టీసీ పరిరక్షణకు బడ్జెట్‌లో తక్షణమే రూ.3,720 కోట్లు కేటాయించాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు డిమాండు చేశారు. ఆదివారం ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయం నందు ఇయూ రాష్ట్ర అధ్యక్షులు వైవీ రావు అధ్యక్షతన ఆర్టీసీలోని అన్ని కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేఏసీగా 13 మందితో కమిటీని ఎన్నుకున్నారు. జేఏసీ కన్వీనర్‌గా పలిశెట్టి దామోదర రావు(ఇయూ), కో-కన్వీనర్లుగా సీహెచ్ సుందరయ్య(ఎస్‌డబ్ల్యూఎఫ్), వి.వరహాల నాయుడు(కె.పి)లను ఎన్నుకున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల కృషి ఫలితంగా రూ.2 వేల కోట్లు సంస్థకు ఆదాయం పెరిగిందని అన్నారు. ఆర్టీసీలో వస్తున్న పలు నష్టాలను ప్రభుత్వమే భరించాలని డిమాండు చేశారు.

నీట్ ఫైల్‌కు రెక్కలు

(మొదటిపేజీ తరువాయి)

మరింత సంపన్నులుగా మారనున్నారు. నీట్‌లో అర్హత పొందితే చాలు ధనిక కుటుంబాలకు చెందిన విద్యార్థులు డబ్బులు పెట్టి మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు పొందే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. ఇందుకు సంబంధించిన ఫైలే ఇప్పుడు ఎంసీఐలో కనిపించకపోవటం వివాదస్పదంగా మారింది. అత్యంత కీలకమైన నీట్ పర్సంటైల్ నిర్ణయానికి సంబంధించిన ఫైల్ కనిపించడంలేదని ఎంసీఐ స్పష్టం చేయటం గమనార్హం. దేశవ్యాప్తంగా 60 వేల మెడి కల్, డెంటల్ సీట్లే అందుబాటులో ఉన్నాయి. ఈ సీట్లకు దేశ వ్యాప్తంగా సుమారు ఆరు లక్షల మంది నీట్ పరీక్ష రాస్తున్నారు. దీంతో సాధారణంగానే పోటీ తీవ్రంగా ఉంటోంది. ఏటా అభ్యర్థుల సంఖ్య పెరుగుతుండటంతో వ్యాపారం చేసుకునేందుకు అనుమతిం చాలని మెడికల్ కాలేజీ యాజమాన్యాలు కేంద్రాన్ని కోరాయి. దీనిపై మోడీ సర్కార్ వెంటనే నిబంధనలు మార్పులు చేసి వైద్య సీట్లను వ్యాపారంగా మార్చేసింది. దీనివల్ల ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు వైద్యను అభ్యసించే అవకాశం లేకుండాపోయింది.

ఎలా బయటకొచ్చిందంటే...

నీట్ పర్సంటైల్ విధానంలో కటాఫ్ మార్కులను మరింత కుదిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయం ప్రకారం 720 మార్కులకు జనరల్ కేటగిరి విద్యార్థులు 119 (16.50 శాతం) మార్కులు, జనరల్ కేటగిరి విద్యార్థులు 96 (13.33 శాతం) మార్కులు సాధిస్తే ప్రైవేటు కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్‌లో చేరిపోవచ్చు. ఈ విధానంపై తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన వివరాలు వెల్లడించాలంటూ సామాజిక కార్యకర్త, న్యాయవాది దేవ్ అశిశ్ భట్టాచార్యా సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద గతేడాది డిసెంబరులో దరఖాస్తు చేశారు. అప్పుడుగానీ ఎంసీఐలో ఫైల్ మాయమైన వ్యవహారం బయటపడలేదు. నీట్ పరీక్షలో అర్హత సాధించి మెడికల్, డెంటల్ కాలేజీల్లో ప్రవేశానికి పర్సంటేజ్‌కు బదులు పర్సంటైల్ విధానాన్ని అవలంభించాలంటూ కేంద్రం తీసుకున్న నిర్ణయం, ఇందుకు మొదటి నుంచి చివరి వరకు సాగిన ఉత్తరప్రత్యుత్తరాలు తెలియజేయాలని ఆయన ఎంసీఐని కోరారు. పర్సంటేజ్‌ను పర్సంటైల్‌గా మారుస్తూ మెడికల్ కౌన్సిల్ చట్టంలో పొందుపరిచారా లేదా కూడా వెల్లడించాలని కోరారు. అయితే, నీట్ పర్సంటైల్ నిర్ణయానికి సంబంధించిన డాక్యుమెంట్లు కలిగిన ఫైలే కనిపించటంలేదని ఎంసీఐ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ గత నెల 19న లిఖితపూర్వకంగా తెలియజేయటం గమనార్హం.

ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

ఎంసీఐలో కీలక ఫైల్ మాయంకావటంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆర్టీఐ కార్యకర్త భట్టాచార్య డిమాండు చేశారు. ఈ మేరకు ఆయన ఢిల్లీ పోలీస్ కమిషనర్ అమూల్యా పట్నాయక్‌కు ఈ నెల 14న లేఖ రాశారు. దేశంలోనే అత్యంత కీలకమైన ఎంసీఐలో అతి ముఖ్యమైన ఫైల్ కనిపించటంలేదని, దీనిపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలన్నారు. భవిష్యత్‌లో ఎందరో వైద్యులను తీర్చిదిద్దాల్సిన ఎంసీఐలోనే ఫైల్ కనిపించకపోవటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ ద్వారా మెడికల్, డెంటల్ కాలేజీల్లో ప్రవేశం కోసం విద్యార్థుల యోగ్యతను ఎంపిక చేసే విధానంలో పలు అక్రమాలు చోటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇవన్నీ బహిర్గతం కాకూడదనే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఫైల్‌ను మాయం చేసిందని ఆయన ఆరోపించారు. ఎంసీఐ ఫైల్ కీలకమేకాకుండా ప్రభుత్వ ఆస్తి అని, దేశ ప్రయోజనాల దృష్ట్యా దానిని పరిరక్షించాలని బాధ్యత కేంద్రంపైనే ఉందన్నారు. ఎంసీఐలో ఫైల్ మాయంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయటంతోపాటు అందుకు కారకులను గుర్తించాలని పోలీస్ కమిషనర్‌ను డిమాండు చేశారు. తక్షణమే ఫైల్‌ను గుర్తించి, విలువైన డాక్యుమెంట్‌లను సంబంధిత అధికారుల నుంచి రాబట్టాలని కోరారు.

ప్రతిభలేకున్నా సీటు...

మెడికల్, డెంటల్ కాలేజీల్లో విద్యార్థుల ప్రవేశానికి పర్సంటైల్ విధానాన్ని అమలు చేసేలా నీట్ నిబంధనలలో మార్పులు చేయటం వల్ల ప్రతిభలేని వారు కూడా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు పొందే అవకాశం ఉంది. 2015 వరకు నీట్‌లో అర్హతను బట్టి 50 శాతం సీట్లు జనరల్ కేటగిరి, 40 శాతం రిజర్వుడు కేటగిరి విద్యార్థులకు కేటాయించారు. ఎంసీఐలో మాయమైన తాజా ఫైల్ ప్రకారం నీట్‌లో 720 మార్కులకు 119 (16.50 శాతం) మార్కులు సాధించిన జనరల్ కేటగిరి విద్యార్థులు ఎంచక్కా మెడికల్, డెంటల్ కాలేజీల్లో అడ్మిషన్ పొందే అవకాశం ఉంది. అదే రిజర్వుడు కేటగిరి విద్యార్థులైతే కేవలం 96 (13.33 శాతం) మార్కులు సాధిస్తే సీటును పొందవచ్చు. 2016 నుంచి పర్సంటైల్ విధానంలో కటాఫ్ మార్కులను తగ్గిస్తూ వచ్చారు. దీనివల్ల ప్రైవేటు మెడికల్, డెంటల్ కాలేజీల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగే అవకాశాలు ఉన్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. 2016లో మార్చిన నిబంధనల ప్రకారం 50వ పర్సంటైల్ కటాఫ్ మార్కులు 148కు (20.80 శాతం) తగ్గిపోయింది. రిజర్వుడు కేటగిరిలో 16.30 శాతం (118) మార్కులు సాధిస్తే మెడికల్, డెంటల్ కాలేజీల్లో చేరే అవకాశం ఉంది. 2017లో కటాఫ్ మార్కులను కేంద్రం మరింత కుదించింది. జనరల్ కేటగిరికి 131 మార్కులు (18.20 శాతం), రిజర్వుడుకు 107 మార్కులు (14.80 శాతం)గా నిర్ణయించింది. గతేడాది జనరల్ విద్యార్థులు 119 మార్కులు (16.50 శాతం), రిజర్వుడు కేటగిరి విద్యార్థులు 96 మార్కులు (13.33 శాతం) సాధిస్తే మెడికల్, డెంటల్ కాలేజీల్లో సీటు లభించేస్తుంది.

పర్సంటైల్ ప్రమాదకరం : నిపుణులు

ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు కేంద్రం అమలు చేస్తున్న పర్సంటైల్ విధానం ప్రమాదకరమని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విధానం వల్ల అయోగ్యులుసైతం వైద్య విద్యను అభ్యసించే అవకాశం కల్పించటం దురదృష్టకరమంటున్నారు. ఈ విధానం వల్ల భవిష్యత్‌లో వైద్య విద్య మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్పుల కుప్ప

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం అప్పుల బాట పడుతున్నది. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓట ర్లను ఆకట్టుకోవడంలో భాగంగా సంక్షేమ పథ కాల కేటాయింపులను పెంచుతుండటం కూడా ఆర్థిక క్రమశిక్షణకు భంగం వాటిల్లుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ద్రవ్యలో టును దేశ జీడీపీలో 3.3 శాతానికి (రూ.6.24 లక్షల కోట్లు) కట్టడి చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించిన విషయం తెలిసిందే. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2017-18)లో ద్రవ్యలోటును 3.5 శాతానికే కట్టడి చేశారు. అయితే గతేడాది నవంబర్‌తో ముగిసిన ఎనిమిది నెలల కాలంలోనే ద్రవ్య లోటు రూ.7.17 లక్షల కోట్లకు చేరింది. ఇంకా నాలుగు నెలలు మిగిలి ఉండగానే 114.8 శాతంగా నమోదు కావడం ప్రభుత్వాన్ని కలవర పెడుతున్నది.

నెరవేరని పెట్టుబడుల ఉపసంహరణ

ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా ఖజానాకు రూ.80,000 కోట్ల నిధులను తరలించాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే ఇప్పటిదాకా రూ.34,000 కోట్లకుపైగానే సమీకరించింది. ఓ వైపు పెరుగుతున్న రుణ భారం.. మరోవైపు నెరవేరని పెట్టుబడుల ఉప సంహరణ లక్ష్యం.. ఇంకోవైపు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తదితర మార్గాల ద్వారా పడిపో తున్న ఆదాయం.. మోదీ సర్కారుపై ముప్పేట దాడినే చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వ సంస్థల నుంచి డివిడెండ్లపై ఆశలు పెట్టుకున్న ప్రభుత్వం.. ఆర్బీఐ మిగులు నిల్వలపై కన్నేసింది. ఆ సొమ్ముతో పాత పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలుతో ఏర్పడిన ఇబ్బందులనే గాక, ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ రుణ సంక్షోభం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలో కలిగిన సమస్యలనూ అధిగమించవచ్చునని భావించింది. అది కుదురకపోవడంతో ఆర్బీఐ నుంచి మధ్యంతర డివిడెండ్‌ను మోదీ సర్కారు కోరుతున్న విషయం తెలిసిందే.

హోదా ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)



ఢిల్లీలో లాఠీచార్జి చేయడం అమానుష మన్నారు. కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ హోదాపై స్పందించిన తీరు అత్యంత బాధాకరమని రామకృష్ణ విమర్శించారు. పార్లమెంటులో ఓటు ఆన్ అకౌంట్ బడ్జెట్ రోజున రాష్ట్రంలో బంద్ నిర్వహించాలని, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో విద్యార్థి సంఘాలతో భారీఎత్తున ర్యాలీ చేపట్టి కేంద్రానికి వినిపించేలా నినదించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పర్యటనకు మోడీ ఎప్పుడొచ్చినా ఖాళీ కుండలతో నిరసన తెలియచేస్తామని రామకృష్ణ వెల్లడించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ హోదా పోరాటం చివరి అంకానికి చేరుకుంద న్నారు. రానున్న 50 రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేయాలని సూచించారు. విద్యార్థులను భాగస్వాములను చేయాలని, హోదాపై పార్లమెం టులో ప్రకటన చేసేలా ఒత్తిడి తీసుకురావాలని ముప్పాళ్ల అన్నారు. చలసాని శ్రీనివాస్ మాట్లా డుతూ వ్యక్తిగత దూషణలు పక్కనపెట్టి రాజకీయ పార్టీలు హోదా ఉద్యమంలో పాల్గొనాలని, ఐక్యఉద్యమాలకు ముందుకు రావాలని పిలుపుని చ్చారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం ఎంపీ రాజా ప్రయత్నిస్తున్నారని, అది లభించ గానే అన్ని రాజకీయ పార్టీలతో కలిసి వెళ్లి హోదా ఆవశ్యకతను రాష్ట్రపతికి వివరిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నేత గంగాధర్ మాట్లా డుతూ ప్రస్తుతం జరుగుతున్న ఉద్యమం మరి కొన్ని రోజులు పాటు సజీవంగా ఉండాలని అభిలషించారు. అధికారంలోకి వస్తే హోదా ఇస్తామని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించిందని గుర్తుచేశారు. 2019లో కేంద్రంలో ప్రభుత్వం మారబోతుందని, హోదా ఇచ్చే పార్టీయే అధి కారంలోకి వస్తుందన్నారు. ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి మాట్లాడుతూ హోదా కోసం ప్రజల పక్షాన మండలిలో తమ వాణి వినిపిస్తామన్నారు. ఇప్పటికే విభజన హామీలపై పోరాటాలు జరుగుతున్నాయని, రాష్ట్రానికి రూ.75 వేల కోట్లు రావాల్సి ఉందని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. ఆర్టీసీ చైర్మన్ వర్ల రామయ్య మాట్లాడుతూ హోదా విషయంలో రాష్ట్ర ప్రజలను మోసం చేసిన మోడీకి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. రాష్ట్ర సంక్షేమమే లక్ష్యంగా బీజేపీతో కలిసి ప్రయాణించామని, ఎన్డీయే మోసం గ్రహించి ప్రత్యక్ష పోరాటానికి దిగామని చెప్పారు. సాధన సమితి ఉద్యమానికి టీడీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. హోదా ఉద్యమకారులపై కేసులు ఎత్తి వేసే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళతానని వర్ల రామయ్య హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, ఏపీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణాంజనేయులు ప్రసంగించారు. వక్తల సూచనలు పరిగణనలోకి తీసుకొని సోమవారం కార్యాచరణ ప్రకటిస్తామని చలసాని శ్రీనివాస్ తెలిపారు. ప్రొఫెసర్లు జార్జి విక్టర్, సదాశివరెడ్డి, తాటికొండ నరసింహారావు, ఆప్ నేత రామారావు, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న పాల్గొనగా..మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ వందన సమర్పణ చేశారు.

హామీలన్నీ అమలు చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేయలేదన్నారు. ఐకేపీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే ఆలోచన ఉందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రతి నియోజకవర్గంలో రూపకల్పన చేసి 45 వేలకు పైగా ఉన్న మహిళా సంఘాలకు వీటిని అప్పచెబుతామ న్నారు. రాష్ట్రంలో నకిలీ, కల్తీ బెడదను నివా రించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న మూడేళ్లలో కోటి 25 లక్షల ఎకరాలకు నీరందించబోతున్నామని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులపై ఇప్పటివరకు రూ.99 వేల కోట్లు ఖర్చు పెట్టామన్నారు. ఆన్ గోయింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ.లక్షా 17 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నామని, మనకు కేటా యించిన నీటి వాటాను సంపూర్ణంగా వినియో గించుకునేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు 24 వేల కోట్ల నిధులు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫారసు చేసిందని, కానీ కేంద్రం మనకు రూ.24 కూడా ఇవ్వలేదని కేసీఆర్ తెలిపారు. ఇప్పటివరకు 6,600 మంది రైతులకు బీమా పరిహారం అందించినట్లు వెల్లడించారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని, ఇది మరింత పారదర్శకంగా ఉంటుందన్నారు. పేదల కోసం కట్టాల్సిన ఇళ్ల సంఖ్య ఎంత అనేది లెక్క తేల్చే పనిలో ఉన్నామని చెప్పారు. అడవులను పరిరక్షించే బాధ్యత మనపై ఉందని, ఢిల్లీ లాంటి రాష్ట్రాల్లో డబ్బులు పెట్టి ఆక్సిజన్ కొనుక్కునే దుస్థితి నెలకొందన్నారు. అందుకే అడవుల పరిరక్షణ కోసం కఠిన చర్యలు అమలు చేస్తున్నామని, పోడు వ్యవసాయానికి ఎక్కడో అక్కడ ముగింపు పలకాలన్నారు. కంటి వెలుగు పథకంలో భాగంగా వరంగల్ జిల్లాలో పలువురికి కళ్లు పోయాయని కాంగ్రెస్ సభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి చెప్పడం సుద్ధతప్పన్నారు. కేవలం పరీక్షలు మాత్రమే చేస్తున్నామే కానీ ఆపరేషన్‌లు జరగలేదని వెల్లడించారు. మూడేళ్లు బాగా పనిచేస్తేనే కొత్త పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామన్నారు. కొత్తగా ఏర్పడిన అన్ని గ్రామపంచాయతీలకు బీటీ రోడ్లు వేస్తామని స్పష్టం చేశారు. నిరుద్యోగ భృతిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా అమలు చేస్తామన్నారు. శాంతిభద్రతలు అద్భుతంగా అమలు కావడం గర్వకారణమని, పోలీస్ కమాండ్ కంట్రోల్ అన్ని విభాగాలను సమన్వయం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మంచి పథకాలు ఎవరు తెచ్చినా మెచ్చుకోవాల్సిందేనన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ చాలా మంచి పథకమని చెప్పారు. అందుకే ఎలాంటి మార్పులు లేకుండా టీఆర్ఎస్ కూడా ఆరోగ్యశ్రీని అమలు చేసిందన్నారు. ఆరోగ్యశ్రీ బాగున్నందునే కేంద్రం అమలు చేస్తున్న ఆరోగ్య పథకంలో తెలంగాణ చేరలేదని తెలిపారు.

డబ్బులిచ్చేశారు..!

(మొదటిపేజీ తరువాయి)

వర్గాలు వివరించాయి. 2016 సెప్టెం బర్‌లో ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత చెల్లించాల్సిన మొత్తంలో 15 శాతం ప్రభుత్వం చెల్లించింది. ప్రాజెక్టు నిర్వహణ,సిబ్బంది శిక్షణ, ఇతర వాయిదాల చెల్లింపులను ముందుగానే నిర్ణయించారు. ఈ నిర్ణయాల ప్రకారమే వీటికి కూడా చెల్లింపులు జరిగినట్లు ఆ వర్గాలు పేర్కొ న్నాయి. తక్కిన మొత్తం వాయిదాల ప్రకారం 2022 నాటికి విమానాలను అందజేసిన తర్వాత చెల్లిస్తారు. ఏడాది సెప్టెంబరులో నాలు గు రాఫెల్ యుద్ధ విమానాలు భారత వైమానిక దళానికి అందచేస్తారు. ఈ విమానాలను నడిపే 10 మంది పైలెట్లకు, ఇతర సిబ్బందికి ఆతర్వాత శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందే వారిలో 10 మంది ఇంజనీర్లు, 40 మంది సాంకేతిక నిపుణులు కూడా ఉన్నారు. షెడ్యూలు ప్రకారం ఈ జెట్ విమానాలు 2020 మే నెలలో హర్యానాలోని అంబాలా వైమానిక స్థావరానికి చేరుకుంటాయి. మొదటి రాఫెల్ యుద్ధవి మానానికి వివిధరకాల పరీక్షలు నిర్వహిస్తు న్నారు. 2022 నాటికి ఈ విమానం అన్ని రకాలుగా సిద్ధమై వైమానికి దళాలకు అందుబాటులోకి వస్తుంది. తక్కిన 35 యుద్ధ విమానాలు పైన తెలిపిన సమయానికి 4-6 చొప్పున మనదేశానికి చేరుకుంటాయి. అవస రమైన హార్డువేర్, సాఫ్ట్‌వేర్‌ను కూడా అప్పటికి భారతదేశానికి అందిస్తారు. ఈ రెండు సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసేందుకు మరో ఆరునెలలు పడుతుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. రాఫెల్ విమానాల కొనుగోలు ఒప్పందంలో భారీ కుంభకోణం జరిగిందని, ఒప్పందంలో భాగంగా ఆఫ్‌సెట్ భాగస్వామిగా అనిల్ అంబానీకి చెందిన ఏ అనుభవం లేని కంపెనీని చేర్చుకోవడం ద్వారా వారికి రూ.30 వేల కోట్లకు పైగా ప్రయోజనాన్ని చేకూర్చారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఒప్పందానికి సంబంధించిన వివరాలను పార్లమెంటుకు కూడా మోడీ ప్రభుత్వం తెలియచేయలేదు. ఈ ఒప్పందానికి సంబంధించిన ఆరోపణలపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ విచారణ ఒప్పందానికి మాత్రమే పరిమితమైంది. భాగస్వామి ఎంపిక, యూపీఏ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాన్ని మోడీ ప్రభుత్వం రద్దు చేయడానికి గల కారణాలపైనా, అలాగే విమానం ఖరీదును 3 రెట్లు పెంచి ఒప్పందం కుదుర్చుకున్నారన్న ఆరోపణలపైనా విచారణ జరగలేదు. కాగ్ నివేదికను, పార్లమెంటరీ కమిటీ పరిశీలన జరగకుండానే జరిగినట్లు ప్రభుత్వం కోర్టుకు అఫిడవిట్ దాఖలు చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అయినప్పటికీ ప్రధాని మోడీ ఇందుకు సంబంధించిన ఏ వివరాలను వెల్లడించలేదు.

14 | విజయవాడ
సోమవారం
21 జనవరి 2019
విశాలాంధ్ర

క్రీడలు

కోహ్లి రికార్డు బద్దలు



ముంబై : పోర్ట్ ఎలిజబెత్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన తొలివన్డేలో దక్షిణాఫ్రికా ఓపెనర్ హాషీం ఆమ్లా (120 బంతుల్లో 108 నాటౌట్, 7 ఫోర్లు, 1 సిక్స్) చాన్నాళ్ల తర్వాత తనదైన స్థాయి ఇన్నింగ్స్ ఆడాడు. ఈ క్రమంలో ఆమ్లా... టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి రికార్డుని అధిగమించాడు. వన్డేల్లో వేగంగా 27 సెంచరీల మైలురాయిని అందుకున్న ఆటగాడిగా నిలిచాడు. వన్డేల్లో 27 సెంచరీలు సాధించేందుకు గాను కోహ్లికి 169 ఇన్నింగ్స్‌లు అవసరం కాగా, ఆమ్లా 167 ఇన్నింగ్స్‌లోనే 27 సెంచరీలు చేయడం విశేషం. కోహ్లి కంటే ముందు సచిన్ (254 ఇన్నింగ్స్) పేరిట ఈ రికార్డు ఉంది. 2017, జనవరిలో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లి ఆ రికార్డుని బద్దలు కొట్టాడు. తాజాగా, ఇప్పుడు కోహ్లి రికార్డుని ఆమ్లా అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో ఆమ్లా సెంచరీ సాధించడంతో దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 266 పరుగులు చేసింది. మరో ఓపెనర్ హెన్‌డ్రిక్స్ (45) ఫర్వాలేదనిపించాడు.

5 వికెట్ల తేడాతో నెగ్గిన పాక్

ఆమ్లా, హెన్‌డ్రిక్స్ తొలి వికెట్‌కు 82 పరుగులు జోడించారు. హాఫీజ్ వేసిన ఇన్నింగ్స్ 48వ ఓవర్ చివరి బంతిని సిక్సర్‌గా మలిచి ఆమ్లా కెరీర్‌లో 27వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అనంతరం 267 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ 49.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేధించింది. దీంతో ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ 5 వికెట్ల తేడాతో గెలిచింది.

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనం..!



కాన్‌బెర్రా: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలన జరిగింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రీక్వార్టర్స్‌లో దిగ్గజ క్రీడాకారిణి మరియా షరపోవా అనూహ్యంగా ఓటమిపాలైంది. షరపోవాపై 4-6, 6-1, 6-4 తేడాతో ఆష్‌బార్టీ సంచలన విజయం నమోదు చేసింది. ఆదివారం ఇక్కడి మెల్‌బోర్న్ పార్క్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ఆష్‌బార్టీ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో గ్రాండ్‌స్లామ్‌లో తొలిసారి ఆష్‌బార్టీ క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఈ దశాబ్దంలో తొలిసారి అస్ట్రేలియన్ క్వార్టర్ ఫైనల్‌కు చేరిన తొలి ఆస్ట్రేలియన్ ప్లేయర్‌గా ఆమె రికార్డు సృష్టించింది. 22 ఏళ్ల ఆష్‌బార్టీ 5సార్లు గ్రాండ్‌స్లామ్ విజేత అయిన షరపోవాను ఓడించడం విశేషం.

ఎవరీ ఆష్‌బార్టీ

2014లో టెన్నిస్‌కు విరామం ఇచ్చి అనూహ్యంగా క్రికెట్ ఆడిన ఆష్‌బార్టీ.. మహిళల బిగ్‌బాష్‌లీగ్‌లో బ్రిస్బేన్ హీట్ జట్టుకు ప్రాతినిథ్యం వహించింది. టెన్నిస్ రాకెట్ వదిలి బ్యాట్ పట్టుకున్న ఈ యంగ్ లేడీ క్రికెట్‌లోనూ అదరగొట్టింది. లీగ్ అరంగేట్ర మ్యాచ్‌లోనే 29 బంతుల్లో 37 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. అనంతరం మళ్లీ టెన్నిస్ రాకెట్ పట్టుకున్న ఆష్‌బార్టీ గతేడాదే కెరీర్ బెస్ట్ 15వ ర్యాంకును సొంత చేసుకుంది. ఇక తాజాగా ఐదు గ్రాండ్ స్లామ్‌లు గెలిచిన టెన్నిస్ దిగ్గజం షరపోవాను మట్టికరిపించి ఔరా అనిపించింది. కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్ ఫైనల్ చేరింది.

కరణ్ కూడా బాధ్యుడే : శ్రీశాంత్



ముంబై : క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్ వివాదంలో బాలీవుడ్ నిర్మాత కరణ్ జోహార్ బాధ్యత కూడా ఉందని బిగ్‌బాస్-12 రన్నరప్, మాజీ క్రికెటర్ శ్రీశాంత్ అభిప్రాయ పడ్డాడు. ఓ ఇంటర్వ్యూ సందర్భంగా శ్రీశాంత్ ఈ వ్యాఖ్యలు చేశాడు. కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా వ్యవహరించే ఓ టీవీ షోలో పాండ్య, రాహుల్ మహిళలను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అవి వివాదానికి దారి తీసి, చివరకు ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్ నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 'ఒకవేళ షోకు హాజరైన వారు ఎక్కువ ఉత్సాహంతో ఉంటే.. వ్యాఖ్యాత, ఈ ప్రపంచం ఏం వినాలనుకుంటుందో వారికి చెప్పాలి. ఛానెల్ కోసం ఆ వ్యక్తి గురించి అవగాహన లేకుండా ఓ ప్రశ్న అడిగితే, వచ్చిన వారు పరిణితి చెందిన వ్యక్తులు కాకపోతే ఇతరులు బాధపడే వ్యాఖ్యలు చేయొచ్చు. దానికి వ్యాఖ్యాత బాధ్యత కూడా ఉంటుంది. అతడు ఆపి ఉండాలి' అని కరణ్ జోహార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. గతంలో జరిగిన ఓ ఇంటర్వ్యూలో కూడా శ్రీశాంత్..ఆ ఇద్దరు క్రీడాకారులను సమర్థిస్తూ మాట్లా దాడు. 'జరిగింది తప్పే. వారు తప్పుగా మాట్లాడారు. ఇంతకంటే పెద్ద తప్పులు చేసిన వారు ఉన్నారు. వారు ఇప్పటికీ ఆడుతూనే ఉన్నారు. క్రికెట్ మాత్రమే కాదు ఇతర రంగాల్లోనూ ఉన్నారు. ఇప్పుడు వారే దీని గురించి మాట్లాడుతున్నారు. అవకాశం వస్తే పులుల్లా గర్జిస్తారు' అని విమర్శించారు. ఆ కార్యక్రమం మీద విమర్శలు రావడంతో సంబంధిత ఛానెల్ దాన్ని తొలగించింది.

జీవితంకంటే ఏదీ ఎక్కువ కాదు

ముంబై : టీమిండియా సారథి విరాట్ కోహ్లి క్రికెట్ చరిత్రలో తనకంటూ ఓ ఇమేజ్ ఏర్పరచుకున్నాడు. ప్రదేశంతో సంబంధం లేకుండా తనలోని ఉద్వేగాలను బయటపెట్టేస్తాడు. అయితే ఈ స్వభావాన్ని కొందరు దూకుడు అంటే మరికొందరు కోహ్లిలో ఉండే నాయకత్వ లక్షణానికి ప్రతీక అది అంటుంటారు. 'ఇన్ని రోజులు ఆటకు ప్రాధాన్యం ఇచ్చా. ఇకపై క్రికెట్‌కే కాకుండా నా కుటుంబానికి సమయం కేటాయించాలని అనుకుంటున్నాను. కొన్నేళ్లుగా నాకు నేను సమయం కేటాయించుకోవడం లేదు. ఇప్పుడు నాజీవితంలోకి నా జీవిత భాగస్వామి వచ్చింది. తనకి, నా కుటుంబానికి సమయం కేటాయించాలనిపిస్తోంది. అనుష్కా నన్ను అర్థం చేసుకోగలుగుతోంది కాబట్టే విదేశీ పర్యటనలో విజయవంతం కాగలుగుతున్నాను. కాబట్టి ఇకపై నా కుటుంబమే నాకు ముఖ్యం. వృత్తి పరంగా, వ్యక్తి గతంగా మనం ఎక్కడికి వెళ్లినా తిరిగి చేరుకోవాల్సింది ఇంటికే కదా!. క్రికెట్ జీవితంలో భాగం మాత్రమే. జీవితం కంటే ఏదీ ఎక్కువ కాదు. క్రికెట్‌ను సీరియస్‌గా తీసుకోకపోతే మరిన్ని విజయాలు సాధించలేమని ఎంతోమంది అంటుంటే విన్నాను. నా వరకు అది నిజం కాదు. నేను సరిపడినంత ఆడాను. నిజానికి నేను లక్ష్యంగా పెట్టుకున్న దానికంటే ఎక్కువగా ఆడాను. దీనికంటూ ఒక రోజు ముగింపు వస్తుంది' అంటూ అని కోహ్లి యాప్ ద్వారా చెప్పుకొచ్చాడు.

ఓటమికి ఎవరూ బాధ్యులు కారు

- ఆసీస్ కెప్టెన్ ఆరోన్ ఫించ్
- ధోనీనే కారణం : లాంగర్





సిడ్నీ : భారత్‌తో జరిగిన వన్డే సిరీస్ కోల్పోవడంపై ఎవర్నీ నిందించలేమని ఆసీస్ పరిమిత ఓవర్ల సారథి ఆరోన్ ఫించ్ అన్నాడు. జట్టులో ఆటగాళ్లందరూ విజయం కోసం ప్రయత్నించారని చెప్పాడు. వన్డే సిరీస్ కోల్పోవడంపై ఫించ్ మీడియాతో మాట్లా డాడు. 'పరిమిత ఓవర్లలో ఆడేటప్పుడు ఒకప్పుడు మా బ్యాట్స్‌మెన్ చాలా ఇబ్బం దులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఆ సమస్యను మేం దాదాపుగా అధిగమించాం. మూడు వన్డేల్లోనూ బాగానే బ్యాటింగ్ చేశాం. అందులో ఎంతో పురోగతి సాధించాం. బ్యాటింగ్ సమస్యకు ఇప్పుడిప్పుడే సమాధానం దొరుకుతోంది. సారథిగా ఈ విషయం నన్ను కలవరపెట్టేది. కానీ టీమిండియాతో జరిగిన మూడు వన్డేల తర్వాత నాకు జట్టుపై కాస్త నమ్మకమేర్పడింది. సిరీస్ గెలవడం కంటే ముందు ఆటను మెరుగుపరుచుకుంటే మ్యాచ్‌లో విజయం సాధించడం పెద్ద సమస్య కాదు. నా బ్యాటింగ్ శైలిలో కూడా మార్పు వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఫలానా బౌలర్ లేదా బ్యాట్స్‌మెన్ కారణంగా సిరీస్ కోల్పోయామనే సమస్య మాకు లేదు. మా ఓటమికి ఎవరూ బాధ్యులు కారు. మా జట్టులో ప్రతి ఒక్కరూ బాగా ఆడారు' అని కొనియాడాడు. టీమిండియాతో మ్యాచ్‌ల తర్వాత ఆసీస్..శ్రీలంకతో టెస్టులు ఆడనుంది. ఈ పర్యటనకు ఫించ్ దూరం కానున్నాడు. బ్యాటింగ్‌ను మరింత మెరుగుపరుచుకోవడానికి తనకో మంచి అవకాశం దొరికిందని.. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటానని ఆయన తెలిపాడు.

ధోనీనే కారణం : లాంగర్

టెస్ట్ సిరీస్ మాదిరే వన్డే సిరీస్‌ను గెలిచే అవకాశాలను చేతులారా చేజార్చుకుని ఓడిపోయామని ఆస్ట్రేలియా ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్ వ్యాఖ్యానించాడు. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన మూడో వన్డేలో టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనికి పలు అవకాశాలు ఇవ్వడం వల్లే తాము ఓడిపోయామని చెప్పాడు. మూడో వన్డేలో ధోని (87 నాటౌట్), కేదార్ జాదవ్ (61 నాటౌట్) అజేయ అర్థశతకాలు బాదడంతో 231 పరుగుల లక్ష్యాన్ని భారత్ మరో 4 బంతులు మిగిలి ఉండగానే ఛేదించిన సంగతి తెలిసిందే. దీంతో మూడు వన్డేల సిరీస్‌ని 2-1తో చేజిక్కించుకుంది. అంతేకాదు ఆస్ట్రేలియా గడ్డపై ద్వైపాక్షిక వన్డే సిరీస్ గెలవడం భారత్‌కు ఇదే తొలిసారి.

తొలి జట్టుగా

ఒక్క ఫార్మాట్లో కూడా సిరీస్ కోల్పోకుండా ఆసీస్ పర్యటనను ముగించిన తొలి జట్టుగా టీమిండియా అరుదైన ఘనత సాధించింది. మ్యాచ్ అనంతరం జస్టిన్ లాంగర్ మాట్లాడుతూ "ఆసీస్ ఆటగాళ్లు సాయశక్తుల పోరాడారు. కానీ 2-1తో సిరీస్ కోల్పోయాం. టెస్ట్ సిరీస్‌లానే ఈ సిరీస్‌ను గెలిచే అవకాశాలను చేతులారా చేజార్చుకుని ఓడిపోయాం" అని అన్నాడు.



వన్డే మొనగాడు కోహ్లినే..

సిడ్నీ: ఇప్పటివరకు 219 వన్డేల్లో 59కి పైగా సగటుతో 39 సెంచరీలతో 10,385 పరుగులు చేసిన విరాట్ కోహ్లియే ఆల్‌టైమ్ నంబర్ వన్ వన్డే బ్యాట్స్‌మన్ అని ఆస్ట్రేలియా మాజీ సారథి మైఖెల్ క్లార్క్ అభిప్రాయపడ్డాడు. గొప్ప ఆటగాడిగానే కాకుండా తెలివైన సారథి అంటూ కోహ్లిపై ప్రశంసల జల్లు కురిపించాడు. ఆసీస్ గడ్డపై టెస్టు, వన్డే సిరీస్ గెలిచిన ఏకైక భారత, ఆసియా సారథిగా రికార్డు నెలకొల్పడం సాధారణ విషయం కాదన్నాడు. కోహ్లి వయసు ముప్పైయేనని మరింత క్రికెట్ ఆడే అవకాశం ఉన్నందున్న మరిన్ని రికార్డులు నెలకొల్పే అవకాశం ఉందన్నాడు. ఇక టెస్టుల్లోనూ ప్రస్తుతం కోహ్లి అత్యుత్తమ ఆటగాడిగా కొనసాగుతున్నప్పటికీ మరింత రాటు దేలాల్సిన అవసరముం దన్నాడు. ప్రపంచంలోని అన్ని అత్యున్నత మైదానాలలోనూ గొప్పగా రాణించాల్సిన అవసరముందన్నాడు. అలా అయితేనే టెస్టుల్లో కూడా ఆల్‌టైమ్ బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా నిలుస్తాడని పేర్కొన్నాడు. ఇక కోహ్లిసేన ఆస్ట్రేలియాపై చారిత్రక సిరీస్‌లు గెలిచిన అనంతరం ఐదు వన్డేల సిరీస్ కోసం న్యూజిలాండ్‌కు బయలుదేరింది. ఇరుజట్ల మధ్య ఈనెల 23 తొలి వన్డే జరగనుంది.

శ్రీలంక సిరీస్‌కు హాజల్‌వుడ్ దూరం



సిడ్నీ : సొంతగడ్డపై టీమిండియాతో ఎదురైన పరాభవం మరిచిపోకముందే ఆస్ట్రేలియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు పేసర్ జోష్ హాజెల్‌వుడ్ గాయంతో రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌కు దూరమయ్యాడు. వెన్నునొప్పితో బాధపడుతున్న హాజెల్‌వుడ్ త్వరలో శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో పాల్గొనడం లేదని క్రికెట్ ఆస్ట్రేలియా అధికారిక ప్రకటన చేసింది. గతేడాది కూడా హాజెల్‌వుడ్ వెన్నునొప్పి గాయంతో ఆటకు దూరమైన సంగతి తెలిసిందే. హాజెల్‌వుడ్ గాయంపై క్రికెట్ ఆస్ట్రేలియా ఫిజియో డేవిడ్ బెక్లే మాట్లాడుతూ వన్డే వరల్డ్‌కప్ సమయానికల్లా హాజెల్‌వుడ్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాడనే ధీమా వ్యక్తం చేశారు. స్కానింగ్‌లో కింది వెన్నుభాగంలో ఇబ్బందులున్నట్లు తేలిందని, త్వరలోనే అతనికి పునరావాస శిబిరంలో శిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా శ్రీలంక జట్టు రెండు టెస్టు మ్యాచ్‌ల సిరిస్ ఆడనుంది. డే నైట్ టెస్టుగా జరిగే తొలి టెస్టు జనవరి 24న బ్రిస్బేన్ వేదికగా జరగనుంది. ఆ తర్వాత రెండో టెస్టు ఫిబ్రవరి 1 నుంచి మెల్‌బోర్న్ వేదికగా జరగనుంది. కాగా, ఇటీవలే టీమిండియాతో ముగిసిన నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆస్ట్రేలియా జట్టు 2-1తేడాతో చేజార్చుకున్న సంగతి తెలిసిందే.

ఫెదరర్‌కు చేదు అనుభవం



మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌కు చేదు అనుభవం ఎదురైంది. అక్రిడేషన్ మర్చిపోయినందుకు ఫెదరర్‌ను డ్రెస్సింగ్ రూంలో వెళ్లకుండా అక్కడి సిబ్బంది అడ్డుకున్నారు. అక్రిడేషన్ పాస్ లేకపోవడంతో ఫెదరర్ తన సపోర్ట్ సిబ్బంది వచ్చే వరకు అక్కడే వేచి ఉండాల్సి పరిస్థితి తలెత్తింది. అందరితో పాటే రోజర్ ఫెదరర్ ఓపికగా నిలబడగా.. ఆయన కోచ్ ఇవాన్ జుబిసిస్ వెంటనే అక్కడికి వచ్చాడు. ఆయన ఐడీ కార్డ్ చూపించిన తర్వాత గానీ ఫెదరర్‌ను ఆస్ట్రేలియన్ ఓపెన్ నిర్వాహకులు లోపలికి అనుమతించలేదు. ఇందుకు సంబంధించిన వీడియోని ఆస్ట్రేలియన్ ఓపెన్ తన అధికారిక ట్విట్టర్‌లో అభిమానులతో పంచుకుంది. రోజర్ ఫెదరర్‌కి కూడా అక్రిడేషన్ కావాలంటూ ట్వీట్ చేసింది. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ నిబంధనల ప్రకారం ఆటగాళ్లు, కోచ్‌లు, అధికారులు, మీడియా ప్రతినిధులు అక్రిడేషన్ కార్డులను తీసుకెళ్లడం తప్పనిసరి. ఐడీ కార్డులు లేకపోవడంతో ఆటగాళ్లను నిలిపేయడం ఇదే తొలిసారి కాదు. గతంలో మరియా షరపోవాను కూడా ఐడీ కార్డు కోసం కారిడార్లో నిలిపేశారు. ఆటగాళ్లకు ఇచ్చిన అక్రిడేషన్ కార్డుపై సంబంధిత వ్యక్తుల ప్రాథమిక సమాచారంతోపాటు బార్ కోడ్ కూడా ఉంటుంది. సెక్యూరిటీ చెక్ పాయింట్లలో దాన్ని స్కాన్ చేస్తారు. ఇదిలా ఉంటే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రోజర్ ఫెదరర్ ప్రిక్వార్టర్‌కు ప్రవేశించాడు.

'రికార్డు' జల్లికట్టు

2,000 ఎద్దులతో పోటీలు



చెన్నై : సంక్రాంతిని పురస్కరించుకుని తమిళ నాడులో నిర్వహించే జల్లి కట్టు ప్రపంచ రికార్టు సృష్టించింది. 2,000 ఎద్దులతో ఆదివారం జల్లిక ట్టును నిర్వహించడంతో ఇది గిన్నిస్ రికార్డులో చోటు దక్కించుకుంది. ఈ కార్యక్రమాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. పుదుక్కోట్టాయ్, తిరుచి, మధురై నుంచి వచ్చిన సుమారు 2,000లకు పైగా ఎద్దులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి 500మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరందరికీ ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తెచ్చింది. ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజన కింద వీరికి బీమా రక్షణ కల్పించారు. ఈ పోటీల్లో ప్రమాదవశాత్తూ మృతి చెందితే వారికి ఈ పథకం కింద రూ.2లక్షలు ప్రమాదబీమా అందుతుంది. ఈ పోటీల్లో విజేతలకు, ఎద్దుల యజమానులకు రెండు కార్లు, 10 మోటార్‌సైకిళ్లు, 700 సైకిళ్లు, బంగారు, వెండి నాణేలు, గృహోపకరణాలను బహుమతిగా ఇస్తారు. గిన్నిస్ రికార్డు గ్రూప్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, ముగ్గురు విదేశీ న్యాయ నిర్ణేతలు విజేతలను ఎంపిక చేయడానికి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శశికళకు జైల్లో ప్రత్యేక వసతులు

- ఐదు గదులు.. ప్రత్యేకంగా వంటమనిషి
- సమాచార హక్కు చట్టం ద్వారా బట్టబయలు



బెంగళూరు: అక్రమ ఆస్తుల కేసులో బెంగళూరు జైలులో శిక్ష అనుభవిస్తున్న దివంగత ముఖ్యమంత్రి జయలలిత స్నేహితురాలు శశికళకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్లు స్పష్టమైంది. సామాజికవేత్త ఎన్.మూర్తి సమాచార హక్కు చట్టం కింద వేసిన దరఖాస్తు ద్వారా జైలులో శశికళ అనుభవిస్తున్న వసతుల వివరాలు బయటపడ్డాయి. ఆమెకు వీఐపీ సౌకర్యాలు కల్పిస్తున్నారని, జైలు అధికారులు శశికళ విషయంలో తప్పుడు ప్రచారం చేశారని మూర్తి ఆరోపించారు. 'శశికళకు జైల్లో ప్రత్యేక వసతులు కల్పించారన్నది నిజం. ఆమెకు మొదట్లో ఒక్క గది మాత్రమే కేటాయించారు. అయితే ఆమె పక్కన ఉన్న నాలుగు గదుల్లో 2017 ఫిబ్రవరి 14 వరకు మహిళా దోషులు ఉన్నారు. శశికళను జైలుకు తరలించిన తర్వాత వారిని వేరే చోటుకు పంపి.. ఐదు గదులను ఆమెకే కేటాయించారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న ఓ దోషిని శశికళ కోసం వంట చేయడానికి అధికారులు కేటాయించారు. నిబంధనల్ని ఉల్లంఘించి.. శశికళను చూడటానికి గుంపులు గుంపులుగా ప్రజలను అనుమతిస్తున్నారు. నేరుగా ఆమె గదికి వెళ్తున్నారు. 3 నుంచి 4 గంటలపాటు ఉంటున్నారు' అని మూర్తి మీడియాతో అన్నారు. శశికళను సాధారణ దోషిలా పరిగణించడం లేదని, ఆమెకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారని 2017 జులై 13లోనే జైలు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ డి.రూప అన్నారు. వసతుల కోసం జైలు అధికారులకు రూ.2 కోట్లు లంచం ఇచ్చినట్లు అప్పట్లో ఆమె చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించారు.

భారత్ దెబ్బకు పాక్ బెంబేలు



ఇస్లామాబాద్ : భారత్-పాక్‌ల మధ్య కాశ్మీర్‌లో ఉన్న సరిహద్దు నియంత్రణరేఖ వెంబడి పాక్ దళాలు విచక్షణారహితంగా చేస్తున్న కాల్పులకు భారత్ ధీటుగా జవాబిస్తోంది. భారత దళాలు విరుచుకుపడటంతో దిక్కుతోచని పాక్ మరో కొత్త పన్నాగానికి తెరలేపింది. తన దగ్గర ఉన్న హోవిట్జర్ తుపాకులకు అవసరమైన తూటాలను కొనుగోలు చేసేందుకు ఇటలీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఏకంగా 1 లక్ష గుళ్లకు ఆర్డర్ ఇవ్వడం గమనార్హం. 2017 నవంబరులో అమెరికాతో హోవిట్జర్‌లను కొనుగోలుచేసేందుకు భారత్ ముందుకువచ్చింది. ఈ ఒప్పందం విలువ దాదాపు రూ. 5 వేల కోట్లు అని రక్షణ వర్గాలు తెలిపాయి. అయితే వీటిలో కొన్ని మాత్రమే భారత్‌కు చేరుకున్నాయి. అదే సమయంలో పాక్ మాత్రం 121 హోవిట్జర్‌లను ఇటలీ నుంచి దిగుమతి చేసుకుంది.

భారీగా తుపాకీ గుళ్ల దిగుమతిపై ఆందోళన

దాదాపు లక్ష గుళ్ల సరఫరాకు పాక్ ఆర్డర్ ఇవ్వడంపై భారత నిఘా వర్గాలు అప్రమత్తమ య్యాయి. ఇంత భారీ స్థాయిలో వీటిని దిగుమతి చేసుకొని ఎవరిపై ప్రయోగించేందుకు అన్న అంశాన్ని తెలుసుకునేందుకు యత్నిస్తున్నా యి. 15 సంవత్సరాల్లో కాల్పుల విరమణ ఒప్పం దాన్ని పాక్ 2,936 సార్లు అతిక్రమించింది. సరిహద్దుల్లో జనావాసాలపై మోర్టార్లను ప్రయోగించడం, హోవిట్జర్లతో కాల్పులు జరపడవం పాక్‌దళాలకు నిత్య వ్యవహారంగా మారింది. వీటిని భారత దళాలు సమర్థవంతంగా అడ్డుకుంటు న్నాయి. భారత తిరుగు కాల్పుల్లో పాక్ దళాలు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నాయి. జనవరి16న భారతదళాలు జరిపిన కాల్పుల్లో పాక్ సైనికులు ఐదుమంది చనిపోయారు. ఏడు బంకర్లు నేలమట్టమయ్యాయి.

భారత్ అప్రమత్తం

పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తమ బ్రిగేడ్లను అప్రమత్తంగా ఉండామని పాక్‌సైనికాధికారులు ఆదే శించారు. దీంతో పాటు నియంత్రణరేఖ వెంబడి పాక్‌దళాల సంచారం పెరిగిందని భారత సైనిక వర్గాలు తెలిపాయి. భారత్‌లోకి పాక్‌నుంచి చొరబా ట్లను సాయుధదళాలు చాకచక్యంగా ఎదుర్కొంటు న్నాయి. దీంతో పాక్ దళాలు మరిన్ని దాడులు చేసే అవకాశాలను కొట్టిపారేయలేమని భారత నిఘావర్గాలు అనుమానిస్తున్నాయి. పాక్ నుంచి వచ్చే సవాళ్లను ఎదుర్కొంటామని వారి కంటే మనం ఒక్క అడుగు ముందుగా ఉంటామని భారత సైన్యం ఉత్తరక మాండ్ ప్రకటించింది. పాక్ ఎలాంటి దుస్సాహసం చేసిన అందుకు తగిన మూల్యం అనుభవించక తప్పదని భారత దళాలు పాక్‌ను హెచ్చరించాయి.

డ్యాన్స్ 'పాఠాలు'

పిల్లల్లో ఉత్సాహం కోసం ప్రయత్నం..

బీజింగ్ : పాఠశాలలో విద్యార్థులకు ఖాళీ సమయం దొరికితే అందరూ కలిసి ఆడుతూపాడుతూ గడుపుతారు. ఆ సమయంలో టీచర్లు ఎవరూ వారి వద్దకు రారు. అయితే, చైనాలోని ఓ పాఠశాలలో ఈ ప్రధానోపాధ్యాయుడు మాత్రం.. తమ విద్యార్థులకు వద్దకు వెళ్లి వారికి షఫుల్ డ్యాన్స్ నేర్పించారు. ఈ సందర్భంగా ఒకరు ఈ వీడియోను తీయగా, దీన్ని చైనాకు చెందిన ఓ మీడియా సంస్థ తమ ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేసింది. ఇది ప్రపంచ వ్యాప్తంగా వైరల్ అవుతోంది. చైనాలోని షాంఘీ ప్రాంతంలో ఈ పాఠశాల ఉంది. లయబద్ధంగా కాళ్లు, చేతులూ కదుపుతూ షఫుల్ డ్యాన్స్ చేస్తారు. తమ విద్యార్థులకు ఈ డ్యాన్స్ నేర్పించే క్రమంలో ఆ ప్రధానోపాధ్యాయుడు చేతిలో మైక్ పట్టుకుని పాట పాడుతున్నట్లు కూడా పోజులు ఇచ్చారు. కాళ్లు, చేతులు కుడి, ఎడమవైపునకు కదుల్చుతూ ఓ పాటకు లయబద్ధంగా ప్రధానోపాధ్యాయుడు డ్యాన్స్ వేస్తుంటే ఆయన వెనుక నిలబడ్డ విద్యార్థులందరూ ఆయనను అనుసరించారు. చాలా ఉత్సాహంతో వారు వేసిన ఈ డ్యాన్స్ వైరల్ అవుతోంది. 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' తమ ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేసిన ఈ వీడియోకి 2,18,811 షేర్లు, 12 మిలియన్లకు పైగా వ్యూస్ వచ్చాయి. ఇలా డ్యాన్స్ చేయడం వల్ల పిల్లల్లో ఉత్సాహం పెరుగుతుందని ఆ ప్రధానోపాధ్యాయుడు చెబుతున్నారు. వారు ఆరోగ్యకరంగా ఉండవచ్చని అన్నారు. అలాగే, తరగతి గదుల్లో, కంప్యూటర్ల ముందు చాలా సేపు కూర్చునే విద్యార్థులకు ఈ డ్యాన్స్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.